బుధవారం
4•12•2019
కరీంనగర్

• వెల. రూ. 6.50

• సంపుటి 9 • సంచిక 159

• పేజీలు : 14 + 16 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

WWW.NTNEWS.COM
/NTDAILYONLINE






దిశ దారుణ హత్యోదంతంపై మంగళవారం మాదాపూర్‌లో కొవ్వొత్తులతో ఐటీ ఉద్యోగుల నిరసన

## నిరసన జ్వాలలు

'దిశ' హత్యోదంతంపై దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

**'దిశ'** దారుణ హత్యోదంతంపై దేశవ్యాప్తంగా ఆగ్రహజ్వాలలు పెల్లుబుకుతూనే ఉన్నాయి. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారమూ నిరసనలు కొనసాగాయి. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో మహిళలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆందోళన చేపట్టారు. ర్యాలీలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు నిర్వహించారు. దిశ ఘటనపై కేంద్ర మంత్రి హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ నిరసన వ్యక్తంచేశారు. లైంగిక దాడి కేసుల్లో బాధితురాలి వయసు ఎంతో.. అన్ని రోజుల్లోగా తీర్పును ప్రకటించాలని డిమాండ్‌చేశారు. దిశకు న్యాయం చేయాలని కోరుతూ చేంజ్.ఓఆర్‌జీ అనే వెబ్‌సైట్‌లో పిటిషన్లపై 15 లక్షల మంది సంతకాలు చేశారు. 5



మహిళలపై జరుగుతున్న అకృత్యాల గురించి మనం రోజూ వింటూనే ఉన్నాం. దోషులను శాశ్వతంగా జైల్లో ఉంచాలి.
– హేమామాలిని



దోషులను ఉరితీస్తే ఇలాంటి నేరాలు గణనీయంగా తగ్గుతాయా? ఇకపై దేశంలో లైంగిక దాడుల రేటు తగ్గుతుందా?
– అపర్ణాసేన్

### దిశపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నిజామాబాద్ యువకుడి అరెస్ట్ 3



# హైవేల పనుల్లో వివక్ష

రాష్ట్రానికి కేటాయించినవాటికి నంబర్లు ఇవ్వలేదు • పనులు ప్రారంభించడంలో జాప్యం

వర్షాలతో పాడైన హైవేలకు మరమ్మతులు చేయించండి • కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీని కోరిన మంత్రి జగదీశ్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

జాతీయ రహదారుల కేటాయింపుల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. గతంలో రాష్ట్రానికి మంజూరుచేసిన జాతీయ రహదారుల్లో కొన్నింటికి నంబర్లు కూడా ఇవ్వలేదని.. కొన్నింటి పనులు ప్రారంభించలేదని తెలిపారు. రాష్ట్రంలో అపరిష్కృతంగా ఉన్న జాతీయరహదారుల అంశంపై మంగళవారం ఆయన కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. మంత్రి జగదీశ్‌రెడ్డి వెంట లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్ష నేత నామా నాగేశ్వరరావు, ఎంపీలు బడుగుల లింగయ్య యాదవ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్ నేతకాని, మాలోతు కవిత, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గొంగిడి సునీత, టీఆర్‌ఎస్ నేత బొమ్మెర రామ్మూర్తి, ఢిల్లీలో తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ రాసిన లేఖలను గడ్కరీకి అందజేశారు. అనంతరం మంత్రి జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్రానికి 3,150 కిలోమీటర్ల రహదారులు మంజూరుచేశారని.. అందులో 600 కిలోమీటర్ల రహదారులకు నంబర్లు ఇవ్వలేదని చెప్పారు. నంబర్లు ఇచ్చిన రహదారుల పనులు కూడా ప్రారంభించలేదని తెలిపారు. కొత్తగా కేటాయించిన రహదారులకు నంబర్లు ఇవ్వడంతోపాటు, పనులు వేగవంతం చేయాలని గడ్కరీని కోరినట్టు చెప్పారు. ఈ ఏడాది కురిసిన వర్షాలకు జాతీయ రహదారులు చాలావరకు దెబ్బతిన్నాయని, వాటన్నింటికీ వెంటనే మరమ్మతు చేయాలని, హైదరాబాద్ నుంచి భూపాలపల్లి 163వ జాతీయ రహదారిలో రెండుచోట్ల, కోదాడ- మిర్యాలగూడ జాతీయరహదారి 167లో కొన్నిప్రాంతాల్లో అండర్‌పాస్‌లు నిర్మించాలని, చేవెళ్ల- బీజాపూర్ హైవే పనులు వేగవంతం చేయాలని కోరామన్నారు. హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగ్‌రోడ్‌ను త్వరగా చేపట్టాలని, దీని నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం తరపున 50 శాతం ఖర్చు భరిస్తామని కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి తెలిపినట్టు టీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత నామా నాగేశ్వరరావు చెప్పారు. అన్ని అంశాలపై కేంద్రమంత్రి గడ్కరీ సానుకూలంగా స్పందించారని మంత్రి జగదీశ్‌రెడ్డి తెలిపారు.



మంగళవారం కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి రాష్ట్రంలో జాతీయ రహదారుల అంశంపై సీఎం కేసీఆర్ రాసిన లేఖలను అందజేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్షనేత నామా నాగేశ్వరరావు, ఎంపీలు బడుగుల లింగయ్యయాదవ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్ నేతకాని, మాలోతు కవిత, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గొంగిడి సునీత. చిత్రంలో టీఆర్‌ఎస్ నేత బొమ్మెర రామ్మూర్తి, ఢిల్లీలో తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ కూడా ఉన్నారు

**హైవే 63పై ఫ్లైఓవర్లు, జంక్షన్లు అభివృద్ధి చేయండి: ఎమ్మెల్యే బాల్కసుమన్**

చెన్నూరు నియోజకవర్గం నుంచి వెళ్లే నేషనల్ హైవే 63పై మూడుచోట్ల ఫ్లైఓవర్లు, జంక్షన్లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వ విప్ బాల్కసుమన్ కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ప్రాణహిత నదిపై వంతెన నిర్మాణం పూర్తయిందని.. దీంతో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి తెలంగాణకు రవాణా సదుపాయం పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉన్నదని వివరించారు. వరంగల్ జాతీయ రహదారిపై ఆలేరు నియోజకవర్గపరిధిలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి సర్వీస్‌రోడ్లు, అండర్‌పాస్‌లు నిర్మించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత కోరారు. వంగపల్లి, సాయిగూడెం, జీడికల్‌లో అండర్‌పాస్‌లను నిర్మించాలని కోరారు.

## మార్చి 19 నుంచి పది పరీక్షలు

ఏప్రిల్ 6న ముగింపు

- ప్రధాన పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు
- సెకండ్ లాంగ్వేజీ పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు
- టైంటేబుల్ విడుదలచేసిన ఎస్సెస్సీ బోర్డు డైరెక్టర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**



రాష్ట్రంలో 2019-20 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి పరీక్షల టైంటేబుల్ విడుదలైంది. వచ్చే ఏడాది మార్చి 19వ తేదీ నుంచి ఏప్రిల్ 6 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రధాన పరీక్షలు మార్చి 19 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు.. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల దాకా నిర్వహిస్తారు. ద్వితీయ భాష (సెకండ్ లాంగ్వేజీ)కు సంబంధించిన పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఉంటుంది. ఇందులోభాగంగా అన్ని సబ్జెక్టుల్లో ఆబ్జెక్టివ్ పేపర్ (పార్టు-బీ)ను చివరి అరగంటలో మాత్రమే రాయాల్సి ఉంటుంది. ఈ మేరకు పదో తరగతి పరీక్షల టైంటేబుల్‌ను మంగళవారం విడుదలచేసిన ఎస్సెస్సీ బోర్డు డైరెక్టర్ బీ సుధాకర్.. పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని చెప్పారు.

(పదో తరగతి పరీక్షల టైంటేబుల్.. 2వ పేజీలో)

## తొలిరోజు కోటిన్నర అదనపు ఆదాయం

బస్‌చార్జీల పెంపుపై సమీక్ష



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఆర్టీసీలో మంగళవారం నుంచి కొత్త చార్జీలు అమలులోకి వచ్చిన నేపథ్యంలో తొలిరోజు దాదాపు రూ.1.5 కోట్ల అదనపు ఆదాయం సమకూరినట్లు అధికారులు అంచనావేశారు. చార్జీల పెంపు నేపథ్యంలో మొదటిరోజు రాష్ట్రవ్యాప్తంగా ఎదురైన పరిస్థితులపై మంగళవారం బస్‌భవన్‌లో అధికారులు సమీక్షించారు. మూడేండ్ల విరామం తర్వాత బస్ చార్జీలను కిలోమీటర్‌కు 20 పైసల చొప్పున పెంచిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తొలిరోజు ఎదురైన పరిస్థితుల గురించి క్షేత్రస్థాయి అధికారుల నుంచి తెలుసుకున్నారు. పెంచిన చార్జీలకనుగుణంగా ఇప్పటికే టిమ్స్‌ని సిద్ధంచేసి కండక్టర్లకు ఇవ్వగా, బస్‌పాసులజారీలో తాజా నిబంధనలను పాటించాలని అధికారులకు సూచించారు.

## విక్రమ్ జాడ దొరికింది



షణ్ముగ సుబ్రమణియన్

- చంద్రుడిపై ల్యాండర్ కూలిన ప్రదేశాన్ని గుర్తించిన నాసా
- నాసాకు ఆధారాలు అందజేసిన భారతీయ ఇంజినీర్ షణ్ముగ సుబ్రమణియన్
- లక్షిత ప్రదేశానికి 2,500 అడుగుల దూరంలో ల్యాండర్ కూలినట్టు నిర్ధారణ

5



## చైనా నౌకను తరిమికొట్టిన భారత్!

అక్రమంగా ప్రవేశం

గూఢచర్యానికి వచ్చినట్టు అనుమానాలు 5

నౌకా దళాధిపతి అడ్మిరల్ కరంబీర్‌సింగ్ వెల్లడి

## ఉద్యోగాలకు ఉమ్మడి పరీక్ష

కేంద్ర ప్రభుత్వ గ్రూప్-బీ, గ్రూప్-సీ పోస్టులకు ఒకే టెస్ట్

సీఈటీ నిర్వహణకు ప్రత్యేక సంస్థను ఏర్పాటుచేయాలని కేంద్రం ప్రతిపాదన

ఎస్సెస్సీ, ఆర్ఆర్బీ, ఐబీపీఎస్ నియామకాలతో మొదలు!

III

# కాళేశ్వర శ్రీరాంసాగరం!

**శ్రీరాంసాగర్..** ఆరు దశాబ్దాల్లో నాటి పాలకులు గోదావరిపై తెలంగాణకు విదిల్చిన ఏకైక ప్రాజెక్టు. పేరుకు పద్నాలుగు లక్షల ఆయకట్టు ఉన్నా ఏనాడూ ఐదారు లక్షలకు మించి పారింది లేదు. కాల్వల్లో 3-4 వేల క్యూసెక్కుల ప్రవాహం పోయిందీ లేదు. కానీ, ప్రాజెక్టు చరిత్రలో ఈ ఏడాది తొలిసారి పద్నాలుగు లక్షల ఎకరాల పూర్తి ఆయకట్టుకు సాగునీరందింది. వానకాలం సీజన్ ముగిసినా జలాశయం నేటికీ నిండుకుండలా ఉన్నది. ఒకవేళ నిల్వలు తగ్గినా మళ్లీ జీవంపోసేందుకు శ్రీరాంసాగర్ పునర్జీవ పథకం సిద్ధంగా ఉన్నది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం వల్లనే ఇదంతా సాధ్యమయిందని రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ప్రభుత్వం శ్రీరాంసాగర్ చరిత్రను మార్చింది. ప్రాజెక్టు అలంకారప్రాయం కాదు.. ఆయకట్టును ఆకుపచ్చ మాగాణంగా మార్చే వరప్రదాయిని అని నిరూపించింది. తెలంగాణ ఏర్పడేనాటికి ఎస్సారెస్పీ సాగునీటి నిర్వహణ సక్రమంగా ఉండేది కాదు. ప్రాజెక్టు ఎప్పుడు నిండుతుందో.. నీటిని ఎప్పుడు విడుదల చేస్తారో.. ఎంత ఆయకట్టుకు నీరందుతుందో.. ఏదీ తెలియని పరిస్థితి. కానీ, తెలంగాణ సర్కారు వచ్చిన తర్వాత ప్రాజెక్టు సాగునీటి నిర్వహణపై దృష్టిసారించింది. ఎగువ నుంచి వచ్చే వరదతో సాధ్యమైనంత మేరకు ఎక్కువ ఆయకట్టుకు నీరందించే ఏర్పాట్లు చేసింది. ఒకవైపు కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పనులను పరుగులు పెట్టిస్తూనే.. మరోవైపు ఎస్సారెస్పీ కాల్వల్ని బాగుచేసింది. ఎగువనుంచి చుక్కనీరు రాకున్నా ఆయకట్టుకు ఢోకాలేకుండా ఎస్సారెస్పీ పునర్జీవ పథకాన్నీ సిద్ధం చేసింది. ఈ బహుముఖ వ్యూహం వల్ల ఇప్పుడు ఫలితాలు వస్తున్నాయి. సాధారణంగా ఎగువనుంచి శ్రీరాంసాగర్‌కు భారీ ఎత్తున వరద వచ్చినా 90 టీఎంసీలు మాత్రమే నిల్వ చేసుకునే అవకాశం ఉండేది. ఆ నీటిని సాగుకు విడుదల చేస్తే మళ్లీ వచ్చే ఏడాది ఎగువ నుంచి వరద వచ్చేవరకు ఎదురు చూడాల్సి వచ్చేది.

**రాత మార్చిన కాళేశ్వరం..**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం శ్రీరాంసాగర్ ఆయకట్టు దశను మార్చివేసింది. ఎగువనుంచి చుక్కనీరు లేని సమయంలో కాళేశ్వరం ద్వారా

మిగతా 6వ పేజీలో



నిండుకుండలా శ్రీరాంసాగర్ జలాశయం

- చరిత్రలో మొదటిసారి పూర్తి ఆయకట్టుకు సాగునీరు
- వానకాలం ముగిసినా నిండుకుండలా జలాశయం
- శ్రీరాంసాగర్‌కు జీవంపోసిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం
- తెలంగాణ గడ్డపై ఇప్పటికీ నీటినిల్వలు 200 టీఎంసీల పైమాటే
- కాళేశ్వరం, పునర్జీవ పథకంతో వచ్చేఏడాది భారీ వినియోగం

## 17న తుది జాబితా

- మున్సిపల్ వార్డుల పునర్విభజన షెడ్యూల్ విడుదల
- ఈ నెల 9 వరకు అభిప్రాయాలు, సూచనల స్వీకరణ 3
- అభ్యంతరాల పరిష్కారానికి 16 వరకు గడువు

## ఒక దేశం ఒకే రేషన్ కార్డు!

జూన్ ఒకటి నుంచి దేశవ్యాప్తంగా అమలు

కేంద్రమంత్రి రాంవిలాస్ పాశ్వాన్ వెల్లడి

5




| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
| --- | --- | --- | --- |
| ఫారం ధర | 88.00 | రిటైల్ లైవ్ | 110.00 |
| డ్రెస్డ్ | 160.00 | స్కిన్‌లెస్ | 182.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
| --- | --- | --- | --- |
| హైదరాబాద్ | 444.00 | రంగారెడ్డి | 444.00 |
| మెదక్ | 444.00 | కరీంనగర్ | 447.00 |
| వరంగల్ | 447.00 | చిల్లర ధర | 5.05 |



మంగళవారం ఉదయం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం ఝరి గ్రామం నుంచి దట్టమైన పొగమంచులో ఎడ్లబండిపై పొలానికి వెళ్తున్న రైతు

నేడు తేలికపాటి వానలు 6

# పారిశ్రామిక విప్లవం

ఐదేండ్లలో 11,609 పరిశ్రమలు • రూ.1.73 లక్షల కోట్ల పెట్టుబడులు

13 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు




**మీకు** ప్రత్యేకరాష్ట్రాన్నిస్తే పాలించుకోవడం రాదు. హైదరాబాద్‌లోని పరిశ్రమలన్నీ తరలిపోతాయి. ఒక్క కొత్త కంపెనీ కూడా రాదు. ఉన్న ఉద్యోగాలు పోతాయి. కొత్త ఉద్యోగాలు రావు.. ఇలా ఎన్ని బెదిరింపులు.. ఎన్ని అనుమానాలు.. ఎన్నెన్ని అవమానాలు.. అపోహలు కల్పించి.. ఇలా భయాలు సృష్టించి తెలంగాణకు తుదకంటా మోకాలడ్డిన వాళ్లు ఇప్పుడు గుడ్లు తేలేస్తున్నారు. రాష్ట్రం ఏర్పడిన ఐదేండ్లలో అనూహ్యంగా కనిపిస్తున్న మార్పును చూసి విస్మయం చెందుతున్నారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు ఎద్దేవా చేసిన వాళ్లందరూ ఆశ్చర్యపడేలా జరిగిన పారిశ్రామిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం దృఢ సంకల్పంతో అమల్లోకి తెచ్చిన పారిశ్రామిక విధానమే కారణం. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మదిలో పురుడుపోసుకున్న ఆలోచనే.. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక ప్రాజెక్టుల ఆమోదం.. స్వీయ ధ్రువీకరణ వ్యవస్థ (తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టం – టీఎస్‌ఐపాస్). ఈ చట్టం బూజుపట్టిన పాత విధానాలన్నింటికీ స్వస్తిపలికింది. కేవలం ఐదేండ్లలో 11వేలకు పైగా పరిశ్రమలు అనుమతులుపొందాయి. దాదాపు 13 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. 1.73 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు సమకూరాయి. ఐదేండ్లలో టీఎస్‌ఐపాస్ సాధించిన విజయమిది.

వివరాలు 2వ పేజీలో



## తీగల వంతెనకు తుది మెరుగులు

**దుర్గం** చెరువుపై అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న తీగల వంతెన నిర్మాణం తుదిదశకు చేరుకున్నది. కీలకంగా చెప్పుకొనే చివరి సెగ్మెంట్‌ను మంగళవారం బిగించడంతో వంతెనకు సంబంధించిన మొత్తం 53 సెగ్మెంట్ల బిగింపు పూర్తయింది. ఇరువైపులా రెయిలింగు, రోడ్డు, లైటింగ్ తదితర పనులు మిగిలిఉన్నాయి. ఈ పనులన్నీ రెండునెలల్లో పూర్తవుతాయని అధికారులు చెప్పారు. రూ.184 కోట్ల వ్యయంతో ఎల్‌అండ్‌టీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ వంతెన పనులను 22 నెలల కిందట ప్రారంభించగా, రికార్డుస్థాయిలో పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఇది ప్రపంచపు అతి పొడవైన (స్పాన్) ఎక్స్‌ట్రాడోస్డ్ కేబుల్ బ్రిడ్జి ప్రాజెక్టు అని పేర్కొంటున్నారు.

**- నమస్తే తెలంగాణ, హైదరాబాద్ సిటీబ్యూరో**



రాజ్‌భవన్‌లో దివ్యాంగులను ఆత్మీయంగా పలుకరిస్తున్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్

## రాజ్‌భవన్‌లో దివ్యాంగుల దినోత్సవం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో దివ్యాంగుల కోసం ఎక్కడా లేనివిధంగా రూ.3,016 పింఛన్‌ను ప్రభుత్వం ఇస్తున్నదని గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ పేర్కొన్నారు. మంగళవారం రాజ్‌భవన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవంలో దివ్యాంగులను ఆమె ఆత్మీయంగా పలుకరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ దివ్యాంగులు మానసికంగా దృఢంగా ఉండాలని, వైకల్యం ఉన్నదని బాధపడవద్దని ధైర్యం చెప్పారు. దివ్యాంగులకు రాజ్‌భవన్ సిబ్బంది పండ్లు, అల్పాహారం అందించారు.



## దివ్యాంగులకు అండగా ఎంపీ సంతోష్

దేవనార్ ఫౌండేషన్‌కు రూ.రెండు లక్షల విరాళం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ మరోసారి దాతృత్వాన్ని చాటుకున్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం బేగంపేటలోని దేవనార్ ఫౌండేషన్ (అంధుల పాఠశాల)కు వ్యక్తిగతంగా రూ. రెండు లక్షలను విరాళంగా ఇచ్చారు. గతంలో కూడా ఎంపీ ఈ ఫౌండేషన్‌కు సహాయాన్ని అందించారు.



## హైదరాబాద్ చేరుకున్న సీఎం కేసీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రెండు రోజుల పర్యటన కోసం ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మంగళవారం రాత్రి తిరిగి హైదరాబాద్ చేరుకున్నారు. సోమవారం రాత్రి ఢిల్లీకి వెళ్లిన సీఎం కేసీఆర్.. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సీఎండీ రాజీవ్‌శర్మ ఇంట్లో వివాహానికి హాజరయ్యారు. తిరిగి మంగళవారం రాత్రి ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు.

## పదో తరగతి పరీక్షల టైంటేబుల్

| | | |
|---|---|---|
| మార్చి 19 | గురువారం | ప్రథమ భాష పేపర్–1 |
| మార్చి 20 | శుక్రవారం | ప్రథమ భాష పేపర్ –2 |
| మార్చి 21 | శనివారం | ద్వితీయ భాష |
| మార్చి 23 | సోమవారం | ఇంగ్లిష్ పేపర్ –1 |
| మార్చి 24 | మంగళవారం | ఇంగ్లిష్ పేపర్ –2 |
| మార్చి 26 | గురువారం | గణితం పేపర్–1 |
| మార్చి 27 | శుక్రవారం | గణితం పేపర్–2 |
| మార్చి 28 | శనివారం | సామాన్యశాస్త్రం పేపర్ –1 |
| మార్చి 30 | సోమవారం | సామాన్యశాస్త్రం పేపర్ –2 |
| మార్చి 31 | మంగళవారం | సాంఘికశాస్త్రం పేపర్ –1 |
| ఏప్రిల్ 01 | బుధవారం | సాంఘికశాస్త్రం పేపర్–2 |
| ఏప్రిల్ 03 | శుక్రవారం | ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజీ పేపర్–1 |
| ఏప్రిల్ 04 | శనివారం | ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజీ పేపర్ –2 |
| ఏప్రిల్ 06 | సోమవారం | ఎస్సెస్సీ ఒకేషనల్ కోర్సు (థియరీ) |

## ఇన్‌వాయిస్ ధరపైనే లైఫ్‌ట్యాక్స్

రవాణాశాఖ కమిషనర్ ఉత్తర్వులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వాహన కొనుగోలుదారులు ఇన్‌వాయిస్ ధర ఆధారంగానే లైఫ్‌ట్యాక్స్ చెల్లించాలని రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ సందీప్‌కుమార్ సుల్తానియా స్పష్టంచేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఉత్తర్వులు జారీచేశారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం ఈ నిర్ణయం తీసుకొన్నట్టు తెలిపారు. ఈ ఉత్తర్వుల ప్రకారం లైఫ్‌ట్యాక్స్ వసూలుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవడంతోపాటు తమ పరిధిలోని డీలర్లకు తగిన సూచనలు ఇవ్వాలని కమిషనర్ పేర్కొన్నారు.

# దివ్యాంగులకు అండ

- చరిత్రలో తొలిసారి రూ. 3,016 పింఛన్
- దివ్యాంగుల సంక్షేమంలో రాష్ట్రం నంబర్‌వన్
- దివ్యాంగుల దినోత్సవంలో మంత్రులు కొప్పుల ఈశ్వర్, మహమూద్‌అలీ



హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లో 'దివ్యాంగుల అవగాహన నడక' కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ పోచారం, మంత్రి కొప్పుల




రవీంద్రభారతిలో మంత్రులు కొప్పుల ఈశ్వర్, మహమూద్‌అలీ చేతులమీదుగా సంగారెడ్డి జిల్లా ఉత్తమ అవార్డును కలెక్టర్ తరపున అందుకుంటున్న ఆర్డీవో రాధారమణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దివ్యాంగ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం రాష్ట్రస్థాయి వేడుకలు నిర్వహించారు. మంత్రులు కొప్పుల ఈశ్వర్, మహమూద్‌అలీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొప్పుల మాట్లాడుతూ పదో తరగతి, ఆపై చదువు పూర్తి చేసుకున్న దివ్యాంగులకు నైపుణ్య శిక్షణ ఇస్తామని, శిక్షణాకేంద్రాలు ఏర్పాటుచేస్తామని తెలిపారు. రాష్ట్రంలో పదిలక్షల మంది దివ్యాంగులున్నారని, వారికోసం ప్రభుత్వం పలు సంక్షేమపథకాలను రూపొందించి అమలుచేస్తున్నదని చెప్పారు. 2018–19 ఏడాదిలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల ఆధారంగా రాష్ట్రానికి జాతీయస్థాయి అవార్డు దక్కిందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 70 కోట్ల నిధులు వెచ్చించి దివ్యాంగుల సంక్షేమానికి కృషిచేస్తున్నామని పేర్కొన్నారు. ఒకరిపై ఆధారపడకుండా ఉండటం కోసమే సీఎం కేసీఆర్ చరిత్రలో లేనివిధంగా దివ్యాంగులకు రూ. 3,016 చొప్పున పింఛన్ ఇస్తున్నారన్నారు.

### అన్ని పథకాల్లో ఐదుశాతం రిజర్వేషన్

దివ్యాంగ విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇస్తున్నామని మంత్రి కొప్పుల పేర్కొన్నారు. అభివృద్ధిలో దేశవ్యాప్తంగా మన రాష్ట్రం ముందంజలో ఉన్నదని, దివ్యాంగులు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సంగారెడ్డి కలెక్టర్‌తోపాటు పలువురికి అవార్డులు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించామని, ఉద్యోగ నియామకాల్లో నాలుగు శాతం రిజర్వేషన్లు, అన్ని పథకాల్లో ఐదుశాతం, డబుల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయింపుల్లో కూడా రిజర్వేషన్లు అమలుచేస్తున్నామని వివరించారు. ప్రతి ఒక్కరూ దివ్యాంగులకు అండగా నిలువాలని హోంమంత్రి మహమూద్ అలీ కోరారు. దివ్యాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ బీ శైలజ ఆధ్వర్యంలో చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. వైకల్యాన్ని జయించి వివిధరంగాల్లో ప్రతిభచూపిన దివ్యాంగులకు మంత్రులు అవార్డులను ప్రదానంచేసి సన్మానించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో మహిళాభివృద్ధి, దివ్యాంగుల సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జగదీశ్వర్, దివ్యాంగుల సంక్షేమశాఖ ఎండీ బీ శైలజ, దివ్యాంగులు పాల్గొన్నారు.



ఢిల్లీలో నాగేశ్వరరావుకు అవార్డు అందిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

## నారా నాగేశ్వరరావుకు రోల్ మోడల్ అవార్డు

జాతీయ పురస్కారం ప్రదానం చేసిన ఉప రాష్ట్రపతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దివ్యాంగులకు విశిష్ట సేవలందించేవారికి కేంద్రం ఏటా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అవార్డులు అందజేస్తున్నది. ఈ ఏడాది తెలంగాణకు చెందిన నారా నాగేశ్వరరావుకు జాతీయ రోల్‌మోడల్ క్యాటగిరీలో అవార్డు దక్కింది. మంగళవారం ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు నుంచి నారా నాగేశ్వరరావు అవార్డు అందుకున్నారు. 20 ఏండ్లుగా దివ్యాంగుల హక్కుల పరిరక్షణ కోసం నాగేశ్వరరావు చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం దక్కింది. ఈ అవార్డు తన బాధ్యతను ఇంకా పెంచిందని, దివ్యాంగుల సాధికారత, చట్టాల అమలుకు మరింతగా కృషిచేస్తానని నారా నాగేశ్వరరావు మీడియాకు తెలిపారు.

# టీఎస్‌ఐపాస్ అవార్డుల ప్రకటన

నేడు మంత్రి కేటీఆర్ చేతులమీదుగా అవార్డుల అందజేత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఎస్‌ఐపాస్ కింద క్లియరెన్సుల జారీలో ఆయాశాఖలు, జిల్లాల పనితీరు ఆధారంగా అవార్డులను ప్రకటించారు. ప్రభుత్వ శాఖల్లో క్లియరెన్సుల కోసం దాఖలుచేసిన దరఖాస్తుల సంఖ్య ఆధారంగా ఉత్తమ సేవలందించిన విభాగాలను మూడు క్యాటగిరీలుగా విభజించి ప్రభుత్వం అవార్డులను అందజేస్తున్నది. బుధవారం శిల్పకళావేదికలో నిర్వహించనున్న టీఎస్ ఐపాస్ ఐదో వార్షికోత్సవంలో ఐటీశాఖ మంత్రి కే తారకరామారావు అవార్డులు అందజేస్తారు. అవార్డులకు ఎంపికైన వారిలో మొదటి క్యాటగిరీలో కరీంనగర్ జిల్లాకు మొదటిర్యాంకు దక్కింది ఆ జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్‌అహ్మద్, పరిశ్రమలశాఖ జీఎం బీ నవీన్‌కుమార్ అవార్డును అందుకొంటారు. రెండోర్యాంకు మేడ్చల్ మల్కాజ్‌గిరికి లభించింది. ఆ జిల్లా కలెక్టర్ ఎంవీ రెడ్డి, పరిశ్రమలశాఖ జీఎం పీ రవీందర్ అవార్డు అందుకోనున్నారు. మూడో ర్యాంకు రంగారెడ్డి జిల్లాకు వచ్చింది. ఆ జిల్లా కలెక్టర్ ఎస్ హరీశ్, పరిశ్రమలశాఖ జీఎం జే రాజేశ్వర్‌రెడ్డి ఈ అవార్డును అందుకుంటారు. రెండో క్యాటగిరీలో మొదటి ర్యాంకు దక్కిన సిద్దిపేట జిల్లా తరపున కలెక్టర్ పీ వెంకటరామారెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం టీ రామదాసు, రెండోర్యాంకు దక్కిన కామారెడ్డి జిల్లా తరపున కలెక్టర్ ఎన్ సత్యనారాయణ, పరిశ్రమలశాఖ జీఎం వీ లాలు, మూడోర్యాంకు దక్కిన మెదక్‌జిల్లా తరపున కలెక్టర్ కే ధర్మారెడ్డి, పరిశ్రమలశాఖ జీఎం పీ కృష్ణమూర్తి అవార్డును అందుకోనున్నారు. మూడో క్యాటగిరీలో మొదటి ర్యాంకు దక్కిన జగిత్యాల జిల్లా తరపున కలెక్టర్ ఏ శరత్, పరిశ్రమలశాఖ జీఎం జీ శ్రీనివాస్, రెండోర్యాంకు సాధించిన మహబూబాబాద్ జిల్లా తరపున కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య, పరిశ్రమలశాఖ జీఎం నర్సింహమూర్తి, మూడోర్యాంకు పొందిన నాగర్‌కర్నూల్ జిల్లా తరపున కలెక్టర్ ఈ శ్రీధర్, పరిశ్రమలశాఖ జీఎం హన్మంతు అవార్డును అందుకుంటారు. శాఖలవారీగా టీఎస్‌ఐపాస్ అవార్డుకు ఎంపికైన వారిలో మొదటి క్యాటగిరీలో మొదటి ర్యాంకు లభించిన టీఎస్‌ఎన్పీడీసీఎల్ తరపున సీఎండీ ఏ గోపాల్‌రావు, రెండోర్యాంకు దక్కిన టీఎస్ఎస్పీడీసీఎల్ తరపున సీఎండీ జీ రఘుమారెడ్డి, మూడో ర్యాంకు దక్కిన ఫ్యాక్టరీస్ శాఖ తరపున డైరెక్టర్ బీ రాజగోపాల్‌రావు అవార్డును అందుకోనున్నారు. రెండో క్యాటగిరీలో తొలి ర్యాంకు లభించిన చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ టు గవర్నమెంట్ తరపున సీఈఐజీ సత్యనారాయణరాజు , రెండోర్యాంకు దక్కిన భూగర్భజల శాఖ తరపున డైరెక్టర్ పండిత్‌మ ధ్నూర్, మూడోర్యాంకు పొందిన రెవెన్యూ (సీసీఎల్ఏ) విభాగం తరపున చీఫ్ కమిషనర్ సోమేశ్‌కుమార్, మూడో క్యాటగిరీలో మొదటి ర్యాం కు దక్కిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాట ర్ సప్లై అండ్ సీవరేజెస్ బోర్డు తరపున ఎండీ దానకిశోర్, రెండోర్యాంకు లభించిన కార్మికశాఖ తరపున కమిషనర్ అహ్మద్ నదీమ్, మూడోర్యాంకు సాధించిన జీహెచ్ఎంసీ తరపున కమిషనర్ డీఎస్ లోకేశ్‌కుమార్ అవార్డును అందుకుంటారు. టీఎస్‌ఐపాస్ ప్రత్యేక క్యాటగిరీ అవార్డులకు ఎంపికైనవారిలో టీఎస్‌ఐఐసీ వీసీఅండ్ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, హెచ్ఎండీ కమిషనర్ అరవింద్‌కుమార్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ టీకే శ్రీదేవి, టౌన్‌అండ్ కంట్రీ ప్లానింగ్‌శాఖ డైరెక్టర్ విద్యాధర్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి డైరెక్టర్ నీతుకుమారిప్రసాద్, కార్మికశాఖ, పరిశ్రమలశాఖ కమిషనర్ అహ్మద్ నదీ మ్, పరిశ్రమలు, వాణిజ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్ టీఎస్‌ఐపాస్ అవార్డును అందుకోనున్నారు. ప్రత్యేక క్యాటగిరీ కింద కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి (కుడా) అవార్డు లభించింది.

### ముహూర్తం

సూర్యోదయం: 6.34 గంటలకు

సూర్యాస్తమయం: 5.32 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం అష్టమి అర్ధరాత్రి 1.45 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: శతభిషం సాయంత్రం 5.10 వరకు, తదుపరి పూర్వాభాద్ర, అమృతఘడియలు: ఉదయం 9.06 నుంచి 10.54 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 12.03 నుంచి 1.26 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.41 నుంచి మధ్యాహ్నం 12.25 వరకు, వర్జ్యం: అర్ధరాత్రి 12.21 నుంచి 2.09 వరకు.

### లోకం పోకడ



కావాలనే అన్నాం మేడం.. 'ప్రియాంక చోప్రా' అంటే ఎక్కువ జనం వస్తారని..

# పారిశ్రామిక విప్లవం టీఎస్‌ఐపాస్

(నెలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, నమస్తే తెలంగాణ ప్రతినిధి )

- ఐదేండ్లలో 11,609 పరిశ్రమలు
- రూ.1.73 లక్షల కోట్ల పెట్టుబడులు
- 13 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు
- ఏటేటా పెరుగుతున్న పరిశ్రమలు
- సీఎం కేసీఆర్‌కు జేజేలు పలుకుతున్న పారిశ్రామికవేత్తలు
- నేటితో టీఎస్‌ఐపాస్‌కు ఐదేళ్లు

తెలంగాణ ప్రజల ప్రధాన ఆకాంక్షలైన నీళ్లు.. నిధులు.. నియామకాల్లో మూడో ఆకాంక్ష నెరవేరాలంటే.. ఉన్న పరిశ్రమలు విస్తరించాలి. కొత్త పరిశ్రమలు పుష్కలంగా రావాలి. తద్వారా రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు మెరుగుపడాలి. ఆదాయం పెరిగి రాష్ట్రం ఆర్థికంగా పరిపుష్టమవుతుంది. వీటిని దృష్టిలో ఉంచుకొని సీఎం కేసీఆర్.. ఐదేండ్ల క్రితం ఇదేరోజున టీఎస్‌ఐపాస్‌కు శ్రీకారంచుట్టారు. ఈ చట్టం కాగితాల్లోంచి రాలేదు. పారిశ్రామికవేత్తలు, పారిశ్రామిక సంఘాలు, నిపుణుల సలహాలు, ఆలోచనల మేరకు తీసుకొచ్చిన చట్టమిది. సాధారణ జీవోలు, సర్క్యులర్ల రూపంలో కాకుండా ఏకంగా చట్టమేచేశారు. 2014 డిసెంబర్ 4న టీఎస్‌ఐపాస్ చట్టం అమల్లోకి వచ్చింది. పరిశ్రమలశాఖ మంత్రిగా కే తారకరామారావు ఈ చట్టాన్ని పక్కాగా అమలుచేశారు. మొదట్లో 13 శాఖల పరిధిలో 17 అనుమతులు ఇచ్చేవారు. తర్వాత చట్టాన్ని మరింత విస్తృతంచేసి 27 శాఖలను, 35 సర్వీసులను అందుబాటులోకి తేవడంతో రాష్ట్రంలో పారిశ్రామికీకరణ మరింత సౌకర్యవంతంగా మారింది. టీఎస్‌ఐపాస్ అమల్లోకి వచ్చిన తర్వాత ఐదేండ్లలో అన్ని జిల్లాల్లో కలిపి మొత్తం 11,609 పరిశ్రమలకు అనుమతులు లభించాయి. వీటిద్వారా రాష్ట్రానికి రూ.1.73లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 13.02 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. అనుమతులు లభించిన పరిశ్రమల్లో 8,964 పరిశ్రమలు ప్రారంభంకాగా మరో 769 పరిశ్రమలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఇప్పటికే ఉపాధి పొందిన వారి సంఖ్య 6.22లక్షలు కాగా అతి త్వరలో మరో 2.87లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. పరిశ్రమల స్థాపనకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానాన్ని తీసుకొచ్చారు. టీఎస్‌ఐపాస్ ప్రారంభించిన 2014 నుంచి 2019 డిసెంబర్ 2 వరకు ఏటేటా రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించే వారి సంఖ్య పెరుగుతూనే వస్తుంది. 2014లో డిసెంబర్ 4న చట్టం అమల్లోకి వచ్చాక ఆ ఆర్థిక సంవత్సరంలో 175 పరిశ్రమలురాగా ఆ తర్వాత వరుస సంవత్సరాల్లో 1538, 1781, 3002, 3017 పరిశ్రమలు వచ్చాయి. 2019–20 డిసెంబర్ 2 నాటికే 2,096 పరిశ్రమలు అనుమతి తీసుకున్నాయి. జిల్లాలవారీగా పరిశ్రమలను పరిశీలిస్తే అత్యధిక పరిశ్రమలు వచ్చిన జిల్లాగా మేడ్చల్ నిలిచింది. ఇక్కడికి 2,950 పరిశ్రమలు వచ్చాయి. 2014 నుంచి ఐదేండ్లలో వరుసగా రూ.1806.66 కోట్లు, రూ.28994.60 కోట్లు, రూ. 34942.94 కోట్లు, రూ.58201.12 కోట్లు, రూ. 35,667.12 కోట్లు, రూ.14,015.17 కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయి. 2014 నుంచి గత ఐదేండ్లలో సంవత్సరాలవారీగా 5,076, 94,480, 1,12,298, 2,80,766, 6,08,923, 2,01,118 ఉపాధి అవకాశాలు లభించాయి.

### అధ్యయనం చేసిన ఇతర రాష్ట్రాలు

టీఎస్‌ఐపాస్ విధానం దేశమంతటినీ ఆకర్షించింది. కేంద్రంతోసహా దాదాపు అన్ని రాష్ట్రాలు అధ్యయనంచేశాయి. తమ రాష్ట్రాల్లో పేరు మార్చి అమలుచేయడం ప్రారంభించాయి. జాతీయస్థాయిలోనూ ఈ తరహా విధానాన్ని తేవాలని కేంద్రం ఆలోచిస్తున్నట్టు సమాచారం. ఈ పారిశ్రామిక విధానానికి ఉన్న ప్రత్యేకతల వల్ల సులభవాణిజ్య విధానం (ఈవోడీబీ)లో తెలంగాణ తొలిర్యాంక్ సాధించగలిగింది. టీఎస్‌ఐపాస్‌ను ప్రధాని మోదీ, ఐటీసీ చైర్మన్ దేవేశ్వర్ సహా పలువురు ప్రముఖులు ప్రశంసించారు. తమకు అతి తక్కువ సమయంలో అనుమతులొచ్చాయని మైక్రోమాక్స్ ఎండీ రాజేశ్ అగర్వాల్ హర్షం వ్యక్తంచేశారు.




### నేడు శిల్పకళావేదికలో కార్యక్రమం

**టీఎస్‌ఐపాస్** చట్టం రూపుదాల్చి ఐదేండ్లయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. బుధవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ మాదాపూర్ శిల్పకళావేదికలో జరిగే ప్రధాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు హాజరుకానున్నారు. ఇందులో హోంమంత్రి మహమూద్ అలీ, విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి, అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి పాల్గొంటారు. టీఎస్‌ఐపాస్‌ను విజయవంతంగా అమలుచేస్తున్న వారిని ఎంపికచేసి సన్మానిస్తారు. ఉత్తమప్రతిభ కనబర్చిన జిల్లాలు, శాఖల అధికారులను సత్కరిస్తారు. టీఎస్‌ఐపాస్ ద్వారా అనుమతిపొందిన వారందరినీ ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు.

### టీఎస్‌ఐపాస్ ఏర్పాటయ్యాక రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమల వివరాలు

| ప్రస్తుత స్థితి | మొత్తం పరిశ్రమలు | పెట్టుబడులు (రూ.కోట్లు) | ఉపాధి అవకాశాలు |
|---|---|---|---|
| ప్రారంభించినవి | 8,964 | 85,073.87 | 6,22,485 |
| ప్రారంభానికి సిద్ధమైనవి | 769 | 28,123.15 | 2,87,109 |
| నిర్మాణ పనులు ప్రారంభమైనవి | 651 | 51,025.75 | 2,57,223 |
| ఇంకా పనులు ప్రారంభంకానివి | 1,225 | 9,405.99 | 1,35,844 |
| **మొత్తం** | **11,609** | **1,73,628.76** | **13,02,661** |

### వినూత్నమైన పాలసీ



టీఎస్‌ఐపాస్ వినూత్న పాలసీ. అనేక శాఖల అనుమతులను ఈ విధానంలోకి తీసుకొచ్చాం. అనేక సంస్కరణలు తీసుకొచ్చాం. పారిశ్రామికవేత్తల అభిప్రాయాలు తీసుకొని ఇంకా ముందుకువెళ్తాం.

**- నదీమ్ అహ్మద్, పరిశ్రమల శాఖ కమిషనర్**

### సులువుగా అనుమతులు



టీఎస్‌ఐపాస్ ద్వారా మా కంపెనీకి చాలా సులువుగా అనుమతులు లభించాయి. దరఖాస్తు చేసుకున్నాక.. పెద్దగా ఫాలోఅప్ చేయకుండానే అనుమతులన్నీ ఇచ్చారు. ఈ విధానం చాలా బాగుంది.

**- రాజేశ్ కోస్లా, ప్రెసిడెంట్ సీఈవో, పీపీడీ, గార్డెన్ పాలిమర్స్, హెచ్ఎస్ఐఎల్**

### పెట్టుబడులను ఆకర్షించడంలో ప్రధానమైన పాత్ర



టీఎస్‌ఐపాస్ పెట్టుబడులను ఆకర్షించడంలో ప్రధానమైన పాత్ర పోషిస్తున్నది. ఈ పాలసీతో వేల పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చాయి.

**- రాజు, సీఐఐ, తెలంగాణశాఖ అధ్యక్షుడు**

### కొత్తవారికి ఉపయుక్తం



టీఎస్‌ఐపాస్ చట్టం నోబుల్ యాక్ట్. కొత్తగా పరిశ్రమ పెడుతున్న వారికి ఇది ఎంతో అద్భుతంగా ఉంటుంది. అతితక్కువ సమయంలో అనుమతులు వస్తునాయి.

**- కే భాస్కర్‌రెడ్డి , ఎఫ్‌టీసీసీఐ ఉపాధ్యక్షుడు**

### విప్లవాత్మకమైన మార్పు



టీఎస్‌ఐపాస్ విప్లవాత్మకమైన మార్పు. సీఎం కేసీఆర్ నిర్ణయంతో పారిశ్రామికవేత్తలకు నిర్ణీత కాలవ్యవధిలో అనుమతులు రావడమనేది ఒక్క హక్కుగా మారింది. **- కే సుధీర్‌రెడ్డి, టీఐఎఫ్ అధ్యక్షుడు**

### దిశపై అనుచిత వ్యాఖ్యలు

# నిజామాబాద్ యువకుడి అరెస్ట్

- ఫేస్‌బుక్ పోస్టులపై సుమోటోగా కేసు నమోదు
- మరికొందరి అరెస్టుకు అవకాశాలు


సీసీఎస్ పోలీసుల అదుపులో చవాన్ శ్రీరాం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ/ నవీపేట:** దిశ హత్యోదంతంపై సామాజిక మాధ్యమంలో అనుచిత వ్యాఖ్యలు పోస్ట్‌చేసిన ఓ యువకుడిని హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్‌చేశారు. దిశఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతుంటే.. సోషల్‌మీడియాలో కొందరు యువకులు ఆమె వ్యక్తిత్వాన్ని కించపరచడమే కాకుండా అసభ్య కరపదజాలంతో పోస్ట్‌లు పెట్టారు. మరికొందరు దిశ కుటుంబసభ్యులను కూడా కించపరిచేవిధంగా పోస్టింగ్‌లు పెట్టడంతో సైబర్ క్రైం పోలీసులు ఈ అంశంపై సుమోటోగా కేసు నమోదుచేశారు. దీనిపై లోతుగా దర్యాప్తుచేసి పోస్టింగ్‌లు పెట్టిన నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం ఫకీరాబాద్‌వాసి చవన్ శ్రీరాం (22)ను అరెస్ట్‌చేశారు. స్టాలిన్ శ్రీరాం పేరుతో ప్రొఫైల్ పెట్టుకున్న అతడు మహిళలపై అసభ్యకరమైన పోస్టింగ్‌లు పెడుతున్నట్టు తేలిందని సైబర్‌క్రైమ్ అదనపు డీసీపీ రఘువీర్ తెలిపా రు. శ్రీరాం ఒక హోటల్‌లో పనిచేస్తున్నాడని చెప్పారు. ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు బృందం ఈ కేసు దర్యాప్తుచేసిందని వెల్లడించారు. దిశ ఘటనపై అనుచితంగా వ్యాఖ్యానాలు చేసిన మరికొన్ని పోస్టులను కూడా సైబర్‌క్రైమ్‌లోని సోషల్‌మీడియా విభాగం సేకరించింది. ఈ పోస్టుల్లో ఎక్కువగా శ్రీరాం స్నేహితులే ఉన్నట్టు ఆధారాలు సేకరించింది. ఈ కేసులో మరికొందరిని అరెస్టుచేసే అవకాశమున్నది.



## మెప్మా కొవ్వొత్తుల ర్యాలీ

దిశ ఘటనను నిరసిస్తూ నిజామాబాద్‌లో మంగళవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా), పట్టణ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మెప్మా కార్యాలయం నుంచి ర్యాలీగా నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్దకు ర్యాలీగా వచ్చి నివాళి అర్పించారు. నిశిత డిగ్రీ,పీజీ కళాశాల ఆధ్వర్యంలో ర్యాలీ, కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. - నిజామాబాద్

నిజామాబాద్ నగరంలో ఎన్టీఆర్ చౌరస్తా వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నిశిత డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు

# రహస్యంగా దర్యాప్తు!

- దిశ కేసు దర్యాప్తులో పోలీసుల వ్యూహం
- పన్నెండు బృందాలతో చార్జిషీట్ తయారీ
- జైలులోనే పోలీసు కస్టడీ, విచారణ జరిగే అవకాశం?


దిశకు నివాళి అర్పిస్తున్న టీఎన్జీవో నేతలు కారం రవీందర్‌రెడ్డి, మామిళ్ల రాజేందర్, రేచల్ తదితరులు

**హైదరాబాద్/ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** సంచలనం సృష్టించిన దిశ కేసు దర్యాప్తును అత్యంత రహస్యంగా జరుపాలని పోలీసులు యోచిస్తున్నట్టు సమాచారం. దేశవ్యాప్తంగా నిందితులపై అగ్రహావేశాలు పెల్లుబుకుతున్న నేపథ్యంలో పక్కావ్యూహంతో విచారణ చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. నిందితులను పదిరోజుల కస్టడీకి ఇవ్వాలని కోరుతూ షాద్‌నగర్ కోర్టులో పోలీసులు సోమవారం పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. అయితే, కస్టడీ తీసుకునేందుకు కోర్టు నుంచి అనుమతి విషయంపై వివరాలు వెల్లడించేందుకు సెక్యూరిటీ కారణాలు చూపుతూ తామేమీ చెప్పలేమంటూ పేర్కొంటున్నారు. మరోవైపు నిందితుల తరపున న్యాయవాదులు ఎవరూ వాదించేందుకు సిద్ధంగా లేకపోవడంతో.. షాద్‌నగర్ కోర్టు న్యాయమూర్తి నిందితులకు నోటీసులు జారీచేసినట్టు సమాచారం. నోటీసులు ఇచ్చిన తర్వాత వారిని కస్టడీలోకి తీసుకుంటే జైలులోనే విచారించాలా? లేదా రహస్య ప్రాంతానికి తీసుకెళ్లాలా అనే అంశంపై పోలీసులు సమాలోచనలు చేస్తున్నట్టు తెలిసింది. ప్రజాగ్రహం నేపథ్యంలో నిందితుల తరలింపు పోలీసులకు కత్తి మీద సాముగా మారింది. దీంతో వారిని జైలులోనే విచారించాలనే నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. మరోవైపు నిందితులపై చార్జిషీట్ తయారుచేసేందుకు అనుభవజ్ఞులైన అధికారులతో పన్నెండు బృందాలను ఏర్పాటుచేసినట్టు తెలిసింది. నిందితులు ఎట్టిపరిస్థితుల్లోనూ తప్పించుకోకుండా ప్రతి ఆధారాన్ని నిరూపించేలా చార్జిషీట్‌ను తయారుచేస్తున్నారు. దర్యాప్తు విషయాలను బయటకు లీక్‌కాకుండా ఉన్నతాధికారులు సీరియస్‌గా హెచ్చరికలు చేసినట్టు తెలిసింది. దీంతో దిశ విచారణలో మీడియాకు ఎలాంటి విషయాన్ని చెప్పకుండా పోలీసులు అంతా గప్‌చుప్‌గా వ్యవహరిస్తున్నారు. దిశ కేసులో నిందితులను కలవడానికి మూడురోజులుగా వారి కుటుంబసభ్యులు ఎవరూ రాలేదు. చేసిన నేరానికి శిక్ష అనుభవించాల్సిందేనంటూ వారిని కలిసేందుకు కుటుంబసభ్యులు ఇష్టపడటం లేదు.

### టీఎన్జీవో నివాళి

దిశ నిందితులను వెంటనే శిక్షించాలని కోరుతూ టీఎన్జీవో ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. హైదరాబాద్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం టీఎన్జీవో భవన్ నుంచి నాంపల్లి వరకు ర్యాలీ తీశారు. మహిళలు, మహిళా ఉద్యోగులపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్‌లు కోరారు. దిశ ఘటన అమానుషమని తెలంగాణ పద్మశాలీ ఆఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఖండించారు. ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమని అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సహదేవ్ అన్నారు.

## బాలికల ఆత్మరక్షణ శిక్షణకు రూ. 1.38 కోట్లు

- నిధులు విడుదలచేసిన విద్యాశాఖ
- 1,544 స్కూల్ కమిటీలకు పంపిణీ
- డిసెంబర్ నుంచి మూడునెలలు శిక్షణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని 1,544 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు ఆత్మరక్షణలో శిక్షణ ఇవ్వడం కోసం విద్యాశాఖ (సమగ్ర శిక్ష అభియాన్ పథకం) నుంచి రూ.1,38,96,000 నిధులు మంగళవారం విడుదలచేశారు. ఇందులో ప్రాథమికోన్నత పాఠశాలలు 31, ఉన్నత పాఠశాలలు 1,513 ఉన్నాయని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్ తెలిపారు. బాలికల ఆత్మరక్షణ శిక్షణ నిమిత్తం ప్రతి స్కూల్‌కు రూ.9,000 కేటాయించి.. నిధులు స్కూల్ కమిటీలకు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ మేరకు మార్గదర్శకాలు విడుదలచేశారు. డిసెంబర్ నుంచి మూడు నెలలు, ప్రతివారం రెండు శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. ప్రతి తరగతికి గంట సమయం కేటాయించాలని తెలిపారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్, మార్షల్ ఆర్ట్స్‌లో గుర్తింపుతోపాటు ట్రెయినర్లకు ఒక్క సంవత్సరం శిక్షణా అనుభవం కూడా ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ ఇచ్చేవారికి ప్రతినెల రూ.3,000 చొప్పున కేటాయించాలని, బాలికలు ఏ మేరకు శిక్షణ పొందారో చివర్లో తెలుసుకోవాలని సూచించారు.

## 55 ఏండ్ల మహిళపై అఘాయిత్యం

- తూర్పుగోదావరి జిల్లాలో సామూహిక లైంగికదాడి, హత్య

**అమరావతి:** దిశ ఘటన మరువకముందే ఏపీలోని తూర్పుగోదావరి జిల్లాలో 55 ఏండ్ల మహిళపై దుండగులు సామూహిక లైంగికదాడికి పాల్పడి, దారుణంగా హతమార్చారు. ఏపీ పోలీసుల సమాచారం మేరకు.. ఐ పోలవరం మండలం జీ వేమవరం గ్రామానికి చెందిన బాధితురాలి భర్త, కుమారుడు గతంలోనే చనిపోగా, కుమార్తె హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై గుర్తుతెలియని వ్యక్తులు ఘాతుకానికి పాల్పడి మృతదేహం చుట్టూ కారంపొడి చల్లి పారిపోయారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ మంగళవారం ఘటనాస్థలిని సందర్శించారు. ఈ ఘటనలో ముగ్గురు నిందితులు ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. వారిలో ఒకరిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్పీ తెలిపారు.

## అప్రమత్తతపై మహిళలకు నేడు అవగాహన

- భద్రతపై విద్యార్థినులు, స్వయం సేవాసంఘాల సభ్యులకు శిక్షణ
- హోం మంత్రి నేతృత్వంలో నేడు మూడుశాఖల సమావేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆపదను ముందుగా గ్రహిస్తేనే దానినుంచి బయటపడే మార్గాన్ని వెదకడం సులువవుతుంది. మహిళలు, చిన్నారులు ఆపద సమయంలో పోలీసులకు సమాచారం ఏవిధంగా చేరవేయాలనే అంశంపై మరింత అవగాహన కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం కళాశాలలు, పాఠశాలలతోపాటు మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. దీనిపై హోంమంత్రి మహమూద్‌అలీ నేతృత్వంలో బుధవారం సమావేశం నిర్వహించనున్నారు. మంత్రులు సబితాఇంద్రారెడ్డి, సత్యవతిరాథోడ్, డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి, రెండుశాఖల కమిషనర్లు, నార్త్‌జోన్ ఐజీ నాగిరెడ్డి, వెస్ట్‌జోన్ ఐజీ స్టీఫెన్ రవీంద్ర ఇతర ముఖ్య అధికారులు పాల్గొంటారని అధికారులు తెలిపారు.

### మహిళా భద్రతపై విస్తృత చర్చ

రాష్ట్రంలో మహిళల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులు మరింత దృష్టిసారించారు. దిశ ఘటన నేపథ్యంలో అప్రమత్తమైన ఉన్నతాధికారులు సోమ, మంగళవారాల్లో విస్తృతంగా చర్చించినట్టు సమాచారం. డీజీపీ కార్యాలయంలో శాంతిభద్రతల అదనపు డీజీ జితేందర్ నేతృత్వంలో అధికారుల బృందం మంగళవారం ప్రత్యేకంగా సమావేశమైంది. ఉమెన్ సేఫ్టీ వింగ్ ఇంచార్జి ఐజీ స్వాతిలక్రా, నార్త్‌జోన్ ఐజీ నాగిరెడ్డి, వెస్ట్‌జోన్ ఐజీ స్టీఫెన్ రవీంద్రతోపాటు మరికొందరు ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మహిళలు, యువతుల రక్షణకు ఏర్పాటుచేసిన షీటీమ్స్ పనితీరు, డయల్ 100 అందిన ఫిర్యాదులను సకాలంలో మరింత పక్కాగా దర్యాప్తు చేయడం, తరచూ నేరాలు జరుగుతున్న ప్రదేశాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టడం, స్థానికులతో చర్చించి వారి నుంచి సలహాలు సూచనలు తీసుకుని భద్రత ఏర్పాటు తదితర అంశాలు ప్రస్తావనకు వచ్చినట్టు తెలిసింది.




### మోదీ తాత.. అందుకో మా లేఖ

లైంగికదాడులకు పాల్పడినవారికి కఠినశిక్షలు అమలుచేయాలని కోరుతూ విద్యార్థులు ప్రధాని నరేంద్రమోదీకి రెండువేల లేఖలు రాశారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కానుకుంట, బొంతపల్లి, దోమడుగు, అన్నారం జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులు ప్రధానికి లేఖలు రాశారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి దిశకు నివాళి అర్పించారు.

– గుమ్మడిదల


వేములవాడ రాజన్న అనుబంధ దేవాలయమైన శ్రీ బద్దిపోశమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు అమ్మవారికి ఘనంగా బోనాలు సమర్పించారు. సోమవారం రాజన్నను దర్శించుకున్న భక్తులు మరుసటిరోజు బద్దిపోశమ్మకు బోనాలు సమర్పించడం ఆనవాయితీ. భక్తులు డప్పుచప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ బోనాలతో ఆలయానికి చేరుకున్నారు. పట్నాలు, కల్లుపోసి, సారెపెట్టి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

- వేములవాడ కల్చరల్

## వడ్డేపల్లి చెరువులో మహిళ మృతదేహం!

- హత్యా.. ఆత్మహత్యా..!
- కాజీపేట పోలీసుల దర్యాప్తు

**కాజీపేట:** వరంగల్ నగరం కాజీపేట పట్టణ శివారులోని వడ్డేపల్లిచెరువులో గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని మంగళవారం కనుగొనడం స్థానికంగా కలకలం సృష్టించింది. కాజీపేట ఎస్సై దేవేందర్ కథనం ప్రకారం.. మంగళవారం ఉదయం స్థానికులు ఇచ్చిన సమాచారంతో కాజీపేట ఏసీపీ రవీంద్రకుమార్, పోలీసులు ఘటనాస్థలికి వెళ్లారు. మరణించిన మహిళ 30–35 సంవత్సరాల వయసు ఉంటుందని, ఎత్తు 5.1 అడుగులు, మెడలో, కుడి చేతికి ఎరుపు రంగు తాడు, బూడిద రంగు టాప్, తెలుపు ప్యాంటు పంజాబీ డ్రెస్ ధరించిన ఆమె చామనఛాయ రంగులో ఉందని పోలీసులు తెలిపారు. ఆమె చెవులకు చిన్న బుట్టా కమ్మలు, ముత్యపు ముక్కుపుల్ల ధరించగా.. చెరువు ఒడ్డున మృతురాలికి చెందిన బంగారురంగు చెప్పులు ఉన్నాయని ఎస్సై దేవేందర్ తెలిపారు. ఆమె హత్యకు గురైందా.. లేక ఆత్మహత్యకు పాల్పడిందా దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వరంగల్‌లోని ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించినట్టు చెప్పారు.

# సైబర్ నేరాలపై డేగకన్ను

అన్ని జిల్లాల్లో అత్యాధునిక సైబర్‌ల్యాబ్స్ ■ రాష్ట్రవ్యాప్తంగా సిబ్బందికి నిరంతర శిక్షణ
విదేశీ ప్రతినిధులతో ప్రత్యేక తరగతులు ■ విద్యార్థులకు అవగాహన సమావేశాలు ■ 'హద్దు'దాటేవారిపై అడుగడుగునా నిఘా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సమాజంలో నేరాల తీరు రోజురోజుకూ మారుతున్నది. చోరీలకు ముందుగానే ప్లాన్లువేసి, ఎవరికంటా పడకుండా దోచుకెళ్లే దొంగలకు ఇప్పుడు హాయిగా ఏసీ గదుల్లో కూర్చొని చిన్నపాటి కంప్యూటర్‌తో మన ఖాతాలోని సొమ్మంతా కొల్లగొట్టే సైబర్ నేరగాళ్లు తోడయ్యారు. ఇలాంటి నేరగాళ్లలో కొందరు యువతులు, మహిళల ఫోన్‌నంబర్లు సంపాదించి అసభ్యకరమైన మెసేజ్‌లు, ఫొటోలతో వారిని మానసికంగా క్షోభపెడుతున్నారు. దీంతో సైబర్ నేరగాళ్లను కట్టడిచేసేందుకు తెలంగాణ పోలీసులు పటిష్ఠ వ్యూహాలను అమలుచేస్తున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ తరహాలో అన్ని జిల్లాల్లో ప్రత్యేక సైబర్‌ల్యాబ్స్ ఏర్పాటుకు డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి చొరవ తీసుకొన్నారు. కొత్తతరహా నేరాల సరళిని ఎప్పటికప్పుడు అంచనావేస్తూ సైబర్ నేరపరిశోధనలో తెలంగాణ పోలీసులు ముందంజలో ఉండేలా డీజీపీ కార్యాలయంలోని లెర్నింగ్ సెంటర్‌లో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నారు.




### విదేశీ నిపుణులతో ప్రత్యేక శిక్షణ

హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్లతోపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కేంద్రాల్లో సుమారు రూ.70 కోట్లతో సైబర్‌ల్యాబ్స్‌ను ఏర్పాటుచేశారు. వీటిలో అడిషనల్ ఎస్పీ నుంచి కానిస్టేబుల్ స్థాయి వరకు కలిపి 165 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వీరందరికీ సైబర్ టూల్స్ వాడకం, సైబర్ నేరపరిశోధనలో అనుసరించాల్సిన వ్యూహాలు, మెళకువలపై అత్యాధునిక పద్ధతుల్లో నిరంత శిక్షణ ఇస్తున్నారు. వీరికి తెలంగాణ పోలీస్ విభాగంలోని సైబర్ క్రైం నిపుణులతో పాటు రష్యా, చెక్‌రిపబ్లిక్ తదితర దేశాల నిపుణులు తర్ఫీదునివ్వడంతోపాటు డీఎస్‌సీఐ (డాటా సెక్యురిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) బృందం అవగాహన తరగతులు నిర్వహించింది. సైబర్ నేరపరిశోధనలో అత్యంత కీలకమైన మొబైల్ ఎనాలసిస్, డాటా రికవరీ, వీడియో ఎన్‌హాన్స్‌మెంట్, సెల్ ఎన్‌హాన్స్‌మెంట్ తదితర పలు టూల్స్ వినియోగంలో తెలంగాణ పోలీసులు నైపుణ్యం సాధించారని, అన్ని జిల్లాల్లో నమోదైన సైబర్ నేరాలను డీజీపీ కార్యాలయం నుంచి పర్యవేక్షిస్తున్నారని ఓ ఉన్నతాధికారి తెలిపారు. మరోవైపు సైబర్ నేరాలపై సమాజంలో అవగాహన పెంచేందుకు సైబర్‌ల్యాబ్స్ సిబ్బంది అన్ని జిల్లాల్లోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు. సైబర్ నేరాలు ఎలా జరుగుతున్నాయి, అధికారుల ముసుగులో నేరగాళ్లు మన బ్యాంకు ఖాతాలను ఎలా కొల్లగొడుతున్నారన్న విషయాలను రాష్ట్రవ్యాప్తంగా 60 వేలమంది విద్యార్థులకు వివరిస్తున్నారు. సైబర్ నేరాలపై విద్యార్థుల ద్వారా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకే ఈ ప్రయత్నం చేస్తున్నట్టు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

### సోషల్ మీడియా పోకిరీలపై సైబర్‌ల్యాబ్స్ నిఘా

సోషల్ మీడియాద్వారా వదంతులు వ్యాప్తిచేసే వారితోపాటు వ్యక్తిగత దూషణలకు దిగేవారిపై అన్ని జిల్లాల్లోని సైబర్‌ల్యాబ్స్ సిబ్బంది నిఘాపెడుతున్నారు. ఏదైనా సంఘటనపై హద్దుదాటి ప్రవర్తించేవారితోపాటు ఇతరులను కించపర్చేలా వ్యాఖ్య లు పెట్టేవారిపై కఠినచర్యలు తీసుకొంటున్నారు. తాజాగా 'దిశ' ఘటనపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలుచేసిన నిజామాబాద్ జిల్లా యువకుడు శ్రీరాంను హైదరాబాద్ సీసీఎస్ సైబర్ క్రైం పోలీసులు మంగళవారం అరెస్టుచేశారు.


మంగళవారం హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్‌లో మొక్క నాటుతున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ అథర్‌సిన్హా


హైదరాబాద్ ఎస్సార్‌నగర్‌లోని ఇంట్లో మొక్క నాటుతున్న యాంకర్ శ్యామల

# గ్రీన్ చాలెంజ్‌లో ప్రముఖులు

**హైదరాబాద్/జగిత్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రాజ్యసభసభ్యుడు సంతోష్‌కుమార్ చేపట్టిన గ్రీన్‌చాలెంజ్‌కు విశేష స్పందన లభిస్తున్నది. వివిధరంగాల ప్రముఖులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. గ్రీన్‌చాలెంజ్‌లో ఇప్పటికే నాలుగున్నర కోట్ల మొక్కలను నాటడం పూర్తయింది. మంగళవారం జగిత్యాలలోని క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ శరత్ మొక్కలు నాటారు. కరీంనగర్ కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ విసిరిన చాలెంజ్‌ను స్వీకరించి కలెక్టర్ శరత్ ఐదు మొక్కలు నాటారు. నల్లగొండ, నిజామాబాద్, జోగులాంబ, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల కలెక్టర్లు, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, మెట్‌పల్లి సబ్‌కలెక్టర్ గౌతం పొత్రులకు గ్రీన్ చాలెంజ్‌ను చేశారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన ఎంపీ సంతోష్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రముఖ యాంకర్ శ్యామల ఎస్సార్‌నగర్‌లోని నివాసంలో మంగళవారం మూడు మొక్కలు నాటారు. అనంతరం యాంకర్లు ఝాన్సీ, రవి, వర్షిణిలను నామినేట్ చేశారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు.


జగిత్యాలలోని క్యాంపు కార్యాలయంలో మొక్కనాటి నీరు పోస్తున్న కలెక్టర్ శరత్

# 17న తుది జాబితా విడుదల

- ఈ నెల 9 వరకు అభిప్రాయాలు, సూచనల స్వీకరణ
- మున్సిపల్ వార్డుల పునర్విభజన షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మున్సిపాల్టీల్లో వార్డుల పునర్విభజన ప్రక్రియకు మంగళవారం షెడ్యూల్ విడుదలైంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను మున్సిపల్‌శాఖ విడుదల చేసింది. హైకోర్టు ఆదేశాలతో వార్డుల పునర్విభజన షెడ్యూల్‌ను ప్రకటిస్తున్నట్టు పేర్కొంది. వార్డుల పునర్విభజన జాబితా ముసాయిదాను బుధవారం పత్రికల్లో ప్రచురిస్తారు. ఈ నెల 9 సాయంత్రం 5 గంటలవరకు ప్రజల అభిప్రాయాలను, సూచనలను స్వీకరిస్తారు. వినతులు, అభ్యంతరాలపై విచారణ జరిపి పరిష్కరించేందుకు 16 వరకు గడువు ఉంటుంది. 17న వార్డుల పునర్విభజన జాబితాను పురపాలకశాఖ సంచాలకులకు అందజేస్తారు. అదేరోజు ప్రభుత్వం తుది జాబితాను విడుదల చేస్తుంది. రాష్ట్రంలోని 121 మున్సిపాల్టీలు, 10 కార్పొరేషన్లను వార్డులుగా పునర్విభజించనున్నారు. ఈ ప్రక్రియను అధికారులు సమర్థంగా నిర్వహించాలని, పటాలను రూపొందించే క్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ స్పష్టంచేసింది. ఒక వార్డు నుంచి మరో వార్డుకు ఓటింగ్ స్ట్రెంత్ 10 శాతం దాటకుండా చూడాలని, ప్రజల అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకొని అభ్యంతరాలపై పూర్తిస్థాయిలో విచారణ జరుపాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించింది. సమగ్ర పరిశీలన కోసం తుది ప్రతిపాదనలను ఈ నెల 17న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌కు అందజేయాల్సి ఉంటుందని ఆ శాఖ ముఖ్యకారదర్శి అర్విండ్‌కుమార్ స్పష్టంచేశారు.

Regional Centre for Urban and Environmental Studies
Sponsored by Ministry of Urban Development, Govt. of India
Osmania University, Hyderabad - 500007
RCUES HYDERABAD
NOTIFICATION
Applications are invited for the Post of Director, Regional Centre for Urban and Environmental Studies, Osmania University, Hyderabad. The details of eligibility criteria are available at www.osmania.ac.in/ www.rcueshyd.gov.in. Last date for submission of application as per the prescribed format with relevant documents is three weeks from the date of publication.
Registrar, Osmania University




ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్
పౌడర్ మెటలర్జీ & న్యూ మెటీరియల్స్ (ARCI)
(సైన్స్ & టెక్నాలజీ శాఖ, భారత ప్రభుత్వ అటానమస్ R&D సెంటర్)
బాలాపూర్ పోస్ట్, హైదరాబాద్–500005, తెలంగాణ

ARCI

ప్రకటన నం. ARCI/HRD/RECT/3/2019
దిగువ రెగ్యులర్ ఉద్యోగాల కొరకు ARCI హైదరాబాద్ ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది

| | |
|---|---|
| టెక్నికల్ అసిస్టెంట్ "A" | ఉద్యోగాల సంఖ్య: 01 (ఒకటి) పే లెవల్: 6 |
| అసిస్టెంట్ "A" | ఉద్యోగాల సంఖ్య: 05 (ఐదు) పే లెవల్: 5 |
| టెక్నీషియన్ "A" | ఉద్యోగాల సంఖ్య: 05 (ఐదు) పే లెవల్: 4 |

ఆన్‌లైన్ దరఖాస్తుల దాఖలుకు ఆఖరి తేదీ: 23–12–2019
మరిన్ని వివరాలకు దర్శించండి: https://www.arci.res.in/careers
davp 36120/11/0008/1920



ప్రధాని మోదీ కలిసి పనిచేద్దామని అంటే దానికి మా తండ్రి వినమ్రంగా లేదన్నారు. నేను ఆ మీటింగ్‌లో లేను. ఇది ఇద్దరు సీనియర్ నేతల మధ్య జరిగింది. ఒకవేళ ఆ ప్రతిపాదన చేసి ఉంటే అది ప్రధాని పెద్దమనిషి తనం. సిద్ధాంత వైరుధ్యాలు ఉన్నప్పటికీ మహారాష్ట్రలో వ్యక్తిగత సంబంధాలు చాలా ముఖ్యమైనవి.

**సుప్రియా సూలే, ఎన్సీపీ నేత**

బీజేపీ ప్రజల సేవనే విశ్వసిస్తుంది. కానీ జార్ఖండ్‌లో జేఎంఎం-కాంగ్రెస్ కూటమి వంచన రాజకీయాలను అనుసరిస్తున్నది. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు బీజేపీ ఒక్కటే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుందని నమ్మకం ఉన్నది.

**నరేంద్రమోదీ, ప్రధాని**



**చరిత్రలో నేడు**



1534

బాగ్దాద్‌ను ఆక్రమించిన ఒట్టోమన్ సుల్తాన్ సులేమాన్.

1963

ఇటలీలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన అల్డో మోరో.





1982

రాజ్యాంగాన్ని స్వీకరించిన చైనా.

బంగ్లాదేశ్‌లో మందుల ధరలు భారీగా ఉండటానికి వైద్యులను మెప్పించడానికి భారీ మొత్తం ఖర్చు చేయడమేనని ఒక అధ్యయనంలో వెల్లడైంది. వైద్యులను సంతృప్తిపరుచడానికి ఔషధ సంస్థలు వారికి విదేశీ పర్యటనలను కూడా ఏర్పాటు చేస్తున్నాయి. సెమినార్ల పేర విదేశాలకు పంపిస్తున్నాయి. ప్రభుత్వం ఈ మందుల ధరలను నియంత్రించడానికి ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలె. డాక్టర్లు కంపెనీల బ్రాండ్‌తో కాకుండా జెనెరిక్ మందులను రాసేవిధంగా చర్యలు తీసుకోవాలె.

**ది డైలీ స్టార్**

హాంకాంగ్‌లో ఇటీవల అల్లర్లు సాగినప్పడు పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారు. ప్రదర్శకులను చెదరగొట్టడానికి రంగునీళ్లను కూడా చిమ్మారు. అయితే బాష్పవాయువు, రంగునీళ్ల వల్ల ఆ ప్రాంతంలో ఉన్నవారి ఆరోగ్యానికి ఏ విధమైన హాని జరుగుతుందనే చర్చ మొదలైంది. పోలీసులు మాత్రం ఏ ప్రమాదం లేదని, ప్రదర్శకులు విసిరిన ఫైర్ బాంబులే ప్రమాదకరమని అంటున్నారు. కానీ బాష్పవాయువులో ఉండే పదార్థాలు ఏమిటనే వివరాలను వెల్లడించడం లేదు. ప్రభుత్వం ఈ విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలె.

**సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్**



# అసహన పాలన

దేశంలో భయానక వాతావరణం ఏర్పడ్డదనీ, ప్రజలు ప్రభుత్వాన్ని విమర్శించడానికి భయపడుతున్నారని ప్రముఖ పారిశ్రామికవేత్త రాహుల్ బజాజ్ ఇటీవల ఒక కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడం సంచలనం సృష్టించింది. ఇటీవల ఒక కార్యక్రమంలో వేదిక మీద ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ఉద్దేశించి బజాజ్ ఈ ప్రశ్న వేశారు. ఇదే వేదిక మీద ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రైల్వే మంత్రి పీయూష్ గోయల్ కూడా ఉన్నారు. జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి 4.5 శాతానికి దిగజారిన నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. గత ఆరున్నరేండ్లలో వృద్ధి కనిష్ట స్థాయికి చేరింది. ప్రభుత్వం విమర్శలను స్వీకరిస్తుందనే నమ్మకం సన్నగిల్లిందని కూడా బజాజ్ అన్నారు. ప్రభుత్వం భయానక, అనిశ్చిత పరిస్థితిని సృష్టించిందని ఆయన ఆరోపించారు. 'యూపీఏ-2 పాలనలో ఎవరినైనా తప్పుపట్టే పరిస్థితి ఉండేది. మీరు మంచి పని చేస్తున్నారు. కానీ మేం బహిరంగంగా విమర్శించాలనుకుంటున్నాం. కానీ మీరు స్వీకరిస్తారనే నమ్మకం లేదు. నా అభిప్రాయం తప్పు కావచ్చు. కానీ ప్రతి ఒక్కరూ ఈ విధంగా భావిస్తున్నారు' అని రాహుల్ బజాజ్ ఎంతో హుందాగా, నిక్కచ్చిగా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. రాహుల్ బజాజ్ ఏదో ఒక మాటతో సరిపెట్టుకోలేదు. ఆయన చేసిన వ్యాఖ్య వివరమైనదీ, విస్తృతమైనది. గాంధీ హంతకుడు గాడ్సే విషయమై బీజేపీ ఎంపీ ప్రజ్ఞాసింగ్ చేసిన వ్యాఖ్యను కూడా బజాజ్ ప్రస్తావించారు.

**నాటి మిశ్రమ ఆర్థికవ్యవస్థను, నేటి స్వేచ్ఛా వాణిజ్యాన్ని ప్రత్యక్షంగా చూసిన పారిశ్రామికసంస్థల సారథుల అభిప్రాయాలను తేలిగ్గా కొట్టిపారేయలేము. రాహుల్ బజాజ్ అభిప్రాయాలతో వేదిక మీద ఉన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా విభేదిస్తూనే, అటువంటి సమస్య ఏదైనా ఉంటే కలిసి పరిష్కరిద్దామని అన్నారు. కేంద్రం ఇదే వైఖరిని అనుసరించి పారిశ్రామికవేత్తలలోని భయాలను తొలిగించడంతో పాటు దేశాన్ని ఆర్థిక దుస్థితి నుంచి గట్టెక్కించాలె. రాజకీయ, సామాజిక, ఆర్థికరంగాల్లో నెలకొన్న అసహన వైఖరిని విడనాడినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది.**

రాహుల్ బజాజ్ వ్యాఖ్యలతో మరో పారిశ్రామికవేత్త ఏకీభవించారు. ఒక పారిశ్రామికవేత్త ట్విటర్‌లో మద్దతు ఇచ్చి ఆ తర్వాత ఉపసంహరించుకున్నారు. 2016లో మోదీ ప్రభుత్వం పెద్దనోట్ల రద్దుకు పాల్పడినప్పటి నుంచి ఆర్థిక వ్యవస్థ దిగజారుతున్నదని, అయినా భారత పారిశ్రామికరంగం మౌనంగా ఉన్నది. ప్రభుత్వ విధానాలను తప్పుపట్టడానికి భయపడుతున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ కూడా ఆర్థిక వ్యవస్థ ఆందోళనకరంగా ఉందని, ఇందుకు సామాజిక అనిశ్చితి కారణమని ఇటీవలే ఒక కార్యక్రమంలో అన్నారు. తమకు అనుకూలంగా లేని పారిశ్రామికవేత్తలను మోదీ ప్రభుత్వం కేంద్ర సంస్థల ద్వారా వేధిస్తున్నదనే ఆరోపణలున్నాయి. కేఫ్ కాఫీడే యజమాని సిద్ధార్థ ఆత్మహత్య చేసుకోవడానికి ముందు రాసిన లేఖను ఇందుకు ఉదహరిస్తున్నారు. రాహుల్ బజాజ్ వ్యాఖ్యల పట్ల అమిత్ షా సంయమనంతో స్పందించినప్పటికీ, బీజేపీ పెద్దలు ఆ తర్వాత తమ అసహనాన్ని బయటపెట్టారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ట్విటర్ ద్వారా స్పందిస్తూ-రాహుల్ బజాజ్ ఆరోపణలు జాతీయ ప్రయోజనాలను దెబ్బ తీస్తాయని అన్నారు. కేంద్ర నగరాభివృద్ధి మంత్రి హర్‌దీప్ పూరీ బజాజ్ వ్యాఖ్యలను దుర్భాషలాడటంగా చిత్రీకరించారు. బీజేపీ ఐటీ సెల్ రాహుల్ బజాజ్‌ను కాంగ్రెస్ మిత్రుడిగా చూపుతూ అసలు చర్చను పక్కకునెట్టే ప్రయత్నం చేసింది. ప్రముఖ పారిశ్రామిక వేత్తలైనా బజాజ్ కుటుంబానికి నెహ్రూతో సాన్నిహిత్యం ఉండేది. నాటి భారతీయ పారిశ్రామికవేత్తలు గాంధీ, నెహ్రూలకు దగ్గరగా ఉండేవారు. వారికి నాటి కాంగ్రెస్ పార్టీ విలువలతో ఏకీభావం ఉండేది. అయినంత మాత్రాన పార్టీకి కట్టిపడేయ కూడదు.

స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి భారత్‌లో నెలకొన్న పరిస్థితి మిగతా దేశాలతో పోలిస్తే భిన్నమైనది. నెహ్రూ నాయకత్వంలో మన దేశం సోషలిస్టు ఆర్థిక నమూనా వైపు మొగ్గు చూపినప్పటికీ, మిశ్రమ ఆర్థిక వ్యవస్థ పేర పారిశ్రామిక సంస్థలకు కూడా ప్రోత్సాహమిచ్చింది. పారిశ్రామిక సంస్థలు ఉత్పత్తిరంగంలో ఎంత ఎదిగినా సామాజిక సంక్షేమానికి ఆటంకంగా కనిపించకపోయేవి. ఇప్పటి మాదిరిగా ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం పేట్రేగిపోతూ, వ్యాపారాల పేర భారీ ఎత్తున ప్రకృతి విధ్వంసానికి పాల్పడటం, రాత్రికిరాత్రే భారీ పారిశ్రామిక సామ్రాజ్యాలుగా మారడం జరిగేది కాదు. పారిశ్రామికవేత్తలు కూడా కొన్ని విలువలను పాటించాలనే అభిప్రాయం ఉండేది. పాలకులకు, పారిశ్రామికవేత్తలకు మధ్య సత్సంబంధాలు ఉండేవి. టాటా వంటి పారిశ్రామిక వేత్తలు తమ వాటాదార్ల ప్రయోజనాలకు ధర్మకర్తలుగా భావించుకునేవారు. తమ వ్యాపార నిర్వహణను కూడా సమాజ ప్రయోజనాలను తీర్చడంగానే పరిగణించేవారు. లైసెన్స్ రాజ్ అంటూ ఎద్దేవా చేసిన కాలంలో పారిశ్రామికవేత్తలు అనుభవించిన భద్రత కూడా ఈ మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో ఎందుకు కరువైందనేది ఆలోచించవలసిన విషయం. రాహుల్ బజాజ్ వంటి పారిశ్రామిక వేత్తలకు నిర్మొహమాటంగా మాట్లాడేవారిగా పేరున్నది. నాటి మిశ్రమ ఆర్థికవ్యవస్థను, నేటి స్వేచ్ఛా వాణిజ్యాన్ని ప్రత్యక్షంగా చూసిన పారిశ్రామికసంస్థల సారథుల అభిప్రాయాలను తేలిగ్గా కొట్టిపారేయలేము. రాహుల్ బజాజ్ అభిప్రాయాలతో వేదిక మీద ఉన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా విభేదిస్తూనే, అటువంటి సమస్య ఏదైనా ఉంటే కలిసి పరిష్కరిద్దామని అన్నారు. కేంద్రం ఇదే వైఖరిని అనుసరించి పారిశ్రామిక వేత్తలలోని భయాలను తొలిగించడంతో పాటు దేశాన్ని ఆర్థిక దుస్థితి నుంచి గట్టెక్కించాలె. రాజకీయ, సామాజిక, ఆర్థికరంగాల్లో నెలకొన్న అసహన వైఖరిని విడనాడినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది.

**జనగళం**

## సీఎం నిర్ణయం భేష్

55 రోజుల పాటు సమ్మె చేసిన ఆర్టీసీ కార్మికులను ఎలాంటి షరతులు విధించకుండా మళ్లీ విధుల్లో చేర్చుకోవాలని సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం హర్షణీయమైనది. అంతేకాకుండా సమ్మెకాలం జీతాలు కూడా చెల్లిస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ పట్ల యావత్ ఆర్టీసీ కార్మిక లోకం సంతోషం వ్యక్తం చేస్తున్నది. సమ్మెకాలంలో మరణించిన ఆర్టీసీ కార్మికుల కుటుంబంలోని ఒక వ్యక్తికి ఉద్యోగం, తక్షణ సాయం కింద 2 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని అధికారులను ఆదేశించటం కార్మికుల పట్ల సీఎం కేసీఆర్‌కు ఉన్న ప్రేమను తెలియజేస్తున్నది. కాబట్టి ఆర్టీసీ ఉద్యోగులు యూనియన్ నాయకుల మోసపూరిత మాటలను పక్కనబెట్టి ఆర్టీసీ ఆదాయం పెంచేందుకు కృషిచేయాలె.

**- బైరి జనార్దన్, ప్రగతినగర్, హైదరాబాద్**

## అవగాహన కల్పించాలె

పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు షీ టీమ్స్ ద్వారా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేయాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డి డీజీపీకి లేఖ రాయడం మంచి నిర్ణయం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థినులకు ఆత్మరక్షణ మెళకువలు నేర్పించాలి. విద్యార్థినుల్లో అవగాహన పెంచాలి. వేధింపులకు గురవుతున్న మహిళలు, విద్యార్థినులు పోలీసులకు ఎలా ఫిర్యాదు చేయాలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత 'షీ' టీమ్స్‌పై ఉన్నది.

**- బేగరి ప్రవీణ్‌కుమార్, అంతారం, రంగారెడ్డి జిల్లా**

## ఆల్ ది బెస్ట్

దక్షిణాఫ్రికా వేదికగా వచ్చే సంవత్సరం జనవరిలో ప్రారంభం కానున్న అండర్-19 ప్రపంచకప్‌కు హైదరాబాద్ కుర్రాడు ఠాకూర్ తిలక్‌వర్మ సెలెక్ట్ కావడం హర్షణీయం. తిలక్ వర్మ ఈ మెగా టోర్నీలో తన సత్తా నిరూపించుకొని భారత జట్టులో చోటు దక్కించుకోవాలి. అండర్-19 ప్రపంచకప్‌లలో రాణించి జాతీయ జట్టుకు ఎంపికైన కోహ్లీ, కైఫ్ లాంటి క్రికెటర్లను తిలక్‌వర్మ స్ఫూర్తిగా తీసుకోవాలి. ఆల్ ది బెస్ట్ తిలక్‌వర్మ.

**- జవ్వాజి సుధాకర్, కురిక్యాల, కరీంనగర్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

విశ్లేషణ



**సీహెచ్‌వీ ప్రభాకర్‌రావు**

# ఆర్థిక చుక్కానిలేని దేశం

వ్యవసాయం తర్వాత అతిపెద్ద ఉద్యోగాలను కల్పించేవి సేవారంగం., ఆటోమొబైల్ రంగాలు. ఈ రంగాల్లో సంక్షోభం పెరిగిపోయింది. వీటిలో దాదాపు పది, పదిహేను శాతం ఉద్యోగులను తొలిగించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అయితే అలాంటి మాటలు చెప్పేవారంతా విదేశీ శక్తుల చేతిలో కీలుబొమ్మలు. వారు దేశాన్ని అల్లకల్లోలం చేయాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించడం అధికారపక్ష నాయకులకు అలవాటైపోయింది.

దేశ ప్రగతిని ముందుకు నడిపించాల్సిన ప్రభుత్వాధినేతలకు ఆర్థికరంగంపై పట్టులేకున్నా, అవగాహన ఉండాల్సిన అవసరాన్ని నేటి భారతదేశ ఆర్థికరంగంలోని పరిస్థితులు ఎత్తి చూపుతున్నాయి. రాజకీయరంగంలో విద్యార్హతలు లేకున్నా ప్రజా నాయకులుగా, ప్రభుత్వాధినేతలుగా ఎదిగి ప్రపంచఖ్యాతిని ఆర్జించవచ్చు. భారతదేశం విద్యారంగంలో వెనుకబడిందనే విషయాన్ని గుర్తించిన మన రాజ్యాంగ నిపుణులు ఎలాంటి విద్యార్హతలు లేకున్నా శాసనకర్తలుగా, భారత భాగ్యవిధాతలుగా వెలుగొందవచ్చని, భారదేశ భవిష్యత్‌కు మార్గాలు వేయాలని నిర్ణయించారు.

ప్రపంచబ్యాంక్ లాంటి అనేక విదేశీ రేటింగ్ సంస్థలు, ఆర్థికనిపుణు లు మాత్రమే కాదు, భారదేశ రిజర్వ్ బ్యాంక్ కూడా దేశ ఆర్థికస్థితి బాగా లేదని చెపుతున్నది. ద్రవ్యలోటు గతంలో 4 శాతానికి అటు ఇటుగా ఉన్న ది. ఈ సారి 6 శాతానికి అటు ఇటుగా ఉన్నా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. గత ఆరేండ్ల కనీస స్థాయికి ఈ ఆర్థిక సంవత్సర ద్వితీయ, త్రైమాసిక వృద్ధిరేటు ఫలితాలు పడిపోయాయి.

ఆర్థికరంగం పట్ల అవగాహన కన్నా, తమ వ్యక్తిగత ఎజెండాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనివల్ల దేశ ఆర్థిక పరిస్థితులు ఆందోళన కలిగించే స్థాయిలోకి దిగజారుతున్నాయి. దేశ ప్రజల పట్ల ఆలోచించే వ్యక్తిత్వం ఉన్న నాయకులు లేకపోగా, అలా ఆలోచించేవారిని సంకుచితులుగా, విదేశీ శక్తుల భక్తులుగా విమర్శించడం శోచనీయం.

నిజానికి భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికి రాజకీయాల్లో ఉన్న వారిలో చాలామంది న్యాయవాదులు, బాగా చదువుకొన్నవారు, సమాజం పట్ల అవగాహన, చిత్తశుద్ధి ఉన్నవారే ఉన్నారు. దీనివల్ల, నాటి నాయకుల నిజాయితీని శంకించకుండా ఈ నాయకులతో పాటు, ప్రజల్లోని అధికభాగం నిరక్షరాస్యులైనా గ్రామాల్లో తమ వారిపట్ల సానుభూతితో ఆలోచించి వారి మేలుకోరే మంచి మనసున్న నాయకులు అనేక మంది ఉండేవారు. అలాంటి వారందరికి దేశ పరిపాలనలో భాగస్వామ్యం కల్పించడం కోసమే ఎలాంటి విద్యార్హతలు లేకున్నా శాసనకర్తలుగా ఎదుగడానికై అందరికీ ఓటు హక్కు, ఎన్నికల్లో పోటీచేసే హక్కు కల్పించారు.

కాలం మారుతున్నది. తరాలు మారాయి. నిజాయితీ గల నాయకుల స్థానంలో స్వార్థం, ఆశ్రిత పక్షపాతం, ధనార్జనే లక్ష్యంగా గల నాయకత్వం ఎదుగుదల ప్రారంభమైంది. దేశ ప్రజల జీవనస్థితిగతులు ఎలా ఉన్నా, తమ వర్గ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. దీర్ఘకాలం పాటు పాలనాపగ్గాలు తమ చేతులనుంచి జారిపోకుండా ఉండటం కోసం ఎన్ని ఎత్తులైనా వేస్తున్నారు. ఎలాంటి మొహమాటం లేకుండా ముందుకుపోగల సమర్థులు నేటి పాలకులు.

భారతదేశంలోని ఉత్పత్తిరంగాలన్నీ గత ఏడేండ్ల కన్నా దిగువస్థాయికి పడిపోయాయి. దీంతో ఆయా సంస్థలు ఉద్యోగులను తొలిగించాలని ఆలోచిస్తున్నాయి. ఈ క్లిష్ట సమయంలో దేశంలో ఇలాంటివి సర్వసాధారణమే అంటూ, రాజకీయ ప్రకటనలు చేయడం వారి విజ్ఞతకే చెల్లింది. ప్రజల ఆర్థికస్థితి దిగజారిపోయింది. కనీస అవసరాలను తీర్చుకోగల స్థాయిలో లేమని, తమ కొనుగోలుశక్తి గతంలో ఎన్నడూలేనంత దిగువకు పడిపోయిందని వాపోతున్నారు. కానీ వీటిని సరిదిద్దాల్సిన వారు నారుపోసినవాడే నీరు పోస్తాడు ప్రార్థించమని సూక్తులు చెప్తున్నారు. ఇలాంటి వారికి మనం చేతులెత్తి నమస్కరించడం తప్ప, సామాన్య ప్రజలు చేయగలిగిందేమీ లేదు.

భారతదేశంలోని అన్నిరకాల ఉత్పత్తులు, సేవారంగాలు కలిపి గత ఆర్థిక సంవత్సరంలో చేసిన మొత్తం ఉత్పత్తిలో కనీస సగానికి కూడా సరిపోయే స్థాయిలో ఈ ఆర్థిక సంవత్సరంలోని ఆరునెలలలో సాధించ లేదు. మీకు భయం లేదు వచ్చే రెండు, మూడేండ్లలో భారతదేశ ఆర్థికప్రగతి, జాతీయ వృద్ధిరేటు ప్రపంచ అగ్రరాజ్యాల స్థాయికి చేరుతుందని ధైర్యం చెప్తున్న పాలకుల ఆత్మస్థైర్యానికి సామాన్య ప్రజలు నివ్వెరపోతున్నారు.

సామాన్యుల రోజువారి భోజనంలో ప్రధాన వస్తువైన ఉల్లిగడ్డల ధరలు రోజురోజుకు ఆకాశాన్నంటుతున్నాయి. భారతదేశం చంద్రున్ని చేరుకొంటున్న ఈ రోజుల్లో ఇంకా ఉల్లిగడ్డల గురించి ఆలోచించేవారంతా దేశద్రోహులని విమర్శించి, నోరు మూయించగల గొప్ప నాయకత్వం మనది.

వ్యవసాయం తర్వాత అతిపెద్ద ఉద్యోగాలను కల్పించేవి సేవారంగం., ఆటోమొబైల్ రంగాలు. ఈ రంగాల్లో సంక్షోభం పెరిగిపోయింది. వీటిలో దాదాపు పది, పదిహేను శాతం ఉద్యోగులను తొలిగించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అయితే అలాంటి మాటలు చెప్పేవారంతా విదేశీ శక్తుల చేతిలో కీలుబొమ్మలు. వారు దేశాన్ని అల్లకల్లోలం చేయాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించడం అధికారపక్ష నాయకులకు అలవాటైపోయింది.

**గతేడాది జీడీపీ వృద్ధి రేటు 6 శాతానికి అటుఇటుగా ఉంటే అది తమ గొప్పతనంగా చెప్పుకొన్నది ప్రభుత్వం. మరి ఇప్పుడు గత ఆరునెలల్లో ఉత్పత్తి తగ్గిపోయింది. సామాన్యుల కొనుగోలుశక్తి పడిపోయింది. ఫలితంగా జీడీపీ వృద్ధిరేటు ఆరేండ్ల కనిష్ట స్థాయి 4.5 శాతానికి తగ్గిపోయింది. ఇది గత కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పుడు విధానాల వల్లే అంటూ పార్లమెంట్, టీవీ చర్చల్లో ప్రకటించే నిసిగ్గుతత్వం కనపడుతున్నది.**

ప్రభుత్వరంగంలో బాగా లాభాలు సంపాదిస్తున్న సంస్థలతో పాటు నష్టాలను తెస్తున్నా సంస్థలున్నాయి. వీటిని ప్రైవేట్ వ్యక్తులకు, సంస్థలకు అమ్మేయాలని ప్రభుత్వం గత నాలుగైదేండ్ల నుంచి ప్రయత్నిస్తున్నది. కానీ అనుకున్నస్థాయిలో ఈ అమ్మకం ప్రక్రియ కొనసాగడం లేదు. లాభాల్లో ఉన్న సంస్థలను అమ్మకానికి పెట్టేపుడు ప్రభుత్వం విధించే నిబంధనల విషయంలో పలువురు పలు అనుమానాలను వ్యక్తం చేస్తు న్నారు.

ప్రభుత్వరంగంలోని లాభదాయక సంస్థలైన బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, షిప్పింగ్ కార్పొరేషన్, కంటైనర్ కార్పొరేషన్ లాంటి సంస్థలతో పాటు నష్టాలను తెస్తున్న తెహ్రీ లాంటి విద్యుత్‌సంస్థలను అమ్మకానికి పెట్టారు. కానీ ప్రభుత్వేతరులు ఎవరుకూడా ముందుకురాలేదు. దీంతో ప్రభుత్వ ఆధీనంలోని నవరత్న సంస్థలైన ఓఎన్జీసీ, ఎన్టీపీసీ లాంటి సంస్థలతో వీటిని కొనిపిస్తున్నారు. అంటే కుడి జేబులో డబ్బులేకుంటే ఎడమ జేబులో నుంచి తీసి కుడి జేబులో పెట్టినట్లు ఒక సంస్థలోని లాభాలతో మరో ప్రభుత్వసంస్థను కొనడంలోని ఔచిత్యమేమిటో ప్రభుత్వ ఆర్థిక నిపుణలకే అర్థం కావాలి.

ప్రభుత్వాధికారుల చేతిలో ఈ సంస్థలు లాభాలను ఆర్జించలేవని చెపుతున్నవారే, మరో ప్రభుత్వసంస్థ ఎలా లాభాలు ఆర్జిస్తుందో చెప్పలేక పోతున్నారు. కొంతమంది అధికారుల నిర్లక్ష్యం వల్లనో లేదా మార్కెట్ పరిస్థితుల వల్లనో ఒక సంస్థ నష్టపోతే దాన్ని అందరికీ అంటగట్టడం సరి కాదు. 'ప్రభుత్వం లాభాపేక్ష లేకుండా ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలి తప్ప వ్యాపారం చేయకూడదని' దేశ అత్యున్నత న్యాయస్థానం ఎప్పుడో చెప్పింది.

బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ లాంటి సంస్థలను వాటి పూర్వ సొంతదారులైన విదేశ కంపెనీల కోణాలుకొన్న నేటి ప్రభుత్వ విధానాలు, ఆర్థిక ప్రణాళికలోని ఒడిదుడుకులను అర్థం చేసుకోలేక ముందుకురావడం లేదనే వాదన కూడా ఉన్నది. ఈ రెండుసంస్థలు ప్రపంచంలోని పెద్ద ఆయిల్ రిఫైనరీలు కలిగిన వాటి కోవలోకే చెందుతాయి.

ఇక ఎయిర్ ఇండియా పరిస్థితి మరీ అధ్వాన్నం. ఇది ప్రభుత్వానికి గుదిబండలా తయారైంది. దీనికి వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఆస్తుల విలువ ఎంత ఉన్నా ఇందులో ప్రభుత్వం పెట్టే గొళ్ళాలు, మెళికల వల్ల కూడా ఈ విమాన సంస్థను ఎవరు కొనడానికి ముందుకురావడం లేదు. గమ్మతేమంటే, ఈ సంస్థ నష్టాల్లో ఉందని తెలిసి మరీ కొత్త విమానాలను కొనడానికి అప్పులు తీసుకొమ్మ ని ప్రభుత్వం చెప్పడం అంటే కావాలనే ఈ సంస్థ అప్పులను పెంచాలని చూస్తుందనే విషయం అర్థమవుతుంది.

నేడు భారతదేశం ఆశ్రితపెట్టుబడిదారీ విధానంలో కొనసాగుతూ, నిజమైన పెట్టుబడిదారులను, తమకు వ్యతిరేకమైన వ్యాపార, వాణిజ్య వర్గాల పెద్దలను ఆదాయపన్ను, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పేర దాడులు చేయిస్తుందనే మాట అందరిలో ఉన్నది. ఎందుకంటే కర్నాటకలో రాజకీయ కుటుంబంతో సంబంధాలున్న కాఫీడే అధినేత అప్పులు తీర్చుకోవడానికి చేసిన ప్రయత్నాలను ఈ రెండు సంస్థలు అడ్డుకున్నాయనే ఆరోపణలున్నాయి. చివరికి ఆయన ఆత్మహత్య పారిశ్రామికుల్లో కలకలం రేపింది. అలాగే తమకు అనుకూలమైన డీహెచ్‌ఎల్‌ఎఫ్, పీఎంసీ, ఇండియబుల్స్‌లాంటి సంస్థల్లో జరిగిన ఆర్థిక నేరాలను, కుంభకోణాలను బయటకురాకుండా వీలైనన్నిరోజులు కప్పిపెట్టి, చివరిక్షణంలో తప్పనిసరి అయిన వేల దివాళా ప్రక్రియ వైపు నడిపించగల సమర్థత, నైపుణ్యం గలమనవారనే మంచితనంతో పనిచేసే ప్రభుత్వాధినేతలు ఉండటం వల్ల సాధారణ పారిశ్రామికవేత్తలు భయపడుతున్నారు.

గతేడాది జీడీపీ వృద్ధి రేటు 6 శాతానికి అటుఇటుగా ఉంటే అది తమ గొప్పతనంగా చెప్పుకొన్నది ప్రభుత్వం. మరి ఇప్పుడు గత ఆరునెలల్లో ఉత్పత్తి తగ్గిపోయింది. సామాన్యుల కొనుగోలుశక్తి పడిపోయింది. ఫలితంగా జీడీపీ వృద్ధిరేటు ఆరేండ్ల కనిష్ట స్థాయి 4.5 శాతానికి తగ్గిపో యింది. ఇది గత కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పుడు విధానాల వల్లే అంటూ పార్లమెంట్, టీవీ చర్చల్లో ప్రకటించే నిసిగ్గుతత్వం కనపడుతున్నది. ఇప్పటికైనా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకత్వం తన పునాది అయిన ఆర్‌ఎస్‌ఎస్, దాని మాన సపుత్రిక అయిన స్వదేశీ జాగరన్ మంచ్‌ల ఆలోచనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. దేశ ఆర్థికరంగాన్ని ప్రధాని ఆశించే, కళలుగానే 5 లక్షల కోట్ల స్థాయికి తీసుకెళ్లడానికి అన్నివర్గాల వారిని ఆహ్వానించి, వారి సూచనలు, సలహాలు తీసుకొంటే తప్ప మన వృద్ధిరేటు పెరుగదు. ఫలితంగా కనీస నిత్యావసర వస్తువులను కొనుగోలు చేయగలిగే స్థితిలో సామాన్యుడు ఉండడు.

**(వ్యాసకర్త: సీనియర్ రాజకీయ విశ్లేషకులు)**

# సత్ప్రవర్తన నేర్పాలె

విశ్లేషణ



**లట్టుపల్లి విక్రమ్**

దిశ హత్యోదంతంలో నిందితులను బహిరంగంగా ఉరితీయాల్సిందే.. ఆమె మాదిరిగా చిత్రహింసలు పెట్టి చంపాల్సిందే.. ఇందుకు మృగాళ్లను జనానికి అప్పగించాల్సిందే.. ఎందుకంటే వారు చేసింది క్షమించరాని నేరం. ఆఫ్ఘనిస్థాన్‌లో ఇలాంటి తప్పుచేసినవాడిని నాలుగురోజుల్లో బహిరంగంగా చంపారు.. వరంగల్‌లో యాసిడ్‌దాడి నిందితులను చంపినట్టు ఎన్‌కౌంటర్ చేయాలి. 'మాకు అప్పగించండి మేమే శిక్షిస్తాం..' ఇవి ప్రధానంగా ఇటీవల షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ వద్ద ప్రజల నుంచి వెల్లువెత్తిన ఆగ్రహజ్వాలలు. ఇక్కడ మనం ఒకటి గమనించాలి. గాయం ఒకచోట ఉంటే మందు మరోచోట రాస్తే ఫలితం ఉండదు. అందుకే కీలెరిగి వాత పెట్టమంటారు పెద్దలు. పుట్టుకతో ఎవ్వరూ నేరస్థులు కారు. ప్రతి వ్యక్తిలో మంచి మనస్సుతో పాటు అంతర్లీనంగా రాక్షసబుద్ధీ ఉంటుంది. రాక్షసబుద్ధిని అణిచినప్పుడు మంచి మనిషి బయటపడుతాడు. కానీ, నేటి పరిస్థితులు చిన్నప్పటి నుంచే రాక్షసబుద్ధిని వృద్ధి చేస్తూ.. మనిషిని తొక్కిపడేస్తున్నాయి. సమాజాన్ని మార్చేది ముగ్గురే ముగ్గురు అంటారు మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం. ఆ ముగ్గురు తల్లిదండ్రులు, గురువు. పిల్లలు మొదట తల్లిని చూసి, ఆ తర్వాత తండ్రి నుంచి నేర్చుకుంటారు. గురువులు, సమాజం నుంచి ఇతర జ్ఞానం సముపార్జిస్తారు. నేటి తల్లిదండ్రులు ఎలా ఉన్నారు. కొందరైతే ఆడపిల్ల మాకొద్దని గర్భంలోనే చంపేస్తున్నారు. వంశోద్ధారకుడు కావాలని అర్రులు చాస్తున్నారు. పుట్టాక ఒక్కగాకొక్క కొడుకని అతిగారభం చేస్తున్నారు. అడక్కుండానే సర్వం తెచ్చిపెడుతున్నారు. ఈ క్రమంలో కొందరు తల్లిదండ్రులు గాడి తప్పుతున్నారు. పాతికేళ్ల కిందట ఓ బాలిక తొమ్మిదో తరగతిలోనే ప్రేమ వివాహం చేసుకున్నది. ఆమె కుమార్తె తాజాగా ఇంటర్‌లోనే మైనర్.. ప్రేమ వివాహానికి సిద్ధపడింది. ఆ తల్లి బిడ్డను ఏమని నిలదీయగలదు. పిల్లలు కూడా తల్లిదండ్రులను మించిపోతున్నారు. మరికొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను మనిషిగా తీర్చిదిద్దడం లేదు. ఇంగితం, సంస్కృతి, సంప్రదాయాలు, ఇతరుల పట్ల ఎలా మెలగాలో కనీసం నేర్పడం లేదు. కనీసం ఆటలు ఆడించడం లేదు. సెల్‌లో పిల్లగాడు వీడియో గేమ్స్ ఆడుతుంటే అన్నం పెడుతున్న పరిస్థితి. వాస్తవానికి ఇల్లే విద్యాలయం. ఇంటి వాతావరణం సద్భావన, సదాచారం నేర్పాలి. కానీ, నాలుగేండ్లు నిండకముందే ర్యాంకుల రేసులోకి తోసేస్తున్నారు. దూకుడు స్వభావం, ఉరకలెత్తే ఉత్సా హం ఉండే టీనేజీ పిల్లలను తల్లిదండ్రులెవరూ తమ దగ్గర పెట్టుకొని మంచి, చెడులు నేర్పడం లేదు. వారిని చదువు కార్ఖానాలో తోసేస్తున్నారు. డబ్బులు వెదజల్లుతున్నారు. కార్పొరేట్ విద్యనందిస్తున్నామని గొప్పలు పోతున్నారు. అందరు తల్లిదండ్రులు ఇలాగే ఉన్నారని కాదు, అధిక శాతం ఇదే బాపతి. విద్యాలయాల్లో టీచర్లు కూడా పిల్లలను మనుషులుగా తీర్చిదిద్దడం లేదు. ర్యాంకుల కోసం రన్‌రన్ అంటూ ఉరకలెత్తిస్తున్నారు. అజ్ఞానపు చీకటిని పారదోలి విజ్ఞాన వెలుగు పంచే గురువులు నేడు కనిపించడం లేదు. సమాజమైనా చెడును ఇది చెడు.. ఇది మంచి అని నేర్పుతుందా అంటే అదీ లేదు. ఎవరి గోలా వారిదే..

టీనేజ్ పిల్లలకు సెల్‌ఫోన్లే సర్వస్వమయ్యాయి. ఏ వస్తువైనా మంచికి ఉపయోగిస్తే మేలు చేస్తుంది. కానీ చెడుకు వాడితే.. దాని ఫలితంగా తీవ్ర స్థాయిలో ఉంటుంది. ఒంటరిగా ఉండే టీనేజ్ పిల్లల్లో సెల్‌ఫోన్ చెడు వ్యసనాలను నూరిపోస్తున్నది. హాస్టల్ గోడలు దూకి వెళ్లి ఎంజాయ్ చేయాలని మనస్సు ప్రేరేపిస్తున్నది. ఆ దూకుడు స్వభావాన్ని అడ్డుకొనేది ఆ ప్రహరీలా? రాత్రి పన్నెండుగొట్టంగా బర్త్‌డే పార్టీలు చేసుకోవాలని ఉసిగొల్పుతుంది. ఆపేదెవరు? అడ్డుకొనేదెవరు? స్నేహితుల గుంపుతో కలిసి పార్టీలు. మద్యం మత్తులో విక్షణ కోల్పోయి ఎలా ప్రవర్తిస్తారో తెలియదు. పబ్‌జీ వంటి వీడియోగేమ్‌లు పిల్లల్లో నేర ప్రవృత్తిని ప్రేరేపిస్తాయి. మనిషిలోని సున్నితత్వాన్ని చంపేస్తాయి. అప్పుడు మనిషిలోని మంచి చనిపోయి రాక్షసుడు పుట్టుకొస్తాడు.

'దిశ' ఘటన నేపథ్యంలో కొందరు అమ్మాయిలు కరాటే నేర్చుకోవాలి. చెల్లికి ఫోన్‌చేసే బదులు 100 డయల్‌చేయవలసిందని ఒకరైతే, మహిళల రక్షణకు యాప్ రూపొందిస్తున్నాయి. బేఫికర్ అంటారు మరొకరు. ఇవన్నీ రోగమొచ్చిన తర్వాత చేయాల్సిన చికిత్సలు. చికిత్స కంటే ముందు రోగం రాకుండా నివారించడం ముఖ్యం. ఇంట్లో, బయట ఎలా ఉండాలో పిల్లలకు నేర్పకుండా పై మెరుగులు దిద్దితే ఫలితం ఉండదు. కలుపు మొక్కల కొసలను కత్తిరిస్తే వచ్చే ప్రయోజనం కన్నా కూకటివేళ్లతో పెకిలిస్తే దాని ఫలి తం రెట్టింపుగా ఉంటుంది. మూడు, నాలుగు దశాబ్దాల కిందట పుట్టినవారిలో ఇలాంటి నేరప్రవృత్తి తక్కువగా కనిస్తున్నది. వారంతా తల్లిదండ్రుల చెంతనే పెరుగడంతో పెద్దలంటే భయం, భక్తి ఎంతోకొంత కనిపిస్తున్నాయి. పుస్తకాలు చదివే, నీతి కథలు వినే అలవాటు వారిలో కొంత వినయం, విజ్ఞానం నేర్పాయి. రాత్రి ఎనిమిదైతే ఇంట్లో నుంచి కాలు బయటపెట్టేవారు కాదు. తప్పనిసరై తే తప్ప. అదికూడా తల్లిదండ్రుల తోడుగా. కానీ నేడు ఆ పరిస్థితి ఉన్నదా! అర్ధరాత్రి వేళ చెడు తిరుగుళ్లు. కొన్నివర్గాలవారు నిశాచరులయ్యారు. ఉదయమంతా పడుకొని రాత్రి నిద్రలేస్తారు.పబ్బుల్లో చిందులు. ఇటీవల మీడియాలో నిత్యం కనిపిస్తున్న ప్రధాన నేరవార్తలకు టీనేజర్లే ప్రధాన కారణమవుతున్నారు. ప్రధానంగా యువకులు అదుపుతప్పి తెగిన గాలిపటాల్లా ఎటుపడితే అటుపోతున్నారు. మొక్కై వంగనిది మానై వంగునా.. అంటారు. చిన్నతనం నుంచి పిల్లలకు విచ్చలవిడితనం ఇచ్చి పెద్దయ్యాక వీడు రాక్షసుడిలా మారాడేంటి! అంటే ఫాయిదా ఉండదు. తల్లిదండ్రులు, గురువులు ఆదర్శంగా ఉంటూ పిల్లలకు నీతిని బోధిస్తే వారు ఆచరిస్తారు. కానీ, నేటి తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ఎలా ఉంటున్నారో ఒకసారి ఆత్మవిమర్శ చేసుకోవాలి. టీచర్లు విద్యార్థుల పట్ల నిజమైన గురువుల్లా వ్యవహరిస్తున్నారా లేదా అనేది మననం చేసుకోవాలి. ఎదురుగా ఏదైనా తప్పు జరిగినప్పుడు ప్రశ్నించని జనం (సమాజం), మీడియా ఆ తర్వాత ఎన్ని వ్యాఖ్యానాలు, ఎన్ని వార్తలు రాసినా ఉపయోగం శూన్యం. ప్రతివ్యక్తి సద్భావన, సదాచారంతో మెలిగితేనే సమాజం వర్ధిల్లుతుంది. సత్భావన, సత్ప్రవర్తన లేని వ్యక్తులు న్న సమాజంలో అడుగొక్క పోలీసును పెట్టినా నేరాలను అరికట్టలేం!

**చిన్నతనం నుంచి పిల్లలకు విచ్చలవిడితనం ఇచ్చి పెద్దయ్యాక వీడు రాక్షసుడిలా మారాడేంటి! అంటే ఫాయిదా ఉండదు. తల్లిదండ్రులు, గురువులు ఆదర్శంగా ఉంటూ పిల్లలకు నీతిని బోధిస్తే వారు ఆచరిస్తారు. కానీ, నేటి తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ఎలా ఉంటున్నారో ఒకసారి ఆత్మవిమర్శ చేసుకోవాలి. టీచర్లు విద్యార్థుల పట్ల నిజమైన గురువుల్లా వ్యవహరిస్తున్నారా లేదా అనేది మననం చేసుకోవాలి. ఎదురుగా ఏదైనా తప్పు జరిగినప్పుడు ప్రశ్నించని జనం (సమాజం), మీడియా ఆ తర్వాత ఎన్ని వ్యాఖ్యానాలు, ఎన్ని వార్తలు రాసినా ఉపయోగం శూన్యం.**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

## మత్స్యకారులకు దొరికిన రాకెట్ ఇంధన ట్యాంక్

స్వాధీనం చేసుకున్న ఇస్రో



**పుదుచ్చేరి, డిసెంబర్ 3:** భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఉప గ్రహ ప్రయోగానికి వినియోగించే పీఎస్ఎల్వీ రాకెట్ లాంచర్‌లో వాడిన ఇంధన ట్యాంక్ ఒకటి పుదుచ్చేరిలో లభ్యమైంది. సోమవారం సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు తమ వలకు చిక్కిన దీన్ని తీరానికి తీసుకొచ్చారు. ఈ విషయమై ఇస్రో అధికారులకు పుదుచ్చేరి ప్రభుత్వం సమాచారం ఇచ్చింది. దీంతో మంగళవారం పుదుచ్చేరికి చేరుకున్న శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రానికి చెందిన నలుగురు నిపుణుల బృందం ఆ ట్యాంక్‌ను తనిఖీ చేసిన తర్వాత దీన్ని స్పేస్ సెంటర్ గోదాంకు తరలించిందని పుదుచ్చేరి ప్రభుత్వ రెవెన్యూ విపత్తు యాజమాన్య విభాగం సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

## పౌష్టికాహార గీతాన్ని ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి

**న్యూఢిల్లీ:** ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు మంగళవారం 'భారతీయ పౌష్టికాహార గీతాన్ని' ఆవిష్కరించారు. 2022 నాటికి భారత్‌ను పౌష్టికాహార లోప రహిత దేశంగా తీర్చిదిద్దాలన్న లక్ష్య సాధనలో భాగంగా ఈ గీతాన్ని రూపొందించారు. గేయ రచయిత ప్రసూన్ జోషి రాసిన ఈ గీతాన్ని శంకర్ మహదేవన్ ఆలపించారు. 'మన పిల్లలకు ఉత్తమ బాల్యాన్ని అందుబాటులోకి తేవడం మన బాధ్యత' అని ఉపరాష్ట్రపతి ఈ సందర్భంగా చెప్పారు.



## నిత్యానంద.. 'సొంత రాజ్యం'!

- ఈక్వెడార్ సమీపంలో దీవ్పం కొనుగోలు
- కైలాస అని నామకరణం

**బెంగళూరు:** తనపై నమోదైన లైంగికదాడి కేసును తప్పించుకొనేందుకు పాస్‌పోర్టు లేకుండా దేశం వదిలి పారిపోయిన నిత్యానంద సెంట్రల్ అమెరికాలో ఈక్వెడార్‌కు సమీపంలో ఒక రాజ్యాన్ని స్థాపించినట్టు ప్రకటించాడు. దాని పేరు కైలాస అని, తమకు ప్రత్యేక పాస్‌పోర్టు ఉందని తెలిపాడు. కొత్త దేశం పేరిట వెబ్‌సైట్ కూడా ప్రారంభించిన నిత్యానంద తమది ఈ ప్రపంచంలోనే గొప్ప హిందూ దేశం అని చెప్పుకున్నాడు. ఈక్వెడార్‌కు సమీపంలోని ఒక దీవిని కొనుగోలు చేసిన నిత్యానంద, దానిని నూతన స్వతంత్ర దేశంగా చెప్పుకుంటున్నాడు. తనదేశంలో పౌరసత్వం పొందాలని ఆహ్వానం పలుకుతున్న నిత్యానంద అదే సమయంలో పరిపాలన సాగించేందుకు విరాళాలు కూడా ఇవ్వాలని కోరుతున్నాడు. 2000 సంవత్సరంలో బెంగళూరు సమీపంలో ఒక ఆశ్రమాన్ని నెలకొల్పిన నిత్యానంద అసలుపేరు రాజశేఖరన్. తమిళనాడుకు చెందిన నిత్యానంద.. 2010లో ఓ సినీ నటితో శృంగార కార్యకలాపాలు సాగిస్తున్న వీడియో బయటకు రావడంతో వార్తల్లోకెక్కాడు. ఆ ఘటనకు సంబంధించి లైంగికదాడి కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని అప్పట్లో అరెస్టు చేశారు. అహ్మదాబాద్‌లోని మరో ఆశ్రమంలో బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని ఆరోపణలు రావడంతోపాటు, అతనిపై మరో సెక్స్ కుంభకోణం కూడా గత నెలలో బట్టబయలైంది. దీంతో అతడు దేశం వదిలి పారిపోయినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.



# 'ఒక దేశం ఒకే రేషన్ కార్డు'

జూన్ ఒకటి నుంచి దేశవ్యాప్తంగా అమలు

కేంద్రమంత్రి రామ్‌విలాస్ పాశ్వాన్ వెల్లడి

**న్యూఢిల్లీ:** రేషన్ కార్డు ఉన్న పేదలు దేశంలోని ఏ ప్రాంతంలోని రేషన్ దుకాణానికైనా వెళ్లి అక్కడ లభించే సరుకులను కొనుగోలు చేసే పరిస్థితి త్వరలో సాకారం కానుంది. ఈ సదుపాయం వచ్చే ఏడాది జూన్ 1 నుంచి అమల్లోకి వస్తుందని ప్రభుత్వం మంగళవారం లోక్‌సభకు తెలిపింది. ఈ పథకం వల్ల వలస కార్మికులు, దినసరి కూలీలు లబ్ధి పొందుతారని వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌర సరఫరా శాఖల మంత్రి రామ్‌విలాస్ పాశ్వాన్ చెప్పారు. జాతీయ ఆహార భద్రత చట్టం కింద లబ్ధిదారులు దేశంలోని ఏ రేషన్ దుకాణానికైనా వెళ్లి తమకు నిర్దేశించిన ఆహార ధాన్యాలను కొనుగోలు చేయవచ్చన్నారు. అయితే సదరు రేషన్ దుకాణంలోని 'ఈపోస్ (ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్)లో వేలిముద్రలు/ఆధార్ కార్డును ధ్రువీకరించుకోవడం ద్వారా మాత్రమే ఈ సదుపాయం పొందవచ్చని స్పష్టం చేశారు.



### అన్ని సదుపాయాలకు ఒకే కార్డు ఆలోచన లేదు

దేశ పౌరులకు అన్ని సదుపాయాలు పొందేందుకు వీలుగా ఒకే కార్డును జారీచేసే ఆలోచనేదీ లేదని ప్రభుత్వం తెలిపింది. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్ర సహాయ మంత్రి నిత్యానంద రాయ్ మాట్లాడుతూ, వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి జాతీయ జనాభా రిజిస్టర్‌ను సిద్ధంచేసి, తాజాపరచాలని తమ ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు.

### నాలుగు వైద్య పరికరాల ధరల స్థిరీకరణ

నాలుగు వైద్య పరికరాల ధరలను స్థిరీకరించినట్టు ప్రభుత్వం తెలిపింది. కార్డియాక్ స్టెంట్స్, డ్రగ్ ఎల్యూటింగ్ స్టెంట్స్, కాండోమ్స్, ఇంట్రా యూటెరిన్‌లను అత్యవసర ఔషధాల జాబితాలో చేర్చి వాటి ధరలను స్థిరీకరించామని తెలిపింది. ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌ను 'నిర్బల' అంటూ కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ సభ్యురాలు పూనమ్ మహాజన్ మండిపడ్డారు. మరోవైపు, కేంద్రపాలిత ప్రాంతమైన జమ్ముకశ్మీర్ పరిధిలోకి పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రదేశాలు కూడా వస్తాయని హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. కాగా, ఎస్పీజీ సవరణ చట్టానికి రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లును లోక్‌సభ ఇదివరకే ఆమోదించింది. బిల్లుపై జరిగిన చర్చకు హోం మంత్రి అమిత్‌షా ఇచ్చిన సమాధానంపై నిరసన వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ సభ్యులు వాకౌట్ చేశారు. సముద్ర నీటి మట్టం పెరుగడం వల్ల ముంబై నగరం మునిగిపోయే ప్రమాదమేమీ లేదని ప్రభుత్వం తెలిపింది. ఎంపీలు భారత శాస్త్రవేత్తలపై నమ్మకముంచాలని కోరింది.



### మీడియా సిబ్బందికి సామాజిక భద్రత కల్పించాలి: సుప్రియా సూలె

మీడియా సిబ్బందికి సామాజిక భద్రత కల్పించాలని ఎన్సీపీ సభ్యురాలు సుప్రియా సూలె కోరారు. లోక్‌సభ జీరో అవర్‌లో ఆమె ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ, 'బ్రేకింగ్ న్యూస్' సమయంలో సిబ్బంది ప్రతికూల పరిస్థితుల్లో ఎక్కువ గంటలు పనిచేయాల్సి వస్తుందని చెప్పారు. ఇటీవల మహారాష్ట్రలో చోటుచేసుకున్న రాజకీయ సంక్షోభం సందర్భంగా కెమెరామెన్లు రాజకీయ నాయకుల వాహనాలను అనుసరిస్తూ ద్విచక్రవాహనాల్లో వెనుక కూర్చొని ప్రయాణించారని, అది ఎంతో ప్రమాదకరమని తెలిపారు.

# 'విక్రమ్' జాడ దొరికింది

- చంద్రుడిపై ల్యాండర్ కూలిన ప్రదేశాన్ని గుర్తించిన నాసా
- నాసాకు ఆధారాలు అందజేసిన భారతీయ ఇంజినీర్ షణ్ముగ సుబ్రమణియన్
- లక్షిత ప్రదేశానికి 2,500 అడుగుల దూరంలో ల్యాండర్ కూలినట్టు నిర్ధారణ

**వాషింగ్టన్, డిసెంబర్ 3:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-2 ప్రయోగంలో భాగంగా చంద్రుడిపై దిగిన 'విక్రమ్'ల్యాండర్ ఆచూకీ ఎట్టకేలకు దొరికింది. చంద్రుడి ఉపరితలంపై పడి జాడ దొరుకకుండా పోయిన 'విక్రమ్'ను అమెరికా అంతరిక్ష సంస్థ 'నాసా' కనుగొంది. భారత్‌కు చెందిన షణ్ముగ సుబ్రమణియన్ అనే ఇంజినీర్ ఇచ్చిన ఆధారాల సాయంతోనే చంద్రుడి ఉపరితలంపై పడిన విక్రమ్ శకలాలను గుర్తించగలిగామని నాసా మంగళవారం తెలిపింది. చంద్రయాన్-2 ప్రయోగంలో భాగంగా ఇస్రో గత సెప్టెంబర్ 7న చంద్రుని దక్షిణ ధ్రువంపై విక్రమ్‌ను సురక్షితంగా దించేందుకు ప్రయత్నించిన సంగతి తెలిసిందే. అయితే చివరి క్షణంలో విక్రమ్‌తో కమ్యూనికేషన్ దెబ్బతినడంతో అది ఏమైందో తెలియకుండా పోయింది. చంద్రుడి చుట్టూ పరిభ్రమించే నాసాకు చెందిన లూనార్ రీకనైసెన్స్ ఆర్బిటర్ (ఎల్ఆర్వో) తీసిన చిత్రాల్లో.. విక్రమ్ శకలాల వల్ల చంద్రుడి ఉపరితలంపై ప్రభావితమైన ప్రదేశాలు కనిపించాయి. విక్రమ్ శకలాలు కొన్ని కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న పలు ప్రదేశాల్లో పడినట్లు నాసా తెలిపింది.

### తొలి శకలాన్ని గుర్తించిన భారత ఇంజినీర్

నిజానికి విక్రమ్ సాఫ్ట్ ల్యాండింగ్ కోసం ముందుగా నిర్ధారించిన ప్రాంతాన్ని ఎల్ఆర్వో సెప్టెంబర్ 17నే ఫొటోలు తీసింది. అయితే ఆ సమయంలో చంద్రుడిపై అంతా చీకటిగా ఉండడంతో ల్యాండర్‌ను కచ్చితంగా గుర్తించలేకపోయారు. ఆ చిత్రాలను సెప్టెంబర్ 26న విడుదల చేసిన నాసా.. విక్రమ్ ల్యాండర్ పడడానికి ముందు జూలై 16న ఎల్ఆర్వో తీసిన చిత్రాలను, పడిన తరువాత తీసిన చిత్రాలను పోల్చి చూసి, ల్యాండర్ గుర్తులు ఎక్కడైనా ఉన్నాయేమో కనుగొనాలని ప్రజలను ఆహ్వానించింది. ఈ ఆహ్వానాన్ని సవాలుగా స్వీకరించిన షణ్ముగ సుబ్రమణియన్ (33) కొన్ని రోజులపాటు శ్రమించి ఆ రెండు చిత్రాల్లో ఉన్న తేడాను గమనించారు. విక్రమ్ కూలిన ప్రదేశానికి వాయవ్య దిశలో 750 మీటర్ల దూరంలో తొలి శకలాన్ని షణ్ముగ గుర్తించారని నాసా పేర్కొంది. దీని ఆధారంగా ఎల్ఆర్వో ప్రాజెక్టు బృందం మరింత పరిశోధన చేసి ఇతర శకలాలను కూడా గుర్తించారని తెలిపింది. విక్రమ్ ల్యాండర్ దిగడానికి నిర్దేశించిన ప్రదేశానికి ఆగ్నేయంగా 2,500 అడుగుల దూరంలో అది కూలిపోయినట్టు, దాని శకలాలు చాలా దూరం వరకు పడినట్టు తమ నిపుణులు గుర్తించారని నాసా పేర్కొంది. నవంబర్‌లో ఎల్ఆర్వో తీసిన చిత్రాల్లో.. విక్రమ్ కూలడం వల్ల ఏర్పడిన బిలం, దాని చుట్టూ శిథిలాల క్షేత్రం స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపింది. సుబ్రమణియన్ తాను కనుగొన్న ఫలితాలను అక్టోబర్ 3న నాసా, ఎల్ఆర్వో, ఇస్రో ట్విట్టర్ ఖాతాలకు ట్యాగ్ చేస్తూ, 'విక్రమ్ ల్యాండర్ ఇదేనా? (ల్యాండింగ్ ప్రదేశానికి కిలోమీటర్ దూరంలో ఉన్నది), చంద్రుని ఉపరితలంపై ఉన్న ఇసుకలో ల్యాండర్ కప్పుకొని పోయి ఉండవచ్చా?' అని ప్రశ్నిస్తూ ట్విట్టర్‌లో పోస్ట్ చేశాడు. ఆ తరువాత తిరిగి నవంబర్ 17న నాసా చిత్రాల్లోని ఒక ప్రదేశాన్ని గుర్తించి 'విక్రమ్ ల్యాండర్ కూలిన ప్రదేశం ఇదే కావచ్చు (లాటిట్యూడ్ 70.8552, లాంగిట్యూడ్ 21.71233). దాని నుంచి విరిగిపడిన శకలాలు ఇక్కడ పడి ఉండొచ్చంటూ ట్వీట్ చేశారు. తన ట్వీట్‌కు నాసా జూలై 16, తిరిగి సెప్టెంబర్ 17న తీసిన చిత్రాలను జత చేశారు. సుబ్రమణియన్ అధ్యయన ఫలితాలను సవాలుగా తీసుకున్న నాసా అక్టోబర్ 14, 15, నవంబర్ 11న ఎల్ఆర్వో ద్వారా మరికొన్ని చిత్రాలను సేకరించింది. ఈసారి వెలుతురు ఉండడంతో షణ్ముగ గుర్తించిన ప్రదేశంతోపాటు మరో 24 చోట్ల మార్పులు ఉన్నట్లు గుర్తించింది.




చంద్రుడి దక్షిణ ధ్రువంపై విక్రమ్ కూలిపోయిన ప్రాంతం

### ఆయన పనితీరు అద్భుతం: నాసా

'సుబ్రమణియన్ అధ్యయనం చేసిన విధానం అద్భుతం. అది మాకు ఎంతో సహాయపడింది' అని నాసాకు చెందిన నోవా పెట్రో పేర్కొన్నారు. 'ఆయన ఎల్ఆర్వోలో గానీ, అటు చంద్రయాన్-2 బృందంలో గానీ సభ్యుడు కాదు. స్వతంత్రంగా అధ్యయనం చేశారు. మేమందించిన డేటాను ఉపయోగించి విక్రమ్ పడిన ప్రదేశాన్ని గుర్తించాడు. ఆ జాడను ముందుగా మేము కనుగొనలేకపోయాం. విక్రమ్‌ను కనుగొన్న ఘనత సుబ్రమణియన్‌దే' అని నోవా పెట్రో ప్రశంసించారు. మదురై నివాసి అయిన సుబ్రమణియన్ తిరునల్వేలిలోని ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ నుంచి పట్టభద్రులయ్యారు. తన పరిశోధన ఇతర ఔత్సాహికులకు ప్రేరణనిస్తుందని ఆయన పేర్కొన్నారు.



### నాసా వైఫల్యాన్ని సవాలుగా స్వీకరించా

షణ్ముగ సుబ్రమణియన్



విక్రమ్ జాడను కనుగొన్న చెన్నైకి చెందిన షణ్ముగ సుబ్రమణియన్ ఒక సాధారణ ఐటీ నిపుణుడు. టెక్నికల్ ఆర్కిటెక్ట్‌గా పనిచేస్తున్న సుబ్రమణియన్‌కు అంతరిక్ష పరిశధనలపై కూడా ఆసక్తి ఉంది. అయితే ఆయనకు ఇటు ఇస్రోతోగానీ, అటు నాసాతోగానీ సంబంధాలు లేవు. విక్రమ్ జాడను కనుక్కోవడంలో నాసా కూడా వైఫల్యం చెందడాన్ని ఆయన సవాలుగా స్వీకరించారు. ఆ ఆసక్తితోనే అధ్యయనం చేయడం ప్రారంభించారు. తన పరిశోధన గురించి విక్రమ్ ఇలా వివరించారు.. 'విక్రమ్ ల్యాండర్ పడక ముందు, పడిన తరువాత నాసాకు చెందిన ఎల్ఆర్వో తీసిన చిత్రాలను రెండు ల్యాప్‌టాప్‌లలో పక్క పక్కనే పెట్టి క్షుణ్ణంగా పరిశీలించాను. నాసా చిత్రాలను పిక్సెల్ టు పిక్సెల్ అధ్యయనం చేశాను. ఇస్రోతో ల్యాండర్ సంబంధాలు కోల్పోయినప్పుడు ఉన్న వేగం, ఎత్తు ఆధారంగా కొన్ని లెక్కలు వేసి, అది దిగాల్సిన ప్రాంతం, ఆ పరిసరాలను పరిశీలించాను. చెన్నైలోని నా అపార్ట్‌మెంట్‌లో రాత్రంతా కనీసం ఏడు గంటలు శ్రమించాను. నా పరిశోధన ఫలితాలను నాసా, ఇస్రోకు ట్వీట్ చేశాను. ఒకరిద్దరు నాసా శాస్త్రవేత్తలకు ఈమెయిల్ కూడా పంపాను. నా పరిశోధన పట్ల వారు సానుకూలంగా స్పందించారు. నా అధ్యయనాన్ని విక్రమ్ దిగాల్సిన లక్షిత ప్రదేశానికి 2 కిలోమీటర్ల పరిధికి పరిమితం చేశాను. చివరికి లక్షిత ప్రదేశానికి 750 మీటర్ల నుంచి కిలోమీటరు దూరం పరిధిలో కొన్ని మార్పులను గమనించాను. అదే విక్రమ్ జాడ అని భావించాను. ఈ ఆధారాలను నాసాకు పంపాను' అని వివరించారు.



లైంగికదాడులకు నిరసనగా జంతర్‌మంతర్ వద్ద ఢిల్లీ మహిళా కమిషన్ అధ్యక్షురాలు స్వాతి మలివాల్ నిరాహార దీక్ష

## రేపిస్టులకు తక్షణమే శిక్షలు విధించాలి

నిరవధిక నిరాహారదీక్ష చేపట్టిన స్వాతి మలివాల్

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా మహిళలపై లైంగిక దాడులకు నిరసనగా ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్ మంగళవారం ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో నిరవధిక నిరాహారదీక్షకు దిగారు. దోషులకు కఠిన శిక్షలు విధించి, సత్వరమే వాటిని అమలు చేయాలని డిమాండ్‌చేశారు. వందల మంది మహిళలు ఆమెతో కలిసి గొంతుకలిపారు. నేరం నిరూపితమైన ఆరు నెలల్లో దోషులకు శిక్షను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ప్రధాని మోదీకి లేఖ రాసినట్లు మలివాల్ తెలిపారు. 'రేపిస్టులకు కఠిన శిక్షలు విధించాలని ప్రధానిని డిమాండ్ చేస్తున్నా. దిశ ఘటనలో దోషులను ఉరితీయాలి. గతేడాది నేను నిరహార దీక్ష చేసినప్పుడు, మైనర్లపై దాడికి పాల్పడేవారికి ఆరునెలల్లో కఠిన శిక్ష విధించేలా పదిరోజుల్లోనే ప్రభుత్వం చట్టం చేసింది. కానీ అది అమలుకాలేదు. చట్టాన్ని అమలుచేయాలని ప్రధానిని కోరుతున్నా' అని అన్నారు. 'మేం మీ వెంటే ఉన్నామని ప్రధాని భరోసా ఇవ్వాలి. మేం ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు' అని ఆమె పేర్కొన్నారు.

# అదే ఆక్రోశం

- 'దిశ' హత్యోదంతంపై దేశవ్యాప్తంగా కొనసాగుతున్న నిరసనలు
- దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

**న్యూఢిల్లీ/కోల్‌కతా:** హైదరాబాద్ శివారులో గత నెల 27న చోటుచేసుకున్న 'దిశ' దారుణ హత్యోదంతంపై ఆగ్రహ జ్వాలలు పెల్లుబుకుతూనే ఉన్నాయి. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారమూ నిరసనలు కొనసాగాయి. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో మహిళలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆందోళన చేపట్టారు. దిశ ఘటనపై ఒక వైపు దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతుండగా, మరోవైపు మహిళలపై అఘాయిత్యాలు మాత్రం ఆగడం లేదు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో మంగళవారం కూడా లైంగికదాడి ఘటనలు చోటుచేసుకున్నాయి.

### 15 లక్షల మంది సంతకాలు

దిశకు న్యాయం చేయాలని కోరుతూ చేంజ్.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో వివిధ పిటిషన్లపై గత నాలుగు రోజుల్లో 15 లక్షల మందికిపైగా సంతకాలు చేశారు. నవంబర్ 29న దాఖలైన పిటిషన్‌కు 24 గంటల్లోనే మూడు లక్షల మంది మద్దతు తెలిపినట్లు చేంజ్.ఓఆర్‌జీ తెలిపింది. నాలుగు రోజుల్లో 500 మంది పిటిషన్లు ప్రారంభించారని వివరించింది. ముంబైకి చెందిన పశు వైద్యురాలు శంతను ప్రారంభించిన పిటిషన్‌పై అత్యధికంగా 8 లక్షల మందికిపైగా సంతకాలు చేశారని పేర్కొంది.



దిశపై లైంగికదాడికి వ్యతిరేకంగా ఢిల్లీలో ఎయిమ్స్ వైద్యుల కొవ్వొత్తుల ర్యాలీ



అసోంలోని గువాహటిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

### శాశ్వతంగా జైల్లో పెట్టాలి: హేమా మాలిని

దిశ ఘటనపై బీజేపీ ఎంపీ హేమామాలిని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేపిస్టులను శాశ్వతంగా జైల్లోనే ఉంచాలన్నారు. 'మహిళలపై జరుగుతున్న అకృత్యాల గురించి రోజూ వింటూనే ఉన్నాం. దోషులను శాశ్వతంగా జైల్లో ఉంచాలన్నది నా అభిప్రాయం. ఒకసారి జైల్లో వేశాక, వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విడుదల చేయకూడదు' అని వ్యాఖ్యానించారు.

### క్షమాభిక్షకు ఆస్కారమివ్వకూడదు: హర్‌సిమ్రత్

దిశ ఘటనపై కేంద్ర మంత్రి హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ నిరసన వ్యక్తంచేశారు. దోషికి ఒకసారి మరణశిక్ష విధించాక, క్షమాభిక్ష పిటిషన్ వేసేందుకు అవకాశం ఇవ్వకూడదన్నారు. త్వరితగతిన విచారణ పూర్తిచేసి, కఠిన శిక్షలు అమలు చేయాలని డిమాండ్‌చేశారు. 'లైంగిక దాడి కేసుల్లో బాధితురాలి వయసు ఎంతుందో అన్ని రోజుల్లోగా తీర్పును ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా. ఒకవేళ బాధితురాలి వయసు 20 ఏండ్లు ఉంటే, 20 రోజుల్లోగా విచారణ ముగించాలి' అని కోరారు.

### దోషులను ఉరితీస్తే.. లైంగికదాడులు తగ్గుతాయా?: అపర్ణాసేన్

దిశ హత్యాచార దోషులను ఉరితీయాలంటూ దేశవ్యాప్తంగా డిమాండ్లు వినిపిస్తున్న నేపథ్యంలో ప్రముఖ దర్శకురాలు అపర్ణాసేన్ స్పందిస్తూ.. దోషులను ఉరితీస్తే అలాంటి నేరాలు తగ్గుతాయా అంటూ ప్రశ్నించారు. 'దిశపై లైంగికదాడి, హత్యకు పాల్పడిన దోషలకు బహుశా ఉరిశిక్ష పడొచ్చు. ఇది అత్యంత భయానకమైన నేరం. అయితే తర్వాత ఏంటి? ఇకపై లైంగిక దాడులు జరుగవా?' అని ఆమె ట్వీట్ చేశారు.

### ఉరి సరే!.. తలారి ఎక్కడ?

నిర్భయ కేసులో నేరస్థులకు త్వరలో ఉరిశిక్ష అమలు!

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నిర్భయ కేసులో నలుగురు నేరస్థులకు ఉరిశిక్ష విధించే సమయం ఆసన్నమైంది. కోర్టు నుంచి 'బ్లాక్ వారంట్' జారీ అయిన తర్వాత ఏదో ఒకరోజు ఉరిశిక్షను అమలుచేసేందుకు వీలుగా ఢిల్లీలోని తీహార్ జైలు అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. నిందితుల్లో ఒకడైన వినయ్‌శర్మ పెట్టుకొన్న క్షమాభిక్ష పిటిషన్ ప్రస్తుతం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పరిశీలనలో ఉన్నది. మిగతావారు పెట్టుకొన్న క్షమాభిక్ష పిటిషన్లు ఏవీ ఆమోదానికి నోచుకోలేదు. రాష్ట్రపతి క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరించిన వెంటనే ఉరిశిక్ష అమలుచేసేందుకు కోర్టు 'బ్లాక్ వారంట్' జారీ చేస్తుంది. మరో నెల రోజుల్లో మరణశిక్షను అమలుచేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఉరి తీసే తలారీ.. తీహార్ జైలులో లేకపోవడంతో అధికారులు దానిపై దృష్టి పెట్టారు. ఏ క్షణంలోనైనా 'బ్లాక్ వారంట్' జారీ అవకాశాలు ఉన్నందున తలారీని తాత్కాలిక పద్ధతిలో నియమించడం లేదా ఇతర జైళ్ల నుంచి రప్పించడం గురించి యోచిస్తున్నారు. 2012 డిసెంబర్ 16వ తేదీన ఢిల్లీలోని వసంత్‌విహార్ ప్రాంతంలో కదులుతున్న బస్సులో పారామెడికల్ విద్యార్థిని నిర్భయపై ఆరుగురు సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన నిర్భయ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

# ఆగని కీచకపర్వం

- ఉత్తర్‌ప్రదేశ్‌లో తల్లీకూతుళ్లపై లైంగికదాడి
- బీహార్‌లో బాలికపై అఘాయిత్యం.. తుపాకితో కాల్చివేత
- ఒడిశాలో పోలీస్ క్వార్టర్స్‌లోనే మహిళపై సామూహిక లైంగికదాడి

**ఆజంగఢ్:** 'దిశ' హత్యోదంతంపై దేశవ్యాప్తంగా ఓవైపు తీవ్ర ఆగ్రహజ్వాలలు వ్యక్తమవుతున్నా, మరోవైపు మహిళలపై అకృత్యాలు మాత్రం ఆగడం లేదు. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఒక కీచకుడు ఒక వ్యక్తిని హతమార్చి, అతడి భార్య, కూతురిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మరోవైపు, బీహార్‌లో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఒక బాలికపై లైంగికదాడికి పాల్పడి చంపేశారు. అనంతరం నిప్పంటించి తగులబెట్టారు.

### తల్లి, కూతురిపై దారుణం

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆజాంగఢ్‌లో గతవారం దంపతులను, వారి కుమారుడిని హత్యచేయడంతోపాటు, మరో ఇద్దరు పిల్లలను తీవ్రంగా గాయపరిచిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మహిళ, కూతురు అపస్మారక స్థితిలోకి చేరుకున్న తర్వాత వారిపై అతడు లైంగికదాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. గత నెల 24న ఈ దారుణం జరిగింది.

### బాలికపై లైంగికదాడి.. హత్య

దిశ ఘటన తరహాలోనే బీహార్‌లో మరో దారుణం జరిగింది. బక్సర్ జిల్లాలోని కుకుంద గ్రామంలో బాలికపై లైంగికదాడికి పాల్పడిన దుండగులు అనంతరం ఆమెను తుపాకీతో కాల్చి చంపి, మృతదేహాన్ని తగులబెట్టారు. హత్యకు ముందు ఆమెపై లైంగికదాడికి పాల్పడినట్లు భావిస్తున్నామని, సోమవారం రాత్రి ఈ ఘటన జరిగి ఉండొచ్చని పోలీసులు తెలిపారు. బాధితురాలు ఎవరన్నది ఇంకా గుర్తించాల్సి ఉందన్నారు.

### మహిళపై అఘాయిత్యం

ఒడిశాలోని పూరిలో సోమవారం దారుణం చోటుచేసుకుంది. కానిస్టేబుల్, అతడి సహచరుడు పోలీస్ క్వార్టర్‌లోనే ఒక మహిళపై లైంగికదాడికి పాల్పడ్డారు. కానిస్టేబుల్‌ను పోలీసులు అరెస్ట్‌చేశారు. ఇంకో నిందితుడి కోసం గాలిస్తున్నారు.



### పెండ్లి పేరుతో మైనర్‌పై..

**మంద్‌సౌర్:** పెండ్లి పేరుతో వంచించి మైనర్‌పై ఓ యువకుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. మధ్యప్రదేశ్‌లోని మంద్‌సౌర్‌కు చెందిన సోనూ కుమావత్ తనకు పరిచయమున్న యువతిని ఇటీవల హోటల్ గదికి తీసుకెళ్లాడు. మెడలో పూలదండ వేసి, నుదుట బొట్టు పెట్టి పెండ్లి అయినపోందని చెప్పి ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. యువతి ఫిర్యాదుతో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

### తొమ్మిదేండ్ల బాలికపై హత్యాచారం

**బెంగళూరు:** ఓ కామాంధుడు తొమ్మిదేండ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం గొంతు నులిమి హత్య చేశాడు. ఈ ఘటన కర్ణాటకలోని కలబురగి జిల్లాలో సోమవారం చోటుచేసుకుంది. తినేందుకు ఏమైనా ఇస్తానని ఆశచూపిన నిందితుడు బాలికను నిర్మానుష ప్రదేశానికి తీసుకెళ్లి లైంగికదాడి చేసి, హత్య చేశాడని పోలీసులు తెలిపారు. నిందితుడు యల్లప్ప మహదేవప్పను అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

### రాజస్థాన్‌లో విద్యార్థినిపై..

**కోటా:** రాజస్థాన్‌లో ఓ బాలికపై లైంగికదాడి జరిగింది. తరుచుగా ఇంటికొచ్చే ఓ బంధువు 11వ తరగతి చదువుతున్న బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక ఈ విషయాన్ని ఓ టీచర్‌కు చెప్పింది. టీచర్ సూచనతో తన నానమ్మతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో నిందితుడిని అరెస్ట్ చేశారు.

### పగ పెంచుకొని..

**భోపాల్:** లైంగిక దాడికి యత్నించినందుకు తనను జైలుకు పంపిన యువతిపై పగ పెంచుకుని దారుణంగా హత్య చేశాడు ఓ దుండగుడు. ఆ యువతిని కత్తితో 30సార్లు పొడిచి హత్య చేశాడు. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ జిల్లాలో జరిగింది.

# త్వరలో నూతన విద్యా విధానం

కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ వెల్లడి

స్వచ్ఛ క్యాంపస్ ర్యాంకింగ్-2019 అవార్డులు ప్రదానం

**న్యూఢిల్లీ:** నూతన జాతీయ విద్యావిధానాన్ని త్వరలోనే ప్రజల ముందుంచుతామని, దేశ ప్రతిష్ఠను ఇది ప్రపంచవ్యాప్తంగా ఇనుమడింపజేస్తుందని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ (హెచ్చార్డీ) తెలిపింది. ఏఐసీటీఈలో మంగళవారం జరిగిన 'స్వచ్ఛ క్యాంపస్ ర్యాంకింగ్-2019' అవార్డుల ప్రదానోత్సవాన్ని ఉద్దేశించి హెచ్చార్డీ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ నిశాంక్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రోజూ ఒక లీటర్ నీరు ఆదాకు విద్యార్థులంతా ప్రతినబూనాలని, తమ స్నేహితులు, కుటుంబసభ్యులనూ ప్రోత్సహించాలన్నారు. హెచ్చార్డీ కార్యదర్శి ఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానాన్ని త్వరలోనే ప్రజలకు అందుబాటులో ఉంచుతామని, దేశ విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెస్తుందన్నారు. స్వచ్ఛత పోటీల్లో వివిధ క్యాటగిరీల్లో 52 విద్యాసంస్థలకు అవార్డులు దక్కాయి. గుంటూరులోని కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్, రాజస్థాన్‌లోని ఐఐహెచ్ఎంఆర్ యూనివర్సిటీ, చెన్నైలోని ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, లక్నోలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం టెక్నికల్ యూనివర్సిటీ స్వచ్ఛ క్యాంపస్ అవార్డును గెలుచుకున్నాయి. కాలేజీ క్యాటగిరీలో శ్రీకృష్ణ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ (తిరువనంతపురం), ప్రిన్స్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ శిక్షన్, ప్రశిక్షన్ మహావిద్యాలయ (సికర్), పణిమలర్ ఇంజనీరింగ్ కాలేజ్ (తిరువళ్లూర్), మహాత్మాగాంధీ మిషన్ మెడికల్ కాలేజ్ (నవీ ముంబై) అవార్డులు దక్కించుకున్నాయి.

# చైనా నౌకను తరిమికొట్టాం!

- భారత సముద్ర జలాల్లోకి అక్రమంగా ప్రవేశించిన పొరుగుదేశపు నౌక
- గూఢచర్యానికి వచ్చినట్టు అనుమానాలు
- నౌకాదళం హెచ్చరికతో తోకముడిచిన చైనా నౌక



**న్యూఢిల్లీ:** భారత సముద్ర జలాల్లోకి అక్రమంగా ప్రవేశించిన చైనా నౌకను మన నౌకాదళం తరిమికొట్టింది. ఈ సంగతి నౌకా దళాధిపతి అడ్మిరల్ కరంబీర్ సింగ్ మంగళవారం తెలిపారు. అండమాన్ నికోబార్ దీవులలో ఈ ఘటన గత సెప్టెంబర్‌లో జరిగిందన్నారు కానీ వివరాలు వెల్లడించలేదు. అండమాన్‌కు సమీపాన భారత్ ప్రత్యేక ఆర్థిక జోన్‌లోకి చైనా పరిశోధన నౌక 'షీ యాన్ 1' ప్రవేశించినట్లు సైనిక వర్గాల సమాచారం. ఆ నౌక గూఢచర్యానికి పాల్పడుతున్నదని భారత నౌకాదళం అనుమానించింది. మన నౌకాదళం అనుమతి లేకుండానే అది మన జలాల్లోకి ప్రవేశించిందన్నాయి. తొలుత చైనా నౌకను భారత నౌకా దళ నిఘా విమానం పసిగట్టిందని తెలిపాయి. వెంటనే అక్కడ పరిస్థితి అంచనా వేసేందుకు నౌకాదళం ఒక యుద్ధ నౌకను అక్కడికి పం పిందన్నాయి. భారత్ ప్రత్యేక ఆర్థిక జోన్‌లో విదేశాల నౌకలు పరిశోధన/ అన్వేషణ సాగించడం నిషిద్ధం. అందువల్ల చైనా నౌకను మన జలాల్లోంచి వెళ్లిపోవాలని భారత యుద్ధ నౌక హెచ్చరించింది. దీంతో చైనా నౌక వెళ్లిపోయిందని సైనిక వర్గాలు పేర్కొన్నాయి. అడ్మిరల్ కరంబీర్ ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ, మన సముద్ర జలాల్లో ఎవరైనా, ఏమైనా చేయాలనుకుంటే ముందుగా మనకు తెలియజేసి, మన అనుమతి తీసుకోవాలన్నది మన వైఖరి అని చెప్పారు. హిందూ మహాసముద్రంలో ఏడెనిమిది చైనా నౌకలు ఎప్పుడూ మోహరించి ఉంటాయని తెలిపారు. హిందూ మహాసముద్రంలో పాకిస్థాన్ కుయుక్తులపై కూడా తమకు అవగాహన ఉన్నదని కరంబీర్ చెప్పారు.

## 170 కోట్ల నిధుల స్వీకరణపై వివరణ ఇవ్వండి

కాంగ్రెస్‌కు ఐటీ శాఖ నోటీస్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 3:** హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇంజినీరింగ్ సంస్థ నుంచి రూ.170 కోట్ల నిధులను స్వీకరించడంపై వివరణ ఇవ్వాలంటూ ఆదాయం పన్ను శాఖ (ఐటీ శాఖ) కాంగ్రెస్‌కు నోటీసు జారీచేసింది. రూ.3,300 కోట్ల హవాలా కేసులో పన్ను ఎగవేతకు సంబంధించి తాము జరిపిన దర్యాప్తులో కాంగ్రెస్ పార్టీకి ఈ నిధులు అందినట్లు తేలిందని, దీనిపై వివరణ ఇవ్వాలంటూ కాంగ్రెస్ పార్టీని ఐటీ శాఖ కోరింది.



హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి మహాస్వాములు మంగళవారం శ్రీశైలం చేరుకున్నారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పీఠాధిపతులతో కలిసి ఆలయానికి చేరుకోగా ఏపీ దేవాదాయశాఖ కమిషనర్ పద్మ, ఆలయ ఈవో కేఎస్ రామారావు, వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. - శ్రీశైలం

# అయ్యప్పమాలలో బడికి రావొద్దు!

- విద్యార్థిని అడ్డుకున్న మిషనరీ స్కూల్ కరస్పాండెంట్
- అయ్యప్ప స్వాముల నిరసన




భువనగిరి పట్టణంలో ధర్నా చేస్తున్న అయ్యప్ప స్వాములు

**భువనగిరి అర్బన్:** అయ్యప్పమాల వేసుకున్నాడని ఓ విద్యార్థిని పాఠశాల నుంచి బహిష్కరించిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో మంగళవారం చోటుచేసుకున్నది. శ్రీరాంనగర్‌కు చెందిన ప్రణీత్‌రెడ్డి ఇండియన్ మిషన్ హైస్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్నాడు. ఇటీవల అయ్యప్పమాల ధరించాడు. మంగళవారం పాఠశాలకు వెళ్లగా కరస్పాండెంట్ ఎస్దీ రేవాజూడా మాలవిరమణ చేసేవరకు పాఠశాలకు రావద్దని సూచించాడు. విషయం తెలుసుకున్న విద్యార్థి తండ్రి, అయ్యప్ప మాలధారులు, వీహెచ్‌పీ, బీజేపీ నేతలు పాఠశాలకు వద్దకు చేరుకొని కరస్పాండెంట్‌ను నిలదీశారు. కరస్పాండెంట్ స్పందించకపోవడంతో ప్రధానరహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు మాట్లాడుతూ.. క్రైస్తవ మత ప్రచారణ కొరకే పాఠశాల ఏర్పాటు చేశారని, పాఠశాల గుర్తింపు రద్దుచేయాలని కోరారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని అయ్యప్పస్వాములతో మాట్లాడారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ రేవాజూడా విద్యార్థితో పాటు స్వాములకు క్షమాపణ చెప్పడంతో ధర్నాను విరమించారు.

## లైంగికదాడి నిందితుడికి జీవితఖైదు

**సంగారెడ్డిటౌన్:** 2015లో బాలికపై లైంగికదాడి చేసిన యువకుడికి జీవిత ఖైదుతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి మంగళవారం తీర్పు వెలువరించినట్టు సంగారెడ్డి జిల్లా ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం.. కంగ్టి మండలం గాజులపాడ్‌లో 14 ఏండ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన బైదొడ్డి నాగయ్య(22) 2015 జనవరి 6న లైంగికదాడికి పాల్పడినట్టు అప్పట్లో కంగ్టి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బలమైన సాక్ష్యాలు ఉండటంతో నాగయ్యకు జీవితకాల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.5వేల అపరాధ రుసుము విధిస్తూ మంగళవారం సంగారెడ్డి కోర్టులోని ఫస్ట్‌క్లాస్ అదనపు జిల్లా జడ్జి బీ పాపిరెడ్డి తీర్పునిచ్చినట్టు ఎస్పీ తెలిపారు.



# ఎత్తిపోస్తున్న మోటర్లు

- లక్ష్మి పంప్‌హౌస్ నుంచి సరస్వతి బరాజ్‌కు తరలుతున్న జలాలు
- జూరాల, నారాయణపుర ప్రాజెక్టులకు స్వల్పంగా వరద
- సాగర్‌కు 10,277 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని లక్ష్మి పంప్‌హౌస్‌లో గోదావరి జలాలను ఎత్తిపోస్తున్న మోటర్లు

**నమస్తేతెలంగాణ నెట్‌వర్క్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని లక్ష్మి (కన్నెపల్లి) పంప్‌హౌస్‌లో మంగళవారం ఇంజినీర్లు ఐదు మోటర్లను నడిపించారు. 4, 5, 6, 8, 10వ మోటర్ల ద్వారా సరస్వతి (అన్నారం) బరాజ్‌కు 10,600 క్యూసెక్కుల నీటిని తరలించారు. పంపుల నుంచి ఎత్తిపోసిన గోదావరి జలాలు డెలివరీ సిస్టర్న్ నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా సరస్వతి బరాజ్‌కు తరలుతున్నాయి. సరస్వతి బరాజ్‌లో ప్రస్తుతం 7.58 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.

**జూరాలకు స్వల్ప వరద**

జూరాలకు స్వల్పంగా వరద ప్రవాహం కొనసాగుతున్నది. మంగళవారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో వెయ్యి క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 1,590 క్యూసెక్కులు నమోదైంది. జూరాల ప్రాజెక్ట్ సామర్థ్యం 1,045 అడుగుల ఎత్తులో 9.657 టీఎంసీలకు గాను 1,044.9 అడుగుల ఎత్తులో 9.542 టీఎంసీల నీటిని నిల్వ చేస్తూ, వచ్చిన నీటిని వచ్చినట్టు నదిలోకి విడుదల చేస్తున్నారు. ఎగువనున్న నారాయణపుర ప్రాజెక్ట్‌కు స్వల్పంగా వరద వస్తున్నది. నారాయణపుర ప్రాజెక్ట్ ఇన్‌ఫ్లో 4,188 క్యూసెక్కులుండగా అవుట్ ఫ్లో 1,425 క్యూసెక్కులు నమోదైంది. ఈ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 37.64 టీఎంసీల నీటినిల్వ ఉండగా ప్రాజెక్ట్‌లో 36.22 టీఎంసీల నీటితో పూర్తిగా నిల్వచేసుకొని వచ్చిన నీటిని వచ్చినట్టుగా నదిలోకి విడుదల చేస్తున్నారు. ఆల్మట్టి ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోగా అవుట్‌ఫ్లో 4,890 క్యూసెక్కులు నమోదైంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 129.72 టీఎంసీలుండగా 127.83 టీఎంసీల నీటిని నిల్వచేస్తున్నారు. మంగళవారం తుంగభద్ర జలాశయానికి 2,497 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, 8,988 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో నమోదైంది.

**సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం 583.20 అడుగులు**

శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు 10,277 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. నాగార్జునసాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 590 అడుగులు కాగా మంగళవారం సాయంత్రం వరకు 583.20 అడుగులు(292.2444 టీఎంసీలు)గా ఉన్నది. మొత్తం 10,277 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది.

## పెండ్లింట విషాదం

వాగులో పడి అన్నదమ్ముల దుర్మరణం

**కోయిలకొండ:** చెల్లి పెండ్లికోసం వచ్చి మరో రెండ్రోజుల్లో ఢిల్లీ వెళ్లాల్సిన అన్నదమ్ములు ప్రమాదవశాత్తు వాగులో పడి మృతిచెందారు. మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం కల్యాణ్‌నగర్ తండాకు చెందిన రాందాస్‌నాయక్ కుటుంబం ఢిల్లీ వెళ్లి స్థిరపడింది. అతడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పెద్దకూతురు సుమ పెండ్లి కోసం ఇటీవల కుటుంబసభ్యులు తండాకు వచ్చారు. ఈ నెల 1న కూతురు వివాహం చేశారు. కాగా రాందాస్‌నాయక్‌కు గ్రామంలో కొంత పొలం ఉన్నది. దాన్ని ఇతరులకు కౌలుకు ఇచ్చారు. ఈ క్రమంలో మంగళవారం కుటుంబసభ్యులు తమ పొలంలో పండిన వరి ధాన్యాన్ని పెద్దవాగు బండపై ఆరబెట్టడానికి వెళ్లారు. ప్రవీణ్ (27) సంజయ్ (23) కాళ్లు, చేతులు కడుక్కోవడానికి వాగులోకి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో జారిపడ్డారు. వారిని కాపాడడానికి తల్లి అంజలిబాయి, బంధువులు డక్యానాయక్, ప్రకాశ్‌లు నీటిలో దిగారు. వారు కూడా నీటిలో మునిగిపోతుండగా బుచ్చన్న అనే స్థానికుడు వారిని కాపాడాడు. ప్రవీణ్, సంజయ్ నీటిలో మునిగిపోయారు. స్థానికులు మృతదేహాలను వెలికితీశారు.



సిద్దిపేటలో దివ్యాంగులను సన్మానిస్తున్న మంత్రి హరీశ్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణశర్మ, కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి.

# దిశ ఘటన అత్యంత బాధాకరం

- ఇంట్లో మగపిల్లలపై కన్నేసి ఉంచాలి
- వారి కదలికలు, ప్రవర్తనను పసిగట్టాలి
- మంత్రి తన్నీరు హరీశ్‌రావు

**సిద్దిపేటకలెక్టరేట్, నమస్తేతెలంగాణ:** దిశపై జరిగిన అఘాయిత్యం చాలా బాధను కలిగించిందని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. పాఠశాలస్థాయి నుంచే అమ్మాయిలకు, అబ్బాయిలకు సామాజిక స్పృహ, విలువలతో కూడిన జీవితంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణశర్మ, కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డితో కలిసి సిద్దిపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాలలో సత్యసాయిట్రస్టు సహకారంతో అల్పాహారం పంపిణీ కార్యక్రమం, వొడాఫోన్ వారి సహకారంతో విద్యార్థులకు ఎనిమియా స్క్రీనింగ్ టెస్టు కార్యక్రమం, ఎస్ఎస్ ఫంక్షన్ హాలులో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. నంగునూరు మండలం పాలమాకులలో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి రూపొందించిన ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఆయా సమావేశాల్లో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఆడపిల్లల కన్నా మగపిల్లలపైనే ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. మగపిల్లలు ఏం చేస్తున్నారో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పదోతరగతి ఫలితాల్లో సిద్దిపేట జిల్లా రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలుపాలనే లక్ష్యంతో కార్యాచరణ రూపొందించి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో రూ.30 లక్షలతో 413 పాఠశాలల్లో 68 వేల మంది విద్యార్థులకు ఎనిమియా స్క్రీనింగ్ టెస్టులు చేయిస్తున్నామని తెలిపారు. ప్రతి పాఠశాలలో యోగా, ప్రాణయామం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. విద్యార్థులకు టిఫిన్‌తోపాటు ట్యూషన్లను నిర్వహిస్తున్నామన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారన్నారు. దివ్యాంగుల రిజర్వేషన్‌ను 4 శాతానికి పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేస్తున్న కృషికి రెండు అవార్డులు వచ్చాయని తెలిపారు.

**సేంద్రియ ఎరువులకు నెలవు కావాలి..**

సిద్దిపేట సేంద్రియ ఎరువులకు నెలవు కావాలని మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. రైతుల వివరాలు, సేంద్రియ ఉత్పత్తులకు సంబంధించిన వివరాల కోసం మొట్ట మొదటిసారిగా సిద్దిపేట నుంచే వెబ్‌సైట్‌ను రూపొందించడం జరుగుతున్నదన్నారు. సేంద్రియ ఆహారంతో మంచి ఆరోగ్యం ఉంటుం దన్నారు.

# వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం

మరో ఇద్దరికి గాయాలు

**చివ్వెంల:** రాష్ట్రంలోని రెండు వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం గుంపుల శివారులోని జాతీయరహదారిపై ముగ్గురు.. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం చెన్నారం గేటు సమీపంలో ఇద్దరు మృతి చెందారు. వివరాలు ఇలా.. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలం కందిబండకు చెందిన దేశబోయిన కిరణ్‌కుమార్(30), అతడి సోదరుడు నాగరాజు(35) మంగళవారం హైదరాబాద్ వెళ్లారు. అనంతరం తిరుగు ప్రయాణంలో ఎల్బీనగర్ వద్ద ఏపీలోని కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన మద్దెల వెంకటస్వామి(35), తన అత్త కాకర్ల ఝాన్సీతో కలిసి గుడివాడకు కారులో వెళ్తుండగా.. కిరణ్, నాగరాజు కోదాడ వరకు వెళ్లేందుకు వారి కారు ఎక్కారు. గుంపుల శివారులో కారు టైర్ పంక్చర్ కావడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కిరణ్‌కుమార్, వెంకటస్వామి అక్కడికక్కడే మృతి చెందగా.. నాగరాజు, ఝాన్సీకి గాయాలయ్యాయి. నాగరాజును సూర్యాపేటలోని ఓ దవాఖానకు తీసుకెళ్లి.. మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్ తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు.

**నాగర్‌కర్నూల్ జిల్లాలో..**

నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం ఈరట్వానిపల్లికి చెందిన జక్కుల సత్తయ్య (55), బల్మూర్‌కు చెందిన నిరంజన్ (50) బైక్‌పై అచ్చంపేట వస్తుండగా.. మార్గమధ్యంలో చెన్నారం సమీపంలో శ్రీశైలం నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికకక్కడే మృతిచెందారు.



వనపర్తిలో నిర్వహించిన దివ్యాంగుల దినోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

# 3,016 పింఛన్ ఇచ్చే ఏకైక రాష్ట్రం మనదే

దివ్యాంగుల దినోత్సవంలో మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి, నమస్తే తెలంగాణ:** దేశంలో దివ్యాంగులకు రూ.3,016 చొప్పున పింఛన్ ఇచ్చే ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో మంత్రి మాట్లాడారు. దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. వైకల్యం జీవితం ఎదుగుదలకు ఆటంకం కాదని నిరూపించేవారే దివ్యాంగులు అని చెప్పారు. తన సొంత డబ్బులతో ఎంతోమందికి త్రిచక్ర వాహనాలు సమకూర్చానని, భవిష్యత్‌లో కూడా సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. డబుల్‌బెడ్రూమ్ ఇండ్లు నిర్మిస్తున్న చోట వికలాంగులు ఉంటే వారికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఎవరైనా స్థలమిస్తే దివ్యాంగుల భవన్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు.



ఆటోలో ఉన్న దివ్యాంగుడికి ఆర్థికసాయం అందజేస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్

# దివ్యాంగుడిని చూసి కంటతడిపెట్టిన మంత్రి

ఆ వెంటనే ఆర్థిక సాయం అందజేసిన సత్యవతి రాథోడ్

**మహబూబాబాద్, నమస్తే తెలంగాణ:** నడవలేని పరిస్థితిలో ఆటోలో ఉన్న దివ్యాంగుడిని చూసి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ చలించిపోయారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వీఆర్ఎన్ గార్డెన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమానికి హాజరై తిరిగి వెళ్తుండగా అక్కడే ఆటోలో ఉన్న దివ్యాంగుడిని చూసి కంటతడి పెట్టారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో దంతాలపల్లికి చెందిన నరేశ్ రెండు కాళ్లు పడిపోయాయి. ప్రస్తుతం ఏపనీ చేయలేకపోవడంతో కుటుంబం గడవక ఇబ్బందులు పడుతున్నట్టు మంత్రి ఎదుట అతడి భార్య విలపించారు. దీంతో మంత్రి నరేశ్‌కు రూ. 10 వేల ఆర్థికసాయం చేశారు. నెల రోజుల్లో పింఛన్ అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

## చలికాలం

| జిల్లా | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| నిర్మల్ | 17.0 | 27.0 |
| రంగారెడ్డి | 17.0 | 28.0 |
| ఆదిలాబాద్ | 17.2 | 30.8 |
| వికారాబాద్ | 17.4 | 29.0 |
| సిద్దిపేట | 18.0 | 27.0 |
| వరంగల్ రూరల్ | 18.0 | 28.0 |
| యాదాద్రి భువనగిరి | 18.0 | 28.0 |
| కామారెడ్డి | 18.0 | 28.0 |
| కుమ్రంభీం ఆసిఫాబాద్ | 18.0 | 30.0 |
| నల్లగొండ | 18.2 | 27.0 |
| సంగారెడ్డి | 18.2 | 27.8 |
| మెదక్ | 18.4 | 30.3 |
| జయశంకర్ భూపాలపల్లి | 19.0 | 28.0 |
| సూర్యాపేట | 19.0 | 28.0 |
| రాజన్న సిరిసిల్ల | 19.0 | 28.0 |
| మహబూబాబాద్ | 19.0 | 28.0 |
| ములుగు | 19.0 | 29.0 |
| జగిత్యాల | 19.0 | 30.0 |
| మంచిర్యాల | 19.0 | 30.5 |
| జనగామ | 19.1 | 25.0 |
| హైదరాబాద్ | 19.7 | 26.8 |
| మేడ్చల్ | 19.7 | 26.8 |
| పెద్దపల్లి | 20.0 | 29.0 |
| భద్రాద్రి కొత్తగూడెం | 20.0 | 29.0 |
| జోగులాంబ గద్వాల | 20.1 | 25.0 |
| నాగర్‌కర్నూల్ | 20.1 | 26.0 |
| వనపర్తి | 20.1 | 28.2 |
| వరంగల్ అర్బన్ | 20.5 | 30.0 |
| మహబూబ్‌నగర్ | 20.5 | 27.4 |
| నారాయణపేట | 20.5 | 27.4 |
| కరీంనగర్ | 20.6 | 31.9 |
| ఖమ్మం | 21.0 | 29.0 |
| నిజామాబాద్ | 21.8 | 27.9 |



లక్ష్మీనారాయణ, సుక్కమ్మ (ఫైల్)

## మృత్యువులోనూ వీడని బంధం

భర్త మరణం తట్టుకోలేక భార్య మృతి

**భూదాన్ పోచంపల్లి:** భర్త మరణాన్ని తట్టుకోలేక భార్య తనువుచాలించిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లిలో సోమవారం రాత్రి చోటుచేసుకున్నది. పోచంపల్లికి చెందిన నల్లగంటి లక్ష్మీనారాయణ (80) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. సోమవారం ఉదయం మరణించాడు. అదేరోజు సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. భర్త చనిపోవడాన్ని జీర్ణించుకోలేని లక్ష్మీనారాయణ భార్య సుక్కమ్మ(72) తీవ్ర మనోవేదనకు గురైంది. బీపీ పెరగడంతో సోమవారం సాయంత్రం చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. వీరికి నలుగురు కూతుర్లు, ఓ కుమారుడు ఉన్నారు. మంగళవారం సుక్కమ్మ అంత్యక్రియలు నిర్వహించారు.



మహబూబ్‌నగర్ ఆర్టీసీ క్యాంటీన్‌లో ఉద్యోగులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# ఆర్టీసీని లాభాల్లోకి తీసుకురండి

- ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- ఆర్టీసీ సిబ్బందితో కలిసి భోజనం

**మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ:** అన్నివర్గాల ప్రజల కండ్లల్లో ఆనందం నింపడమే ప్రభుత్వ లక్ష్యమని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకొని ఉద్యోగులను ఆప్యాయంగా పలుకరించారు. బస్టాండ్ ఆవరణలోని క్యాంటీన్‌లో వారితో కలిసి భోజనం చేశారు. ఆర్టీసీని లాభాల బాట పట్టించాలని మంత్రి కోరారు. మంత్రి వెంట డీఎం అశోక్‌రాజు, ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారు.

# ఏసీబీ వలలో మైనింగ్ ఏడీ

రూ.15 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



శ్రీనివాస్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** లంచం తీసుకుంటూ నాగర్‌కర్నూల్ జిల్లా మైనింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఏసీబీ అధికారులకు చిక్కాడు. వెల్దండ మండలం శంకర్‌కుంట తండాకు చెందిన నారాయణ క్రషర్ అనుమతి కోసం గత నవంబర్ 10న మీసేవలో దరఖాస్తు చేసుకున్నారు. ఆ తరువాత రెండు రోజులకు ఆ దరఖాస్తు ప్రతిని జిల్లా కేంద్రంలోని మైనిం గ్ కార్యాలయంలో అందజేసినా అనుమతి రాలేదు. అనుమతి కావాలంటే రూ.3 లక్షల ఇవ్వాలని మైనింగ్ శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. చివరకు లక్ష రూపాయలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. కాగా గత నెల 24న మరోసారి మైనింగ్ కార్యాలయానికి రాగా తాసిల్దార్ నుంచి ఎన్‌వోసీ కావాల్సి ఉంటుందన్నారు. దీనికి వెల్దండ తాసీల్దార్ కోసమని రూ.20 వేలు డిమాండ్ చేయగా రూ.15 వేలకు ఒప్పందం చేసుకొన్నారు. ఇందులో భాగంగా మంగళవారం నారాయణ నుంచి ఏడీ శ్రీనివాస్‌రెడ్డి రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకొన్నారు. ఏడీని అదుపులోకి తీసుకొని హైదరాబాద్ తరలించారు.

## విద్యార్థినిని వేధిస్తున్న ప్రైవేట్ టీచర్

- ఉపాధ్యాయుడిపై బాధిత కుటుంబసభ్యుల దాడి

**సిరిసిల్ల క్రైం:** రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదోతరగతి విద్యార్థినిని అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు వేధింపులకు గురిచేశాడు. దీంతో బాధిత కుటుంబసభ్యులు ఉపాధ్యాయుడిపై దాడి చేశారు. పట్టణ సీఐ వెంకటనర్సయ్య కథనం ప్రకారం.. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థినిపై భాస్కర్ అనే ఉపాధ్యాయుడు కొన్ని నెలలుగా అసభ్య పదజాలంతో వేధిస్తున్నాడు. సదరు విద్యార్థిని కొన్నిరోజులుగా ఇంట్లో అదోలా ఉండటంతో తల్లిదండ్రులు ఆరా తీయగా ఉపాధ్యాయుడు ఇబ్బందులు పెడుతున్నాడని తెలిపింది. మంగళవారం విద్యార్థి తండ్రి సదరు ఉపాధ్యాయుడిని నిలదీయగా.. బెదిరింపులకు దిగడంతోపాటు దాడికి యత్నించాడు. ఈ క్రమంలో విద్యార్థి తండ్రి సైతం ఉపాధ్యాయుడిపై దాడి చేశారు. పరస్పరం ఫిర్యాదుల మేరకు ఇరువర్గాలపై కేసు నమోదైంది.



కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కిసాన్‌నగర్‌లో స్మార్ట్‌సిటీ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి గంగుల

# కరీంనగర్ స్మార్ట్‌సిటీ పనుల్లో వేగం పెంచాం

మంత్రి గంగుల కమలాకర్

**కార్పొరేషన్, నమస్తే తెలంగాణ:** కరీంనగర్ స్మార్ట్ సిటీ పనుల్లో వేగం పెంచామని బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కిసాన్‌నగర్‌లో చేపడుతున్న స్మార్ట్‌సిటీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. త్వరలోనే కరీంనగర్‌ను అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. స్మార్ట్‌సిటీ కింద మూడు ప్యాకేజీల్లో పనులు చేపడతామని చెప్పారు. ఈ పనులు 8 నెలల కిత్రమే మొదలుపెట్టాల్సి ఉన్నా కొంత మంది ఇబ్బందులు సృష్టించడం వల్ల ఆలస్యమైందని చెప్పారు. ఎన్ని సమస్యలు వచ్చినా పరిష్కరించుకొని పనులు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే కొన్నిప్రాంతాల్లో పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఒకటి, మూడు ప్యాకేజీల్లో భాగంగా రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని చెప్పారు.

**ఆర్టీసీ సమ్మెకాలంలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకుంటామని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో.. మంగళవారం హన్మకొండలోని ఆర్‌ఎం కార్యాలయంలో బాధిత కుటుంబాల నుంచి పలువురు ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. - వరంగల్ (సుబేదారి)**



# బోర్డు తిప్పేసిన వ్యాపారి

తక్కువ ధరకే గృహోపకరణాల పేరిట రూ.50 లక్షలు వసూలు




రోజా ట్రేడర్స్ ముందు బాధితులు

**పరిగి, నమస్తేతెలంగాణ:** తక్కువ ధరలకే గృహోపకరణాలు అందజేస్తామంటూ పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి ఓ వ్యాపారి ఉడాయించిన ఘటన వికారాబాద్ జిల్లా పరిగిలో చోటుచేసుకున్నది. తమిళనాడులోని నాగపట్నంకు చెందిన తాజుధిన్ 20 రోజుల క్రితం పరిగిలో రోజా ట్రేడర్స్ (ఆర్డర్ సప్లయర్స్) పేరిట దుకాణం తెరిచాడు. తక్కువ ధరకే గృహోపకరణాలు అందజేస్తామని.. కొంతమందికి ఇచ్చాడు. దీంతో చాలామంది వివిధ రకాల గృహోపకరణాల కోసం డబ్బులు చెల్లించారు. వారికి వస్తువులు ఇచ్చేందుకు కొంత గడువు విధించాడు. మంగళవారం ఉదయం కొందరు వినియోగదారులు తాజుధిన్‌కు ఫోన్‌చేయగా స్విచాఫ్ వచ్చింది. అద్దె ఇంట్లోకూడా అతడు లేకపోవడంతో తమ డబ్బులతో ఉడాయించారని వారు నిర్ధారించుకున్నారు. సీఐ మొగులయ్య, ఎస్సై వెంకటేశ్వర్లు ఘటనాస్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సుమారు 130 మంది డబ్బులు చెల్లించారని, దాదాపు రూ.50 లక్షలు వసూలు చేసి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.




మంగళవారం హైదరాబాద్‌లో జాతీయ రోయింగ్ చాంపియన్‌షిప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, సాట్స్ ఎండీ దినకర్ బాబు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సోమేశ్ కుమార్

## జాతీయ రోయింగ్ పోటీలు ప్రారంభం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** జాతీయ 38వ రోయింగ్ చాంపియన్‌షిప్ మంగళవారం మొదలైంది. రాష్ట్ర క్రీడా, పర్యాటక శాఖ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా పోటీలను ప్రారంభించారు. తెలంగాణ రోయింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న చాంపియన్‌షిప్‌లో పలు రాష్ట్రాలకు చెందిన రోవర్లు బరిలోకి దిగుతున్నారు. అంతర్జాతీయ రోయింగ్ ఫెడరేషన్(ఎఫ్ఐఎస్ఏ) ప్రమాణాలకు అనుగుణంగా టోర్నీ జరుగనుంది. అయితే ఈసారి కొత్తగా జీపీఎస్ టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీని ద్వారా రోవర్లు సృష్టించే డాటాను స్మార్ట్‌ఫోన్ల ద్వారా వీక్షించవచ్చు. ఇందులో స్ట్రోక్ రేట్, వేగం, దూరం వంటి వాటిని ఖచ్చితత్వంతో అథ్లెట్లు వీక్షించవచ్చు. జాతీయ రోయింగ్ చాంపియన్‌షిప్‌నకు ప్రభుత్వం పూర్తి సహాయ, సహకారాలు అందిస్తుందని ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హుస్సేన్ సాగర్‌కు మరిన్ని సౌకర్యాలు కల్పించి అంతర్జాతీయ వేదికగా మారుస్తామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాట్స్ ఎండీ దినకర్ బాబు, ఆర్ఎఫ్ఐ అధ్యక్షురాలు రాజలక్ష్మి సింగ్ డియో, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సోమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# రెండోరోజూ అదే జోరు..

మంగళవారం 27 పతకాలు చేజిక్కించుకున్న భారత్.. దక్షిణాసియా క్రీడలు

**కఠ్మాండు (నేపాల్):** దక్షిణాసియా క్రీడల్లో భారత్ ఆధిపత్యం కొనసాగుతున్నది. తొలిరోజు 16 పతకాలు చేజిక్కించుకొని అదుర్స్ అనిపించుకున్న మన క్రీడాకారులు రెండోరోజు మరో 27 పతకాలు ఖాతాలో వేసుకున్నారు. అందులో 11 స్వర్ణాలు ఉన్నాయి. ముఖ్యంగా షూటింగ్, ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో మనవాళ్ల జోరుకు ఎదురు లేకుండాపోయింది. ప్రస్తుతం భారత్ 43 పతకాల (18 స్వర్ణాలు, 16 రజతాలు, 9 కాంస్యాలు)తో రెండో స్థానంలో ఉండగా.. నేపాల్ 44 (23 స్వర్ణాలు, 9 రజతాలు, 12 కాంస్యాలు) టాప్‌లో కొనసాగుతున్నది. శ్రీలంక 46 (5 స్వర్ణాలు, 14 రజతాలు, 27 కాంస్యాలు) మూడో స్థానంలో ఉంది. మంగళవారం పోటీల్లో మనవాళ్లు అథ్లెటిక్స్‌లో 10 పతకాలు (4 స్వర్ణాలు, 4 రజతాలు, 2 కాంస్యాలు), షూటింగ్‌లో 9 మెడల్స్ (4 స్వర్ణాలు, 4 రజతాలు, ఓ కాంస్యం) సాధించారు. వాలీబాల్‌లో పురుషుల, మహిళల జట్లు పసిడి పతకాలు చేజిక్కించుకోగా.. తైక్వాండోలో ఓ స్వర్ణం, 3 కాంస్యాలు దక్కాయి. టేబుల్ టెన్నిస్ (టీటీ)లో పురుషుల, మహిళల టీమ్ ఈవెంట్స్‌లో భారత్ పసిడి పతకాలు కైవసం చేసుకుంది.

**మెహూలీ మోత..**

మహిళల 100 మీటర్లలో అర్చన (11.80 సెకన్లు), మహిళల హైజంప్‌లో ఎం జష్న (1.73 మీటర్లు), పురుషుల హై జంప్‌లో సర్వేశ్ అనిల్ కుషారే (2.21 మీటర్లు), పురుషుల 1500 మీటర్లలో అజయ్ కుమార్ (3 నిమిషాల 54.18 సెకండ్లు) స్వర్ణాలు సాధించారు. షూటింగ్‌లో మెహూలి ఘోష్ (253.3 పాయింట్లు) ప్రపంచ రికార్డు స్కోరు కంటే ఎక్కువ నమోదు చేసి స్వర్ణం నెగ్గినా.. ఐఎస్ఎస్ఎఫ్ గుర్తింపు లేకపోవడంతో దీనికి రికార్డుల్లో చోటు దక్కలేదు.వాలీబాల్ ఫైనల్స్‌లో పురుషుల జట్టు 20-25, 25-25, 25-27, 29-27తో పాకిస్థాన్‌ను చిత్తు చేస్తే.. మహిళల ఫైనల్లో 25-17, 23-25, 21-25, 25-20, 15-6తో నేపాల్‌ను మట్టికరిపించి అగ్రస్థానంలో నిలిచింది.




హైదరాబాద్ వేదికగా జరిగిన ఇండియన్ స్పోర్ట్స్ఏరోబిక్స్ ఫిట్‌నెస్ ఫెడరేషన్(ఐఎస్ఏఎఫ్ఎఫ్) జాతీయ చాంపియన్‌షిప్‌లో అండర్-10 బాలికల విభాగంలో స్వర్ణ పతకం సాధించిన మంగ మిష్క గౌడ్‌ను అభినందిస్తున్న టోర్నీ నిర్వాహకులు

# నాన్న త్యాగాల వల్లే..

పదకొండేండ్లకే తల్లిని కోల్పోయిన పసిప్రాయం..
క్రికెట్ కిట్ కోసం తండ్రి అప్పుచేయాల్సిన పేదరికం.
కోచింగ్‌కు వెళ్లాలంటే పాల వ్యాపారాన్ని వదులు కోవాల్సిన దీనస్థితి..

**ఇన్ని ప్రతికూలతలలోనూ ఓ కుర్రాడు.. తండ్రి త్యాగాలను వృథా కానివ్వొద్దని బలంగా సంకల్పించాడు. ఐదుగురు సంతానం ఉన్న కుటుంబంలో ఒకరు తింటే మరొకరు పస్తులుండాల్సిన పరిస్థితి. ఇది మారాలంటే గొప్పగా ఏదైనా చేయాలని చిన్నప్పడే అనుకున్న ఆ కుర్రాడు.. అంచెలంచెలుగా ఎదుగుతూ అండర్-19 ప్రపంచకప్‌లో పాల్గొనే యువ భారత జట్టుకు సారథిగా ఎంపికయ్యాడు. సీనియర్ జట్టులో చోటు దక్కించుకోవడమే పరమావధి అంటున్న 19 ఏండ్ల ప్రియం గార్గ్ అందుకు ప్రపంచ కప్ సరైన వేదికగా భావిస్తున్నాడు. ఇప్పటికే జూనియర్ స్థాయిలో జట్టును ముందుకు నడిపించి.. టీమ్ఇండియాకు ఎంపికైన మహమ్మద్ కైఫ్, విరాట్ కోహ్లీ, పృథ్వీ షా అడుగుజాడల్లో నడుస్తూ తన కల సాకారం చేసుకోవాలనుకుంటున్న ప్రియం ప్రస్థానంపై ఓ లుక్కేస్తే..!**

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

ప్రియం గార్గ్.. రెండు రోజులుగా భారత క్రికెట్‌లో విపరీతంగా వినిపిస్తున్న పేరు. వచ్చే నెలలో దక్షిణాఫ్రికా వేదికగా జరుగనున్న అండర్-19 ప్రపంచకప్‌లో బారత జట్టుకు నాయకత్వం వహించనుంది ఈ ఉత్తరప్రదేశ్ కుర్రాడే. మీరట్‌కు పాతిక కిలోమీటర్ల దూరంలోని ఖిలా పరీక్షిత్‌గఢ్‌కు చెందిన ప్రియం ఆరేండ్ల వయసులోనే బ్యాట్‌పట్టాడు. అయితే అందరు పిల్లల్లా అతడి బాల్యంలో మధుర స్మృతులు పెద్దగా లేవు. పదకొండేండ్ల వయసులోనే తల్లిని కోల్పోయిన ప్రియం.. తండ్రి ప్రోత్సాహం వల్లే ఈ స్థాయికి చేరాడు. ఎక్కడో మారుమూల గ్రామంలో పుట్టి కనీసం క్రికెట్ కిట్ కొనడానికి కూడా డబ్బులు లేని ఓ నిరుపేద కుటుంబానికి చెందిన గార్గ్ ప్రస్థానం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిపాఠం. ఈ స్థాయికి చేరడం వెనుక తన తండ్రి పడ్డ కష్టాలు అనేకమని.. ఆయన త్యాగాల వల్లే తాను అండర్-19 జట్టుకు కెప్టెన్ కాగలిగానని గార్గ్ అంటున్నాడు.

**అప్పుచేసి క్రికెట్ కిట్ కొనిచ్చి..**

పాల వ్యాపారం చేసుకునే నరేశ్ గార్గ్ ఐదుగురు సంతానంలో చివరివాడే ప్రియం. ఓ సోదరుడు, ముగ్గురు అక్కలతో కూడిన పెద్ద కుటుంబం. తండ్రి వ్యాపారంతో ఇళ్లు గడవడమే కష్టం. అలాంటిది ఇంకా క్రికెట్ కోచింగ్ అంటే ఆ కుటుంబానికి అదనపు బరువే. అయినా పసిప్రాయంలోనే అసాధారణ ప్రతిభ కనబర్చిన గార్గ్ కృషి వృథా కానివ్వొద్దనుకున్న తండ్రి నరేశ్.. స్నేహితుల వద్ద అప్పు చేసి క్రికెట్ కిట్ కొనిచ్చాడు. అయితే ప్రియం 11 ఏండ్ల వయసులో అనారోగ్యంతో తల్లి చనిపోయింది. దీంతో ఆటపై దృష్టి పెట్టలేకపోయిన గార్గ్‌కు తండ్రి దిశానిర్దేశం చేశాడు. ఇక్కడితో ఆగిపోతే.. పడ్డ కష్టమంతా వృథా అవుతుంది. ఏదో ఒకరోజు నువ్వు దేశానికి ప్రాతినిధ్యం వహించాలి అని కార్యోణ్ముఖుడిని చేసి మీరట్‌లోని కోచింగ్ అకాడమీలో చేర్పాడు.

**భువీ అడుగుజాడల్లో..**

ఆ అకాడమీ నుంచే వచ్చిన భువనేశ్వర్ కుమార్ టీమ్ఇండియాకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. దీంతో సహజంగానే గార్గ్‌లో జిజ్ఞాస పెరిగిపోయింది. నిలకడగా రాణిస్తే.. ఏదో ఒక రోజు బ్లూ జెర్సీ వేసుకోవడం ఖాయమే అన్న ఆలోచన అతడిలో పుట్టింది. దీంతో ప్రతి రోజు 7-8 గంటలు ప్రాక్టీస్‌కు కేటాయిస్తూ.. మిగిలిన సమయంలో చదువుకుంటూ ముందుకు సాగాడు. ప్రతిరోజూ తెల్లవారుజామునే కొడుకును మీరట్ తీసుకెళ్లాల్సి రావడంతో తండ్రి తన పాల వ్యాపారాన్ని వదిలేశాడు. స్కూల్ బస్ డ్రైవర్‌గా కొత్త కొలువు వెతుక్కున్నాడు. ఆ వచ్చిన డబ్బులతో ఇళ్లు గడవడం కష్టమవడంతో న్యూస్ పేపర్ వేయడం, సరుకులు మోయడం ఇలా అనేక చిన్న చిన్న పనులు చేశాడు. అకాడమీలో సంజయ్ రస్తోగి కోచింగ్‌లో రాటుదేలిన ప్రియం అనతి కాలంలోనే అండర్-14 జట్టుకు ఎంపికయ్యాడు. ఇక అక్కడి నుంచి అండర్-16,-19, రంజీ ఇలా ఒక్కో మెట్టు ఎక్కాడు.



"ప్రియంను మైదానానికి తీసుకెళ్లేందుకు పాల వ్యాపారాన్ని ఆపేశా. అప్పటి నుంచి స్కూల్ బస్ నడుపుతూ.. న్యూస్ పేపర్లు అమ్మేవాడిని. ప్రియం అండర్-19కు ఆడుతున్నప్పుడు ఒకసారి రాహుల్ ద్రవిడ్ పిలిచి మీ అబ్బాయి గురించి భయపడాల్సిన అవసరం లేదు అన్నారు. ఆ రోజు నా ఆనందానికి అవధులు లేవు.

**- నరేశ్ గార్గ్, ప్రియం తండ్రి**

## సచిన్‌ను చూసేందుకు..

కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్ల ఇంట్లో టీవీ లేకపోవడంతో టీమ్ఇండియా మ్యాచ్ ప్రసారమవుతుందంటే చాలు టీవీ షోరూమ్‌ల ముందు వాలిపోయేవాడు. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌ను రోల్ మోడల్‌గా భావించే గార్గ్.. భవిష్యత్తులో ఎప్పటికైనా తన కల సాకారం చేసుకుంటానంటున్నాడు. 'సచిన్ టెండూల్కర్‌ను కలవడం నా కల. ఆయన నుంచి టిప్స్ తీసుకోవాలనుకుంటున్నా. ఏదో ఒక రోజు మాస్టర్‌లా బ్లూ జెర్సీలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తా'అని ప్రియం నమ్మకంగా అంటున్నాడు. తల్లి బతికుండగా.. 'నేను దేశానికి ఆడుతాను. నువ్వు కన్న కలలను సాకారం చేస్తాను'అని ఎన్నో మాటలు చెప్పిన ఆ బుడతడు ఇప్పుడు అండర్-19 లెవల్‌లో దేశానికి సారథ్యం వహిస్తుంటే.. ఆ ఆనంద క్షణాలను ఆస్వాదించేందుకు తల్లి లేకపోవడం విశాదకరం. '2011లో మా అమ్మ చనిపోయింది. ఆమె కన్న కలల్లో అతి పెద్దది నేను దేశానికి ప్రాతినిధ్యం వహించడం. ఒకదశలో ఆటలు అంటూ తిరిగితే పాడైపోతానని.. బాగా చదువకుంటే ఉద్యోగం చేసుకోవచ్చని మా అమ్మ అనుకుంది. కానీ నా పట్టుదల చూశాక ప్రోత్సహించింది. ఇప్పుడు నేను యువభారత్‌కు ఎంపికయ్యా. కానీ ఈ ఆనందాన్ని పంచుకునేందుకు ఆమె మా మధ్యలేదు'అని గార్గ్ కంటతడి పెట్టాడు.

ప్రియం గార్గ్



## ఫస్ట్ మ్యాచ్‌లోనే సెంచరీ

పువ్వు పుట్టగానే పరిమిలిస్తుందనే చందంగా.. రంజీ ట్రోఫీలో బరిలో దిగిన తొలి మ్యాచ్‌లోనే శతక్కొట్టి తన ఆగమనాన్ని ఘనంగా చాటిన ప్రియం.. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో డబుల్ సెంచరీని తన పేరిట రాసుకున్నాడు. 2018-19 రంజీ సీజన్‌లో ఉత్తరప్రదేశ్ తరపున 800పైగా పరుగులు చేసిన ప్రియం మృదుస్వభావి. సహచరుల నుంచి తనకు కావాల్సింది రాబట్టుకునేందుకు ప్రయత్నించడంలోనూ సౌమ్యుడే కావడం అతడిని సారథిగా ఎంపిక చేయడంలో ప్రముఖ పాత్ర పోషించింది. మా నాన్న నా కోసం పడ్డ కష్టాలు, చేసిన త్యాగాలు చూస్తూ ఎదిగిన నేను ఆటలో ఉన్నత శిఖరాలకు చేరి ఆయన రుణం తీర్చుకుంటా అని ఆత్మవిశ్వాసంతో అంటున్నాడు.

## బుమ్రా ఈజ్ బ్యాక్



**న్యూఢిల్లీ:** వెన్ను నొప్పితో విశ్రాంతి తీసుకుంటున్న టీమ్ఇండియా స్పీడ్‌స్టర్ జస్ప్రీత్ బుమ్రా ప్రాక్టీస్ మొదలెట్టాడు. వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ అనంతరం జట్టుకు దూరమైన బుమ్రా లండన్‌లో ప్రత్యేక చికిత్స తీసుకున్నాడు. మంగళవారం అతడు ఐపీఎల్ ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్ ట్రైనర్ రజినీకాంత్ శివజ్ఞానం పర్యవేక్షణలో ప్రాక్టీస్ ప్రారంభించాడు. 'బుమ్రా ఎమ్‌సీఏలో ట్రైనింగ్ తీసుకుంటున్నాడు. ఇది అతడి వ్యక్తిగత కోరిక మేరకు ఏర్పాటు చేశాం'అని ఓ అధికారి తెలిపారు. విండీస్ టూర్‌లోనే బుమ్రా వెన్నునొప్పితో బాధపడటంతో.. ఇటీవల స్వదేశంలో దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్ సిరీస్‌లకు దూరమయ్యాడు. కోలుకునేందుకు మరికొంత సమయం పట్టనుండటంతో శుక్రవారం నుంచి హైదరాబాద్ వేదికగా వెస్టిండీస్‌తో ప్రారంభమయ్యే టీ20 సిరీస్‌కు కూడా అతడు అందుబాటులో లేకుండా పోయాడు. అయితే తిరిగి ఫిట్‌నెస్‌పై దృష్టపెట్టిన బుమ్రా రజినీకాంత్ పర్యవేక్షణలో జిమ్‌లో కసరత్తులు, మైదానంలో పరుగులు మొదలెట్టాడు.



# ప్రాక్టీస్ షురూ..

ఉప్పల్‌లో చెమటోడ్చిన వెస్టిండీస్.. రేపటి నుంచి భారత్ కసరత్తులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా శుక్రవారం ఇక్కడి రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో జరుగునున్న తొలి మ్యాచ్ కోసం భారత్, వెస్టిండీస్ జట్లు నగరానికి చేరకున్నాయి. వచ్చి రావడంతోనే ప్రాక్టీస్ మొదలెట్టిన కరీబియన్లు మంగళవారం దాదాపు మూడు గంటలపాటు ఉప్పల్‌లో చెమటోడ్చారు. బుధ, గురువారాలు కూడా ఇరు జట్లు ఇక్కడ ప్రాక్టీస్ చేయనున్నాయని హెచ్‌సీఏ అధికారులు తెలిపారు. ఉదయం పూట ప్రపంచ చాంపియన్ విండీస్ ప్రాక్టీస్ చేస్తే.. మధ్యాహ్నం సమయంలో టీమ్ఇండియా ప్రాక్టీస్ చేయనుంది. తొలి మ్యాచ్ అనంతరం డిసెంబర్ 8న తిరువనంతపురంలో రెండో టీ20.. డిసెంబర్ 11న ముంబైలో చివరి మ్యాచ్ జరుగనున్నాయి. షెడ్యూల్ ప్రకారం సిరీస్ ముంబై మ్యాచ్‌తో ప్రారంభం కావాల్సి ఉన్నా.. భద్రతా ఇబ్బందుల దృష్ట్యా వేదికల్లో స్వల్ప మార్పులు చేసి చివరి మ్యాచ్‌ను వాంఖడేకు కేటాయించిన విషయం తెలిసిందే. పొట్టి సిరీస్ అనంతరం ఇరు జట్ల మధ్య చెన్నై (డిసెంబర్ 15), విశాఖపట్నం (డిసెంబర్ 18), కటక్ (డిసెంబర్ 22) వేదికగా మూడు వన్డేలు జరుగనున్నాయి.

**అండర్ డాగ్స్‌గా బరిలో దిగుతున్నాం: పొలార్డ్**

టీమ్ఇండియాతో సిరీస్‌లో ఎలాంటి అంచనాలు లేకుండా అండర్ డాగ్స్‌గా బరిలో దిగుతున్నామని విండీస్ కెప్టెన్ కీరన్ పోలార్డ్ పేర్కొన్నాడు. 'బలమైన ప్రత్యర్థితో తలపడనున్నాం. అండర్ డాగ్స్ ముద్ర మంచిదే. మా సత్తా మేరకు ప్రయత్నిస్తే ఎలాంటి ఫలితాలైనా రావొచ్చు'అని పొలార్డ్ అన్నాడు.



## సౌరభ్ @29

**న్యూఢిల్లీ:** సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన భారత షట్లర్ సౌరభ్ వర్మ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌కు చేరాడు. బీడబ్ల్యూఎఫ్ తాజా ర్యాంకింగ్స్‌లో సౌరభ్ 29వ స్థానంలో నిలిచాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన 26 ఏండ్ల సౌరభ్ వర్మ ఈ ఏడాది హైదరాబాద్ ఓపెన్, వియత్నాం ఓపెన్ గెలిచి మంచి జోరు కనబర్చాడు. టాప్-30లో భారత్ నుంచి ఆరుగురు షట్లర్లు ఉండగా.. చైనా నుంచి ఐదుగురు చోటు దక్కించుకున్నారు. మహిళల విభాగం లో సింధు (6), సైనా (10) ర్యాంకింగ్స్‌లో ఎలాంటి మార్పులేదు.

# న్యూజిలాండ్‌కు 'స్పిరిట్ ఆఫ్ క్రికెట్' అవార్డు



**హామిల్టన్:** ఈ ఏడాది లార్డ్స్ వేదికగా జరిగిన వన్డే ప్రపంచకప్ ఫైనల్లో న్యూజిలాండ్ జట్టు కనబర్చిన క్రీడాస్ఫూర్తికి 'స్పిరిట్ ఆఫ్ క్రికెట్' అవార్డు దక్కింది. ఈ మేరకు మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 'న్యూజిలాండ్ జట్టుకు ఈ అవార్డు పొందే అన్ని అర్హతలు ఉన్నాయి. తీవ్ర ఒత్తిడితో కూడిన మ్యాచ్‌లో కూడా కివీస్ ఆటగాళ్లు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు. క్రికెట్‌కే వన్నెతెచ్చే అలాంటి తుదిపోరులో న్యూజిలాండ్ ప్లేయర్స్ ప్రదర్శించిన సంయమనం అమోఘం. జూలై 14న జరిగిన మ్యాచ్ గురించి ఇప్పటికీ చర్చించుకుంటున్నామంటే ఆ క్రీడాస్ఫూర్తి ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు' అని ఎంసీసీ అధ్యక్షుడు కుమార సంగక్కర పేర్కొన్నాడు. ఎంసీసీ, బీబీసీ సంయుక్త ఆధ్వర్యంలో గత ఆరేండ్లుగా (2013 నుంచి) ఈ అవార్డు (క్రిస్టోఫర్ మార్టిన్-జెన్‌కిన్స్)ను బహుకరిస్తున్నారు.

వన్డే ప్రపంచకప్ ఫైనల్లో మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 241 పరుగులు చేయగా.. లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ కూడా సరిగ్గా 241 పరుగులకే ఆలౌటైంది. అనంతరం నిర్వహించిన సూపర్ ఓవర్ కూడా 'టై' కావడంతో మ్యాచ్‌లో ఎక్కువ బౌండ్రీలు కొట్టిన ఇంగ్లండ్‌ను విజేతగా ప్రకటించిన విషయం తెలిసిందే. అనంతరం ఈ నిబంధనపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవడంతో పాటు.. మ్యాచ్‌లో అంపైరింగ్ నిర్ణయాలపై కూడా పలు ప్రశ్నలు తలెత్తాయి. మ్యాచ్ సందర్భంగా గప్టిల్ వేసిన త్రో బెన్ స్టోక్స్ బ్యాట్‌కు తగిలి బంతి బౌండ్రీ దాటితే.. అంపైర్ ఆరు పరుగులు ఇచ్చాడు. నిబంధల ప్రకారం అప్పుడు 5 పరుగులే ఇవ్వాల్సి ఉన్నా.. కివీస్ ఆటగాళ్లు ఈ అంశంపై కనీసం నోరు మెదపలేదు. అంపైర్ నిర్ణయాన్ని శిరసావహించి చేతుల్లోకి వచ్చిన విశ్వకప్పును ఇంగ్లండ్‌కు అప్పగించారు.



## భారత జట్టుకు ఎనిమిదో ర్యాంక్

**న్యూఢిల్లీ:** భారత పురుషుల టేబుల్ టెన్నిస్ (టీటీ) జట్టు కెరీర్ బెస్ట్ ర్యాంక్‌కు చేరింది. అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య(ఐటీటీఎఫ్) మంగళవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో భారత జట్టు ఎనిమిదో స్థానంలో నిలిచింది. వ్యక్తిగత విభాగంలో సాతియన్ జ్ఞానశేఖరన్ 30వ ర్యాంక్‌లో నిలువగా.. భారత స్టార్ ప్యాడ్లర్ ఆచంట శరత్ కమల్ 36వ ర్యాంక్ దక్కించుకున్నాడు. మహిళల విభాగంలో భారత్ నుంచి మనిక బాత్రా (61వ ర్యాంక్) అగ్రస్థానంలో ఉంది.

# మెస్సీ ఆరోసారి

బాలెన్ డీ ఓర్ అవార్డు కైవసం



**మెస్సీ అవార్డుల పరంపర**
**2009, 10, 11, 12, 15, 19**

**ప్యారిస్:** అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లియోనల్ మెస్సీ మైదానంలో తన ఆటతీరులోనే కాదు అవార్డుల వేటలోనూ దిగ్విజయంగా దూసుకెళుతున్నాడు. ప్రతిష్ఠాత్మక బాలెన్ డీ ఓర్ అవార్డును ఏకంగా ఆరోసారి దక్కించుకుని మెస్సీ సరికొత్త రికార్డు నమోదు చేశాడు. భారత కాలమానం ప్రకారం సోమవారం అర్ధరాత్రి కన్నుల పండువగా జరిగిన అవార్డుల కార్యక్రమంలో మెస్సీ పురస్కారంతో మెరిసిపోయాడు. కుటుంబ సభ్యుల సమక్షంలో అవార్డు స్వీకరించిన మెస్సీ తన ఆనందాన్ని పంచుకున్నాడు. 'సరిగ్గా పదేండ్ల క్రితం పారిస్‌లో తొలిసారి బాలెన్ డీ ఓర్ అవార్డు గెలుచుకున్నా. నాకు ఇంకా ఇప్పటికీ గుర్తు అప్పుడు నా ముగ్గురు సోదరులతో కలిసి వచ్చాను. నాలో ఇంకా ఆట మిగిలే ఉంది. ఇంకా కొన్నేండ్లు ఫుట్‌బాల్‌ను ఎంజాయ్ చేయాలనుకుంటున్నాను. నా వయసు గురించి తెలుసు. ఇన్నేండ్ల నా కెరీర్‌ను పూర్తిగా ఆస్వాదించాను. భవిష్యత్తులోనూ ఇదే రీతిలో అభిమానులను వీలైనంత అలరించాలనుకుంటున్నా' అని 32 ఏండ్ల మెస్సీ అన్నాడు.




## టేలర్, విలియమ్సన్ సెంచరీలు

న్యూజిలాండ్, ఇంగ్లండ్ రెండో టెస్టు 'డ్రా'

**హామిల్టన్:** కెప్టెన్ కేన్ విలియమ్సన్ (104 నాటౌట్), సీనియర్ బ్యాట్స్‌మన్ రాస్ టేలర్ (105 నాటౌట్) అజేయ సెంచరీలతో కదం తొక్కడంతో ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్టును న్యూజిలాండ్ 'డ్రా' చేసుకుంది. ఫలితంగా రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను కివీస్ 1-0తో చేజిక్కించుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 96/2తో మంగళవారం ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్‌ను విలియమ్సన్, టేలర్ ముందుకు నడిపించారు. ఇంగ్లండ్ ఫీల్డర్ల తప్పిదాలు కూడా కివీస్‌కు కలిసొచ్చాయి. కేన్ ఇచ్చిన క్యాచ్‌లను ఇంగ్లిష్ ఫీల్డర్లు ఒకటికి మూడుసార్లు వదిలేశారు. మిడ్‌వికెట్‌పై డెన్లీ వదిలేసిన క్యాచ్ అయితే మరీ హాస్యాస్పదం. నేరుగా వచ్చి చేతిలో పడ్డ లడ్డూలాంటి క్యాచ్‌ను డెన్లీ నేలపాలు చేశాడు. దీన్ని సద్వినియోగం చేసుకున్న సారథి టెస్టు కెరీర్‌లో 21వ శతకం పూర్తి చేసుకుంటే.. టేలర్ 19వ సెంచరీ తన పేరిట రాసుకున్నాడు. లంచ్ తర్వాత జట్టు స్కోరు 241/2తో ఉన్న సమయంలో భారీ వర్షం కురవడంతో మ్యాచ్‌ను ని 'డ్రా'గా ప్రకటించారు. డబుల్ సెంచరీ హీరో రూట్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్', వాగ్నర్‌కు 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు దక్కాయి.

## భారత పేస్ భేష్: పాంటింగ్



**మెల్‌బోర్న్:** అంతర్జాతీయ క్రికెట్‌లో టీమ్ఇండియా పేసర్లు చక్కటి ప్రదర్శన కనబరుస్తున్నారని ఆస్ట్రేలియా దిగ్గజం రికీ పాంటింగ్ కొనియాడాడు. జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ షమీ నేతృత్వంలోని పేస్ అటాక్.. అద్వితీయంగా ఉందని పేర్కొన్నాడు. 'గత రెండు మూడేండ్లుగా భారత బౌలింగ్ దళం చక్కటి ప్రదర్శన కనబరుస్తున్నది. ఈ విషయాన్ని నేను ఇప్పటికే చాలాసార్లు చెప్పాను. బుమ్రా, షమీ, ఉమేశ్, ఇషాంత్ రూపంలో వారి వద్ద నాణ్యమైన పేసర్లు ఉన్నారు. అయితే ఆసీస్ గడ్డపై భారత స్పిన్నర్లు అంతగా ప్రభావం చూపలేరు. రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా మెరుగైన స్పిన్నర్లే.. ఆ అంశాన్ని నేను కాదనను. కానీ సొంతగడ్డపై వారిద్దరికంటే నాథన్ లియాన్ రికార్డు మెరుగ్గా ఉంది' అని పాంటింగ్ చెప్పుకొచ్చాడు.

## ఆసక్తికరంగా ఎక్స్1 రేసింగ్ లీగ్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** దేశంలో లీగ్ పరంపర కొనసాగుతున్నది. ఇప్పటికే క్రికెట్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ అభిమానులను అలరిస్తుంటే ఈ జాబితాలో తాజాగా రేసింగ్ చేరింది. రేసింగ్ అభిమానులను దృష్టిలో పెట్టుకుని ఆరు ఫ్రాంచైజీల సమహారంతో ఎక్స్1 రేసింగ్ లీగ్‌ను దేశంలో కొత్తగా తీసుకొచ్చారు. ఇందులో భాగంగా ఎక్స్1 రేసింగ్ లీగ్‌లో అఖిల్ రెడ్డికి చెందిన హైదరాబాద్ బ్లాక్ బర్డ్స్ ప్రత్యర్థి జట్లకు దీటైన పోటీనిస్తూ ముందుకు సాగుతున్నది. ఢిల్లీ సర్క్యూట్‌లో ఆకట్టుకున్న హైదరాబాద్..చెన్నై వేదికగా ఈనెల 7, 8 తేదీల్లో జరిగే రేసుకు సిద్ధమైంది. మంగళవారం మీడియా సమావేశంలో రేసర్లు వింటానియో లుజీ, ఆనందిత్ రెడ్డి, అఖిల్ రవింద్ర, గోసియా డెస్ట్, అర్జున్ నరేంద్రన్ అలరించారు.

## బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్లో 92,700 మందికి వీఆర్ఎస్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 3:** ప్రభుత్వరంగ టెలికం సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ ప్రకటించిన స్వచ్ఛంద పదవీ విరమణ పథకం(వీఆర్ఎస్)కు సిబ్బంది నుంచి విశేష స్పందన లభించింది. ఈ పథకం కింద 92,700 మంది సిబ్బంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకుగాను ఇరు సంస్థలకు ప్రతి ఏటా 8800 కోట్ల రూపాయలు ఆదా కానున్నది ఈ వీఆర్ఎస్ పథకానికి మంగళవారం చివరి రోజు. వీఆర్ఎస్కు దరఖాస్తు చేసుకున్నవారిలో బీఎస్ఎన్ఎల్లో 78,300 మంది సిబ్బంది ఉండగా, ఎంటీఎన్ఎల్లో 14,378 మంది ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. 82 వేల మంది వీఆర్ఎస్కు దరఖాస్తు చేసుకుంటారని భావించినప్పటికీ 78 వేల మంది వచ్చారని, వీరితోపాటు 6 వేల మంది సిబ్బంది పదవీ విరమణ చేశారని బీఎస్ఎన్ఎల్ సీఎండీ పీకే పుర్వార్ తెలిపారు. కానీ, మరో సంస్థ ఎంటీఎన్ఎల్లో లక్ష్యానికి మించి దరఖాస్తు చేసుకున్నారు. 13,650 మంది వీఆర్ఎస్ను ఎంపిక చేసుకుంటారనుకున్నప్పటికీ 14,378 మంది దరఖాస్తుచేసుకున్నారని ఎంటీఎన్ఎల్ సీఎండీ సునీల్ కుమార్ వెల్లడించారు. దీంతో కంపెనీ వార్షిక వేతనాలు రూ.2,272 కోట్ల నుంచి రూ.500 కోట్లకు తగ్గనున్నాయి.

# వీరైజ్.. మరో కార్వీ!

షేర్లను తాకట్టు పెట్టిందన్న ఆరోపణలు • సెబీ, స్టాక్ ఎక్స్ఛేంజీల విచారణ

**ముంబై, డిసెంబర్ 3:** క్లయింట్ల సెక్యూరిటీలను తాకట్టు పెట్టి రుణాలు పొందిన కార్వీ వ్యవహారం ఓవైపు నడుస్తుండగానే.. తాజాగా ముంబైకి చెందిన మరో సంస్థపైనా ఇవే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్టాక్ బ్రోకర్ వీరైజ్.. తమ కస్టమర్ల సెక్యూరిటీలను తనఖా పెట్టిందన్న ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో మార్కెట్ రెగ్యులేటర్ సెబీ, స్టాక్ ఎక్స్ఛేంజీలు విచారణకు సిద్ధమైయ్యాయి. వీరైజ్ అధికారులకు సెబీ నుంచి, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) నుంచి పిలుపు వచ్చినట్లు సమాచారం. అనుమతి లేకుండానే వీరైజ్ తమ షేర్లను తాకట్టు పెట్టిందని, తామిచ్చిన పవర్ ఆఫ్ అటార్నీని దుర్వినియోగం చేసిందని క్లయింట్ల నుంచి పెద్ద ఎత్తున సెబీకి ఫిర్యాదులు వస్తున్నాయి. మరోవైపు తాము క్లయింట్ల షేర్లను తనఖా పెట్టలేదని, సెబీకి ఈ విషయంపై స్పష్టత ఇస్తామని వీరైజ్ డైరెక్టర్ అంకిత్ చెడా ఫోన్ ద్వారా చెప్పినట్లు ప్రముఖ జాతీయ దినపత్రిక బిజినెస్ లైన్ తెలిపింది. అయితే మరో సంస్థకు వీరైజ్ తమ క్లయింట్లకు చెందిన దాదాపు రూ.37 కోట్ల విలువైన షేర్లను తాకట్టు పెట్టిందని తెలుస్తున్నది. కాగా, వీరైజ్ సెక్యూరిటీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఓ బ్రోకరేజీ సంస్థ, ఎడిల్వీజ్ కస్టోడియల్ సర్వీసెస్ లిమిటెడ్, మరో క్లియరింగ్ సభ్యుడి మధ్య ఏర్పడిన ప్రతిష్ఠంభనలో మొత్తం ఈ రూ.37 కోట్లు సెక్యూరిటీల్లోనే ఇరుక్కుపోయాయని సదరు పత్రిక చెబుతున్నది.

### రూ.7 వేల కోట్ల రుణాలు

స్టాక్ బ్రోకర్ల అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. హైదరాబాద్కు చెందిన కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్ మోసం బయటపడిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఇంకా ఎన్నో ఈ తరహా దగాలు జరిగినట్లు తెలుస్తున్నది. కొన్ని ప్రముఖ బ్రోకరేజీ సంస్థలు.. క్లయింట్ల సెక్యూరిటీలను తాకట్టు పెట్టి ఏకంగా రూ.7 వేల కోట్లకుపైగా రుణాలను తీసుకున్నట్లు సమాచారం. బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్బీఎఫ్సీ)ల నుంచి ఈ రుణాలను పొందాయి. బ్రోకర్లకు క్లయింట్ల పవర్ ఆఫ్ అటార్నీ ఉండటంతో మోసాలకు దారితీస్తున్నదని నిపుణులు అంటున్నారు.

# బీమా.. రూ. లక్ష వరకే

పెంపుపై మాకు సమాచారం లేదు • బ్యాంక్ డిపాజిట్లపై స్పష్టం చేసిన డీఐసీజీసీ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 3:**

బ్యాంక్ డిపాజిట్లకు సంబంధించి బీమా పరిమితిని పెంచడంపై మాకు ఎలాంటి సమాచారం లేదని డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ) స్పష్టం చేసింది. ప్రస్తుతం డిపాజిట్లపై అందుబాటులో ఉన్న బీమా రూ.లక్ష వరకేనని సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా పీటీఐ పెట్టుకున్న దరఖాస్తుకు సమాధానమిచ్చింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అనుబంధ సంస్థే డీఐసీజీసీ. అన్ని వాణిజ్య, విదేశీ, స్థానిక, ప్రాంతీయ బ్యాంక్ డిపాజిట్లకు డీఐసీజీసీ బీమా సదుపాయాన్ని కల్పిస్తుంది. బ్యాంకులు ఏ కారణంగానైనా డిపాజిటర్ల సొమ్మును చెల్లించలేనిపక్షంలో ఖాతాదారులకు ఈ బీమాను అందిస్తుంది. ఈ బీమా కోసం ఖాతాదారులు ఎలాంటి సొమ్మునూ చెల్లించనక్కర్లేదు. అయితే ఖాతాల్లో ఎంత మొత్తమైనా ఉన్నప్పటికీ దానికి రూ.లక్షకు మించి బీమాను డీఐసీజీసీ అందివ్వడం లేదు. కానీ పంజాబ్ అండ్ మహారాష్ట్ర సహకార బ్యాంక్ (పీఎంసీ) కుంభకోణం నేపథ్యంలో ఈ బీమాను పెంచాలన్న డిమాండ్లు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం సైతం ఇందుకు సానుకూలంగానే ఉండగా, గత నెల కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ మేరకు సంకేతాలను ఇచ్చారు. ఈ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో బ్యాంక్ డిపాజిట్లపై ఉన్న రూ.లక్ష బీమాను పెంచే యోచనలో ప్రభుత్వం ఉందని చెప్పారు. పీఎంసీ వ్యవహారం నేపథ్యంలో ఆర్ఎస్ఎస్ అనుబంధ సంఘాలు కూడా వ్యక్తిగత డిపాజిట్ ఇన్సూరెన్స్ పరిమితిని రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో బీమాను పెంచే ప్రతిపాదనలు ఏమైనా ఉన్నాయా? అంటూ ఆర్టీఐ ద్వారా వచ్చిన ప్రశ్నకు డీఐసీజీసీ అలాంటివేమీ లేవని తేల్చి చెప్పింది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) ప్రథమార్ధం (ఏప్రిల్-సెప్టెంబర్)లో ప్రభుత్వ రంగ బ్యాంకులు.. రూ.95,700 కోట్లకుపైగా మోసాలను ప్రకటించాయి. ఆర్బీఐ లెక్కలే దీన్ని స్పష్టం చేస్తున్నాయి. దీంతో బీమాను పెంచాలన్న డిమాండ్లు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

### రెండు నెలల్లో రూ.4.9 లక్షల కోట్లు

పండుగ సీజన్లో ప్రభుత్వరంగ బ్యాంకులు భారీగా రుణాలను మంజూరు చేశాయి. అక్టోబర్, నవంబర్ నెలల్లో ఏకంగా రూ.4.91 లక్షల కోట్ల మేర రుణాలు ఇచ్చాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వినిమయాన్ని, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి భారీ స్థాయిలో రుణాలు మంజూరు చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచనమేరకు బ్యాంకులు విరివిగా రుణాలను ఇచ్చాయి. మంత్రి సూచనల మేరకు దేశవ్యాప్తంగా 374 జిల్లాల్లో రుణ మేళాలు నిర్వహించాయి కూడా. ముఖ్యంగా నిధులు లేక సతమతమవుతున్న ఎంఎస్ఎంఈ, ఎన్బీఎఫ్సీలు, కార్పొరేట్లు, రిటైల్, వ్యవసాయ రంగాలకు అధిక స్థాయిలో కేటాయించడం విశేషం. అక్టోబర్లో రూ.2.52 లక్షల కోట్ల రుణాలు మంజూరు చేసిన ప్రభుత్వ బ్యాంకులు..ఆ మరుసటి నెలలో రూ.2.39 లక్షల కోట్లు ఇచ్చాయి. వీటిలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రూ.72,985 కోట్ల రుణాలు ఇచ్చిన బ్యాంకులు..కార్పొరేట్ సంస్థలకు రూ.2.2 లక్షల కోట్లు ఇచ్చాయి. అలాగే నాన్ బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు రూ.45,153 కోట్లు అందించాయి. వీటితోపాటు బ్యాంకులు రూ.27,225 కోట్ల గృహ రుణాలు, రూ.11,088 కోట్ల వాహన రుణాలు, రూ.1,111 కోట్ల విద్యా రుణాలు మంజూరు చేశాయి. గత రెండు నెలల్లో రైతులకు రూ.78,374 కోట్ల నిధులను రుణాల రూపంలో అందచేశాయి బ్యాంకులు.



### రూ.50 వేల కోట్లు కావాలి

2020-21 నాటికి భారతీయ బ్యాంకులకు అదనంగా రూ.50 వేల కోట్లు (7 బిలియన్ డాలర్లు) అవసరమని ఫిచ్ రేటింగ్స్ మంగళవారం అంచనా వేసింది. రుణాల వృద్ధికి, మొండి బకాయి (నిరర్థక ఆస్తులు లేదా ఎన్పీఏ)ల సమస్య సర్దుబాటుకు ఈ నిధులు కావాల్సిందేనని అభిప్రాయపడింది. ఆర్థిక మందగమనంతో రుణాల వసూళ్లు నెమ్మదించాయని, దీనివల్ల ఎన్పీఏలు పెరుగుతున్నాయన్నది. ఈ క్రమంలోనే 'ఆసియా-పసిఫిక్ ఎమర్జింగ్ మార్కెట్ బ్యాంక్స్-2020 ఔట్లుక్'లో దేశీయ బ్యాంకులకు నెగటివ్ రేటింగ్ను ఇచ్చింది.

# ఆపేయండి

కార్వీ కేసులో నిలిచిన సెక్యూరిటీల తరలింపు ■ సెబీ నిర్ణయంపై శాట్ను ఆశ్రయించిన రుణదాతలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 3:** బ్యాంకుల వద్ద కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్ (కేఎస్బీఎల్) తాకట్టు పెట్టిన క్లయింట్ల సెక్యూరిటీల తరలింపును సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (శాట్) ఆపేసింది. మార్కెట్ రెగ్యులేటర్ సెబీ ఈ సెక్యూరిటీలను మదుపరుల ఖాతాల్లోకి బదిలీ చేయాలని నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్డీఎల్)కు సూచించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దాదాపు 83 వేల క్లయింట్ల సెక్యూరిటీలు ఇప్పటికే వారివారి ఖాతాల్లోకి వచ్చేశాయి. రూ.2,300 కోట్ల విలువైన 95 వేలకుపైగా క్లయింట్ల సెక్యూరిటీలను నిబంధనలకు విరుద్ధంగా కార్వీ తమ సొంత ఖాతాలోకి తరలించిన సంగతి విదితమే. అనంతరం వాటిని బ్యాంకులు ఇతర బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్బీఎఫ్సీ)ల వద్ద తనఖా పెట్టి వ్యక్తిగత, సంస్థాగత అవసరాల కోసం రూ.600 కోట్ల రుణాలను పొందినదీ తెలిసిందే. అయితే ఈ సెక్యూరిటీల తనఖాపై రుణదాతలు శాట్ను ఆశ్రయించారు. ఇందులో హెచ్డీఎఫ్సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ ఉన్నాయి. కార్వీకి బజాజ్ ఫైనాన్స్ రూ.345 కోట్ల రుణాలివ్వగా, హెచ్డీఎఫ్సీ బ్యాంక్ రూ.300 కోట్లు ఇచ్చింది. సెబీ నిర్ణయం తమను నష్టపరుస్తున్నదని రుణదాతలు తమ పిటిషన్లలో పేర్కొన్నారు. దీంతో మంగళవారం సెక్యూరిటీల తరలింపును శాట్ నిలుపుదల చేసింది. ఈ మేరకు ఎంటీ జోషి, సీకేజీ నాయర్లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. బుధవారం మధ్యాహ్నం తుది ఆదేశాలు ఇవ్వనున్నది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)పై కార్వీకి ఉన్న ఖాతాలో ఈ సెక్యూరిటీలుండగా, ఇక్కడి నుంచి క్లయింట్ల ఖాతాల్లోకి సెబీ ఆదేశంతో ఎన్ఎస్డీఎల్ మారుస్తున్నది. దీన్నిప్పుడు శాట్ ఆపేసింది. మరోవైపు క్లయింట్ల పవర్ ఆఫ్ అటార్నీలను వినియోగించుకుంటామన్న కార్వీ ప్రతిపాదనను సెబీ కొట్టిపారేసినది తెలిసిందే. బీఎస్ఈతోపాటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ).. కార్వీ ట్రేడింగ్ లైసెన్స్ను సోమవారం సస్పెండ్ చేసినదీ విదితమే.



# 51 మంది.. 17,947 కోట్లు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 3:** 51 మంది మోసగాళ్ల వల్ల రూ.17,900 కోట్లకుపైగా నష్టాలు వాటిల్లాయని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. మంగళ వారం రాజ్యసభలో పరారీ ఆర్థిక నేరగాళ్లు, మోసాలకు సంబంధించిన వివరాలను ఆయన లిఖితపూర్వకంగా తెలియజేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ సమాచారం మేరకు 66 కేసుల్లో 51 మంది మోసగాళ్లు విదేశాలకు పరారైనట్లు చెప్పారు. ఈ కేసుల్లో ఈ పరారీ ఆర్థిక నేరగాళ్ల వల్ల జరిగిన మోసాల విలువ దాదాపు రూ.17,947.11 కోట్లుగా ఉన్నదన్నారు. 8 మంది కోసం ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నదని, వీరిపై ఇంటర్పోల్ రెడ్కార్నర్ నోటీసులనూ ఇచ్చిందని తెలియజేశారు.

# సంస్కరణలు ఆగవు



- ముమ్మందు మరిన్ని తెస్తాం
- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్
- పెట్టుబడులు పెట్టాలని విదేశీ సంస్థలకు పిలుపు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 3:** విదేశీ సంస్థల నుంచి పెట్టుబడులను ఆశిస్తున్న కేంద్రం.. ముమ్ముందు మరిన్ని ఆకర్షణీయమైన సంస్కరణలు ఉంటాయని సంకేతాలిచ్చింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికే తమ ప్రభుత్వం తీసుకున్న సంస్కరణలను వివరిస్తూ.. ఇంకా ఈ తరహా ఎన్నో నిర్ణయాలుంటాయని చెప్పారు. మంగళవారం ఇక్కడ ఇండియా-స్వీడన్ బిజినెస్ సదస్సులో మాట్లాడుతూ కార్పొరేట్ పన్ను తగ్గింపు, ఆయా రంగాలకు ఉద్దీపనల్ని గుర్తుచేశారు. ముఖ్యంగా గడిచిన 28 ఏండ్లలో అతిపెద్ద పన్ను తగ్గింపుగా కార్పొరేట్ ట్యాక్స్ కోతను అభివర్ణించారు. ఆరేండ్ల కనిష్ఠానికి దిగజారిన దేశ జీడీపీని బలోపేతం చేయడానికి కార్పొరేట్ పన్నును 10 శాతం తగ్గించామని చెప్పుకొచ్చారు. బ్యాంకింగ్, మైనింగ్ లేదా బీమా ఏ రంగమైనా కావచ్చు.. మరిన్ని సంస్కరణలకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ప్రస్తుతం పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరిస్తున్నామన్న ఆమె.. దేశీయంగా ఏర్పాటైన విదేశీ సంస్థల సమస్యలను తీర్చేందుకూ ప్రాధాన్యతనిస్తున్నామని వెల్లడించారు.

### ఇన్ఫ్రాలో గొప్ప అవకాశాలు

మౌలిక రంగంలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలున్నాయని ఈ సందర్భంగా స్వీడన్ సంస్థలకు మంత్రి సూచించారు. మౌలిక రంగ అభివృద్ధి ప్రాజెక్టుల్లో రాబోయే ఐదేండ్లలో దాదాపు రూ.100 లక్షల కోట్ల పెట్టుబడులను పెట్టేందుకు భారత్ ప్రణాళికల్ని రచిస్తున్నదని వివరించారు. ఇప్పటికే ఓ టాస్క్ఫోర్స్ను ఏర్పాటు చేశామన్న మంత్రి.. ఈ నెల 15కల్లా 10 భారీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులతో కూడిన ఓ జాబితాను అది సిద్ధం చేయనుందని ప్రకటించారు. ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి నేతృత్వంలో సెప్టెంబర్లో ఈ టాస్క్ఫోర్స్ను కేంద్ర ఆర్థిక శాఖ ఏర్పాటు చేసింది. 2019-20 నుంచి 2024-25 మధ్య రూ.100 లక్షల కోట్ల పెట్టుబడులతో ఇన్ఫ్రా ప్లాన్ను సిద్ధం చేయడమే ఈ టాస్క్ఫోర్స్ లక్ష్యం. రూ.100 కోట్లకుపైగా పెట్టుబడి వ్యయం కలిగిన గ్రీన్ఫీల్డ్, బ్రౌన్ఫీల్డ్ ప్రాజెక్టులపైనా టాస్క్ఫోర్స్ దృష్టి సారించే అవకాశాలున్నాయి.

# వాహన ధరలకు రెక్కలు!

జనవరి నుంచి మారుతి, మహీంద్రా, టయోటా, బెంజ్ కార్లు ప్రియం




**న్యూఢిల్లీ, డిసెంబర్ 3:** కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ..వచ్చే నెల నుంచి అన్ని రకాల వాహన ధరలను పెంచబోతున్నట్లు ప్రకటించింది. ఉత్పాదక వ్యయం పెరుగడం వల్లనే వాహన ధరలను పెంచాల్సి వస్తున్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. మారుతితోపాటు మహీంద్రా అండ్ మహీంద్రా, టయోటా, మెర్సిడెజ్ బెంజ్లు కూడా తమ వాహన ధరలను పెంచడానికి సిద్ధమవుతున్నాయి. కానీ, హ్యుందాయ్ మోటర్, హోండా కార్స్లు మాత్రం ధరలను పెంచబోమని ప్రకటించాయి. బీఎస్-6 ప్రమాణాలతో తయారైన వాహనాలు మార్కెట్లోకి విడుదల చేయనుండటంతో సంస్థలపై అదనపు భారం పడుతున్నది. దీంతో ఈ అదనపు భారాన్ని వినియోగదారులపై మళ్లించడంలో భాగంగా ధరలను పెంచుతున్నాయి సంస్థలు. వాహనాల ఉత్పత్తి చేయడానికి అయ్యే ఖర్చు అధికమవుతుండటంతో సంస్థపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా వాహన ధరలను పెంచాల్సి వస్తున్నదని మారుతి బీఎస్ఈకి సమాచారం అందించింది. ధరలను ఎంత మేర పెంచేది మాత్రం కంపెనీ వెల్లడించలేదు. ధరల పెంపు వివిధ మోడళ్లను బట్టి వేరు వేరుగా ఉండనున్నది. ప్రస్తుతం సంస్థ రూ.2.89 లక్షల నుంచి రూ.11.47 లక్షల లోపు ధర కలిగిన మోడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది. టయోటా కిర్లోస్కర్ మోటర్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ రాజా మాట్లాడుతూ..ఉత్పత్తి వ్యయం పెరిగిన నేపథ్యంలో కార్ల ధరలను ఎంతపెంచాలనే దానిపై చర్చలు జరుగుతున్నాయన్నారు. మహీంద్రా అండ్ మహీంద్రా కూడా ధరల పెంపుపై సమీక్షిస్తున్నది. వచ్చే నెల నుంచి వాహన ధరలు పెంచడం తథ్యమని, ఎంతమేర పెంచేదానిపై ఈ నెల చివరి నాటికి నిర్ణయం తీసుకోనున్నట్లు కంపెనీ ప్రతినిధి తెలిపారు. మరోవైపు, హ్యుందాయ్, హోండా కార్స్లు మాత్రం ప్రస్తుత పరిస్థితుల్లో ధరలను పెంచే ఉద్దేశం లేదని ప్రకటించాయి.

## 2 కోట్ల మందికి ట్యాక్స్ రిఫండ్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 3:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఎనిమిది నెలలకాలంలో 2.10 కోట్ల మందికి ట్యాక్స్ రీఫండ్ రూపంలో రూ.1.46 లక్షల కోట్ల మేర చెల్లింపులు జరిపినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో చెల్లించిన దాంతో పోలిస్తే 20 శాతం అధికం. ఏప్రిల్ 1 నుంచి నవంబర 28 వరకు సెంట్రలైజ్డ్ ప్రాసెసింగ్ సెంటర్(సీపీసీ) 4.70 కోట్ల ట్యాక్స్ రిటర్నులను ప్రాసెసింగ్ చేసిందని, గతేడాది ఇది 3.91 కోట్లుగా ఉన్నదని తెలిపింది. నవంబర్ 28 నాటికి రూ.1.46 లక్షల కోట్ల రిఫండ్ రూపంలో చెల్లింపులు జరిపింది. ఈ రిఫండ్ చెల్లింపులు నేరుగా పన్ను చెల్లింపుదారులకు సంబంధించి బ్యాంక్ ఖాతాల్లో జమకానున్నదని తెలిపింది. మిగతా బ్యాలెన్స్ త్వరలో జమకానున్నాయి. చిరునామా సరిగా లేకపోవడం, బ్యాంక్ ఖాతా క్లోస్ అవడం, ఇతర కారణాలతో గతంలో రిఫండ్ చెల్లింపులు జరుపలేకపోయారు.

# ఐదేండ్లలో రూ.2.79 లక్షల కోట్లు

డిజిన్వెస్ట్మెంట్ ద్వారా సేకరించిన సర్కారు • రాజ్యసభలో కేంద్ర సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 3:** గడిచిన ఐదేండ్లలో ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా రూ.2,78,622 కోట్ల నిధులను సేకరించింది కేంద్ర ప్రభుత్వం. కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ హయంలో 2004-14 మధ్యకాలంలో రూ.1,07,833 కోట్లు మాత్రమే సేకరించగా, నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ సర్కార్ 2014 నుంచి 2014 మధ్య కాలంలో భారీ స్థాయిలో సేకరించినట్లు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. రాజ్యసభ ప్రశ్నోత్తర సమయంలో మంత్రి మాట్లాడుతూ..గత ఐదేండ్లలో రెండు రెట్లు అధికంగా సేకరించినట్లు, ప్రతియేటా 21 లావాదేవీలు జరిపినట్లు చెప్పారు. యూపీఏ హయంలో కేవలం నాలుగు మాత్రమే జరిగాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1.05 లక్షల కోట్లు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. దీంట్లోభాగంగా ఇప్పటికే 33 సంస్థల్లో వాటా విక్రయ ప్రతిపాదనకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు మంత్రి చెప్పారు.



### బ్యాంకుల విలీనాలతో ఒక్క ఉద్యోగం పోలేదు

ప్రభుత్వరంగ బ్యాంకులను విలీనం చేయడం వల్ల ఒక్క ఉద్యోగం పోలేదని ఠాకూర్ స్పష్టం చేశారు. పది ప్రభుత్వరంగ బ్యాంకులను నాలుగింటిలో విలీనం చేస్తూ ఆగస్టులో కేంద్రం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. బ్యాంకుల విలీనంతో రుణ వితరణ పెరుగడంతోపాటు కోల్కతా కేంద్రస్థానంగా పనిచేస్తున్న రెండు బ్యాంకులను విలీనం చేయడంతో తూర్పు రాష్ట్రాల్లో బ్యాంకింగ్ సేవలు అందించడం మరింత సులభతరంకానున్నదన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్లో యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విలీనంకానుండగా, అలాగే అలహాబాద్ బ్యాంక్ ఇండియన్ బ్యాంక్లు కలిసిపోనున్నాయి. బ్యాంకుల విలీనాలతో 50 వేల మంది ఉద్యోగులు రోడ్డున పడే అవకాశాలున్నాయని తృణముల్ కాంగ్రెస్ సభ్యుడు మనీష్ గుప్తా అడిగిన ప్రశ్నకు ఠాకూర్ స్పందించారు. బ్యాంకులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఇప్పటివరకు రూ.2.35 లక్షల కోట్ల స్థాయిలో నిధులను కేటాయించినట్లు, దీంతో బ్యాంకులు భారీ స్థాయిలో రుణాలను మంజూరు చేశాయన్నారు.

# బెంజ్ నుంచి మరో కారు

ప్రారంభ ధర రూ.52.56 లక్షలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 3:** జర్మనీకి చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ మరో మోడల్ను దేశీయ మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రీమియం ఎస్యూవీ జీఎల్సీ పేరుతో విడుదల చేసిన ఈ కారు ధరను రూ.52.56 లక్షలుగా నిర్ణయించింది. సరికొత్త జనరేషన్కు తగ్గట్టుగా రూపొందించిన ఈ జీఎల్సీ కారు పెట్రోల్, డీజిల్ ఇంజిన్లను ఎంపిక చేసుకునే అవకాశం వినియోగదారులకు కల్పించింది సంస్థ. వీటిలో పెట్రోల్ ఇంజిన్ కలిగిన జీఎల్సీ 200 మోడల్ కారు రూ.52.75 లక్షలకు లభించనుండగా, అదే డీజిల్ ఇంజిన్ కలిగిన జీఎల్సీ 220 డీ మోడల్ రూ.57.75 లక్షలుగా నిర్ణయించింది. దేశీయ లగ్జరీ మార్కెట్లో సుస్థిరమైన స్థానం సాధించడానికి ఈ నూతన కారు దోహదం చేయనున్నదని మెర్సిడెజ్-బెంజ్ ఇండియా ఎండీ, సీఈవో మార్టిన్ స్కేవెంక్ తెలిపారు. ఇప్పటి వరకు భారత్లో 7 వేల జీఎల్సీ మోడళ్లను విక్రయించింది సంస్థ.




# విదేశీ బాటపట్టిన నెఫ్రోప్లస్

**హైదరాబాద్, డిసెంబర్ 3:** ప్రముఖ డయాలసిస్ కేంద్రాల నిర్వహణ సంస్థ నెఫ్రోప్లస్ తన వ్యాపారాన్ని విదేశాలకు విస్తరిస్తున్నది. వచ్చే మూడేండ్లకాలంలో 75 నుంచి 100 సెంటర్లను ఏర్పాటు చేయడానికి రూ.150 నుంచి రూ.175 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నట్లు కంపెనీ ఫౌండర్, సీఈవో విక్రమ్ ఉప్పల తెలిపారు. భారత్ విషయానికి వస్తే ప్రతియేటా 40 సెంటర్లను నెలకొల్పాలని నిర్ణయించినట్లు, ఒక్కో సెంటర్ను ఏర్పాటు చేయడానికి రూ.1-2 కోట్ల వరకు నిధులు ఖర్చు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. కంపెనీలో బహ్రెయిన్కు చెందిన ప్రైవేట్ ఈక్విటీ సంస్థ రూ.323 కోట్ల మేర పెట్టుబడులు పెట్టింది. ప్రస్తుతం సంస్థకు దేశవ్యాప్తంగా 200 సెంటర్లు ఉన్నాయి. గతేడాది రూ.200 కోట్లు దాటిన కంపెనీ ఆదాయం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.250 కోట్ల ఆదాయంపై రూ.40 కోట్ల నికర లాభాన్ని గడించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకున్నది.

# ఐఎస్బీ విద్యార్థులు భళా..!

1383 మంది విద్యార్థులకు ఆఫర్లు

**హైదరాబాద్, డిసెంబర్ 3:** నైపుణ్యాలకు కేరాఫ్ అడ్రస్గా మారిపోయిన ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్బీ)లో చదువుకున్నవారిని ఎగరేసుకొని పోతున్నాయి దేశీయ, అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలు. 2020 సంవత్సరానికిగాను ఐఎస్బీలో పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్మెంట్ కోర్సు చేసిన వారిలో 1,383 మంది విద్యార్థులకు ఉద్యోగ ఆఫర్ ఇచ్చాయి కార్పొరేట్ సంస్థలు. అంతక్రితం ఏడాది 1,194 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించాయి. గరిష్ఠ వార్షిక వేతనంగా రూ.26.15 లక్షలు ఆఫర్ చేశాయి. గతేడాది ఆఫర్ చేసిన దాంతో పోలిస్తే 124 శాతం అధికం. ఈ సందర్భంగా ఐఎస్బీ డీన్ ప్రొఫెసర్ రాజేంద్ర శ్రీవాత్సవ మాట్లాడుతూ..భారత్తోపాటు ప్రపంచ భవిష్యత్తు నాయకుడిని తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఐఎస్బీ కృషి చేస్తున్నదని, ఇప్పటికే ఎంతో మంది నైపుణ్యం కలిగిన విద్యార్థులను వశం చేసుకోవడానికి దేశీయ కంపెనీలు ఐఎస్బీనే ఎంచుకుంటున్నట్లు చెప్పారు. క్యాంపస్లో 890 మంది విద్యార్థులు కూర్చోవడానికి వీలుండే అతిపెద్ద క్లాస్ను ఏర్పాటు చేసింది.



**ఏయే రంగాలు:**
కన్సల్టింగ్, ఐటీ/ఐటీఈఎస్/ టెక్నాలజీ, ఈ-కామర్స్, బీఎఫ్ఎస్ఐ, ఎఫ్ఎంసీజీ/రిటైల్, హెల్త్కేర్, ఎడ్యుకేషన్, మీడియా అండ్ ఎంటర్టైన్మెంట్, రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయాలు, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు

**పాల్గొన్న కంపెనీలు:**
యాక్సెంచర్, అల్వారెజ్ అండ్ మార్సల్, ఏటీ కిర్నే, బెయిన్ అండ్ కంపెనీ, మికెన్సీ, పీడబ్ల్యూసీ డీఏసీ, పీడబ్ల్యూసీ ఇండియా, రోలాండ్ బర్గర్, సిమెన్స్ మేనేజ్మెంట్ కన్సల్టింగ్ అండ్ జెడ్ఎస్ల తోపాటు 314 సంస్థలు పాల్గొన్నాయి.

**ఐటీ/ఐటీఈఎస్, టెక్నాలజీకి చెందినవి**
ఏడీపీ, అమెజాన్, బ్లాక్బక్, బైజుస్, ఎలక్ట్రానిక్ ఆర్ట్స్, ఫ్లిప్కార్ట్, గూగుల్, ఇన్మోబి, మీడియా.నెట్ సాఫ్ట్వేర్ సర్వీసులు, ఎంఫిన్, మైక్రోసాఫ్ట్, మింత్రా, నాగార్రో సాఫ్ట్వేర్, నైకా, ఓలా, పేసేఫ్, ఫోన్పే, రాజోర్పే, థట్వర్క్స్, ఉడాన్, ఉబర్, వీఎంవేర్, జోమాటోలు ఉన్నాయి.

| రంగాలు | మొత్తం ఆఫర్లలో వాటా |
|---|---|
| కన్సల్టింగ్ | 22.75 శాతం |
| ఐటీ/ఐటీఈఎస్ | 14.93 శాతం |
| ఈ-కామర్స్ | 11.30శాతం |
| బ్యాంక్/ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూట్లు/ ఆర్థిక సేవలు | 11.23 శాతం |

**బీఎఫ్ఎస్ఐ విభాగానికి చెందిన కంపెనీలు:**
యాక్సిస్ బ్యాంక్, సిటీ బ్యాంక్, క్రెడిట్ స్యూస్, ఎస్టీ అడ్వైజర్, ఐసీఐసీఐ బ్యాంక్, మాట్రిక్స్ పార్టనర్స్, యెస్ బ్యాంక్, ఇన్వెస్ట్మెంట్ బ్యాంకింగ్ అండ్ ప్రైవేట్ ఈక్విటీ, అమెరికన్ ఎక్స్ప్రెస్, బార్క్లేస్, కింగ్ఫిష్ ప్రైవేట్ ఈక్విటీ, నేషనల్ ఇన్వెస్ట్మెంట్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్(జీవోఐ), ఆర్బీఎస్, వాటర్ఫిల్డ్ అడ్వైజర్స్, వెల్స్ ఫార్గోలు ఉన్నాయి.

**ఎఫ్ఎంసీజీ/మార్కెటింగ్ కంపెనీలు:**
ఏబీ ఇన్బెవ్, కోక-కోలా, కాల్గెట్, పామోలివ్, గోద్రేజ్, హెచ్యూఎల్, నెస్లే, పీ అండ్ జీ, సామ్సంగ్, ఐటీసీ, మారికోలు దేశీయ సంస్థల కంటే అంతర్జాతీయ సంస్థల్లో చేరడానికి ఎక్కువ మంది విద్యార్థులు ఆసక్తి కనబరిచారు. వీరిలో యాపిల్, డెలాయిట్, ఈవై, ల్యాండ్మార్క్ గ్రూపులు ఉన్నాయి. మహిళా విద్యార్థులకు పెద్దపీట వేస్తున్న ఐఎస్బీ..మొత్తం విద్యార్థుల్లో వీరివంతు 39 శాతంగా ఉన్నది.

## స్వస్థలాలకు గల్ఫ్‌కార్మికుల మృతదేహాల తరలింపు



ఫరూఖ్ (ఫైల్)

**శంషాబాద్:** బతుకుదెరువు కోసం గల్ఫ్‌కు వెళ్లిన ఇద్దరు కార్మికుల మృతదేహాలు మంగళవారం శంషాబాద్ విమానాశ్రయానికి తీసుకురాగా అంబులెన్సుల్లో వారి స్వస్థలాలకు తరలించారు. భారత దౌత్య కార్యాలయం, పలువురు ఎన్నారైల సహకారంతో మృతదేహాలను స్వదేశానికి తీసుకొచ్చినట్టు గల్ఫ్ తెలంగాణ వెల్ఫేర్ అండ్ కల్చర్ అసోసియేషన్ అధ్యక్షుడు బసంత్‌రెడ్డి తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రుద్రంగికి చెందిన ఎం గంగాధర్ (50) కొద్దినెలల కిందట గల్ఫ్ వెళ్లాడు. అనారోగ్యంతో గత అక్టోబర్‌లో అక్కడే చనిపోయాడు. కామారెడ్డి జిల్లా బిక్నూర్ మండలం కాదాపూర్‌కు చెందిన ఫరూఖ్ గత సెప్టెంబర్‌లో గల్ఫ్‌లో ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఫరూఖ్ మృతదేహం 70 రోజుల తర్వాత, గంగాధర్ మృతదేహం నెలరోజుల తర్వాత అసోసియేషన్ చొరవతో స్వదేశానికి తీసుకొచ్చారు. ఎమిరేట్ విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టు చేరుకోగా మృతదేహాలను అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వగ్రామాలకు తరలించి కుటుంబీకులకు అప్పగించారు.

# గుండెకు మరింత భద్రత

కొత్త ఈసీజీ పరికరం రూపొందించిన ఐఐటీ హైదరాబాద్ పరిశోధకులు

గుండె సంబంధిత మరణాల సంఖ్య తగ్గే అవకాశం

**కంది:** గుండె జబ్బులతో బాధపడుతున్న రోగులకు ఒక శుభవార్త. గుండె పనితీరు ఎలా ఉంది, ఎలాంటి పరిస్థితిలో గుండె కొట్టుకుంటుందనే వివరాలన్నీ ఇప్పుడు ఒక అలర్ట్ ద్వారా తెలుసుకోవచ్చు. గుండెకు మరింత భద్రతనిచ్చేలా ఐఐటీ హైదరాబాద్ పరిశోధకులు రియల్ టైం ఈసీజీని రూపొందించారు. ఇది తక్కువ శక్తిని వినియోగించి హృదయ సంబంధ వ్యాధుల (సీవీడీ) ప్రమాదం గురించి వైద్యులు, రోగులను అప్రమత్తం చేస్తుంది. తద్వారా గుండె సంబంధిత వ్యాధుల వల్ల జరిగే మరణాల సంఖ్యను తగ్గించవచ్చని ఐఐటీ హైదరాబాద్ పరిశోధక బృందం పేర్కొంటున్నది.

### గుండె వ్యాధులపై అప్రమత్తత

గుండె సంబంధిత వ్యాధులపై ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసేలా కొత్తగా ఈసీజీ పరికరాన్ని ఐఐటీ హైదరాబాద్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ అమిత్ ఆచార్య అభివృద్ధి చేశారు. ఈ పరికరం వివరాలను మంగళవారం ఆయన వెల్లడించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) సర్వేప్రకారం ఇతర వ్యాధులతో పోలిస్తే గుండె సంబంధిత వ్యాధి ప్రజారోగ్య సమస్యల జాబితాలో అగ్రస్థానంలో ఉన్నదని, మానవ మరణాలకు ప్రధాన కారణం ఇదే అయిందని చెప్పారు. జీవనశైలిలో మార్పులు, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పొగాకు వాడకం, పండ్లు, కూరగాయలు తక్కువ తీసుకోవడం, శారీరక శ్రమ సరిగా లేకపోవడం వల్ల గుండె జబ్బులు ఎక్కువగా వస్తున్నాయని ఆయన తెలిపారు. ఈసీజీ సంకేతాలను విశ్లేషించడం, రోగి పరిస్థితిని తెలుసుకొనేందుకు ఈ కొత్త ఈసీజీ పరికరం ఉపయోగపడుతుందని, ఈ పద్ధతి సీవీడీలకు అనుగుణంగా ఆరోగ్యస్థితి నుంచి అనారోగ్యకర స్థితికి కలిగే కారణాలను అంచనా వేస్తుందని ఐఐటీహెచ్ రిసెర్చ్‌స్కాలర్ వేమిశెట్టి నరేశ్ చెప్పారు. ఈ పరికరం ద్వారా తక్కువ శక్తిని ఉపయోగించి గుండె పనితీరు వివరాలను రోగికి లేదా వైద్యునికి చేరవేసే అవకాశం ఉంటుందని తెలిపారు. దీని ద్వారా గుండెకు సంబంధించిన పనితీరు ముందుగానే తెలుసుకుని వాటి నివారణకు తగిన వైద్య చికిత్సలు చేసుకుని గుండె సంబంధిత మరణాలను తగ్గించవచ్చని వివరించారు. ఈ పరిశోధనకు ముందు ఇక్కడి రోగులపై అన్ని రకాల అధ్యయనాలు చేసి, రోగి గుండె పనితీరును పరిశీలించి అందుకు అవసరమైన కొత్త రకం రియల్ టైం ఈసీజీని రూపొందించినట్టు నరేశ్ తెలిపారు.



ఐఐటీహెచ్ పరిశోధకులు అభివృద్ధి చేసిన కొత్త ఈసీజీ పరికరం

## నానో ఆర్టోగ్రఫీలో ఐఐటీహెచ్ విద్యార్థి సత్తా

పోటీలో మొదటి బహుమతి కైవసం



మామిడి సురేశ్

**కంది:** ఐఐటీ హైదరాబాద్‌లో కెమికల్ విభాగానికి చెందిన విద్యార్థి మామిడి సురేశ్ నానో ఆర్టోగ్రఫీ పోటీలో సత్తాచాటారు. మొదటిస్థానంలో నిలిచి రూ. 50 వేల (700 యూఎస్ డాలర్ల) బహుమతి దక్కించుకున్నారు. గత సెప్టెంబర్‌లో ఫేస్‌బుక్ ఆన్‌లైన్‌లో నిర్వహించిన నానోఆర్టోగ్రఫీ పోటీల్లో ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది పాల్గొన్నారు. రెండోస్థానంలో యూకేకు చెందిన ఎమ్మవార్డ్, మూడోస్థానంలో ఐరిన్ హెగ్‌స్టాడ్ నిలిచారు. వీరితోపాటు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కర్ణాటకకు చెందిన మీనాకేతన్ సేతి పీపుల్స్ చాయిస్‌లో ఎక్కువమందిని ఆకట్టుకుని రూ. 35 వేల బహుమతిని దక్కించుకున్నారు. ఆన్‌లైన్ పోటీలో ఎక్కువ లైక్లు, కామెంట్లు పొందినవారిని విజేతలుగా నిర్ణయించినట్టు నానోఆర్టోగ్రఫీ-2019 నిర్వాహకులు తెలిపారు.



మామిడి సురేశ్ వేసిన నానోఆర్టోగ్రఫీ

## ధిక్కరణ కేసులో కరీంనగర్ సీపీకి ఊరట

జైలుశిక్షపై హైకోర్టు స్టే

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ధిక్కరణ కేసులో కరీంనగర్ పోలీస్ కమిషనర్ కమలాసన్‌రెడ్డి, ఏసీపీ తిరుపతి, స్టేషన్‌హౌస్ ఆఫీసర్ శశిధర్‌రెడ్డికి సింగిల్ జడ్జి విధించిన ఆరు నెలల జైలుశిక్ష, జరిమానాపై చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ స్టే విధించింది. కరీంనగర్‌లోని పుష్పాంజలి కంట్రీ రిసార్ట్స్ కార్యకలాపాల్లో జోక్యం చేసుకోవద్దన్న తమ ఆదేశాలను పట్టించుకోకుండా దాడులు చేయడంపై సింగిల్ జడ్జి బెంచ్ వారికి జైలుశిక్ష విధించింది. దీనిపై పోలీసులు చేసుకొన్న అప్పీల్‌పై విచారణ జరిపిన డివిజన్ బెంచ్.. సింగిల్ జడ్జి తీర్పుపై స్టే విధించింది. పోలీసులు వ్యక్తిగత శత్రుత్వంతో విధులు నిర్వహిస్తారని ఎలా భావిస్తామని హైకోర్టు వ్యాఖ్యానించింది. కేవలం పిటిషనర్ సమర్పించిన పత్రాల ఆధారంగా సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీచేశారని తెలిపింది. పోలీసులే క్లబ్‌లో డబ్బులు పెట్టి కావాలనే దాడులు చేశారనే ఆరోపణలు దిగువ కోర్టులో నిరూపణ కావాల్సి ఉంటుందని, హైకోర్టులో కాదని పేర్కొన్నది. శాస్త్రీయమైన ప్రక్రియ లేకుండా సింగిల్ జడ్జి ముగింపునకు వచ్చారని తెలిపిన ధర్మాసనం.. పోలీసులకు జైలుశిక్ష విధింపుపై స్టే విధించింది.

# సమర్థంగా పంటల కొనుగోళ్లు

వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు సమర్థంగా కొనసాగుతున్నాయని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురిసి ప్రాజెక్టుల్లోకి నీరు రావడంతో పంటల దిగుబడులు గణనీయంగా పెరిగాయని అన్నారు. మంగళవారం హైదరాబాద్ హాకాభవన్‌లోని తన కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత కరెంటుతోపాటు సీజన్ కలిసి రావడంతో పంటలు బాగా పండాయన్నారు. వరి ధాన్యం కొనుగోళ్లను పౌరసరఫరాలశాఖ సమర్థంగా చేపడుతున్నదని వెల్లడించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్కెట్లలో వసతులు చేపట్టినట్టు చెప్పారు.

**మార్క్‌ఫెడ్ ద్వారా 44 కొనుగోలు కేంద్రాలు**

రాష్ట్రవ్యాప్తంగా మార్క్‌ఫెడ్ ద్వారా 44 కేంద్రాలను ఏర్పాటుచేసి మక్కజొన్న కొనుగోలు చేస్తున్నామని, సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయని మంత్రి నిరంజన్‌రెడ్డి చెప్పారు. రానున్న రోజుల్లో తెలంగాణలో పండిన వ్యవసాయ ఉత్పత్తులను ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాలకు తెలంగాణ బ్రాండ్ పేరుతో ఎగుమతి చేసేలా సమగ్ర ఫుడ్ ప్రాసెసింగ్ విధానాన్ని రూపొందించేందుకు కసరత్తు చేస్తున్నట్టు మంత్రి వెల్లడించారు. ఇక్కడి పంటలను సక్రమంగా నిల్వ చేసుకొనేందుకు వీలుగా రాష్ట్రంలోని ప్రభుత్వ గోదాములన్నింటిని ఒకే గొడుగు కిందకు తీసుకురావాల్సిన అవసరమున్నదని అన్నారు. ఏడాది పొడవునా గోదాంలను నిల్వలకు అనుకూలంగా ఉండేలా నిర్వహించాలని సూచించారు. పంటల సాగు, దిగుబడి, మార్కెటింగ్ అంశాలపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించుకోవాలని, భవిష్యత్‌లో ఇక్కడ పండే ధాన్యం, పండ్లు, కూరగాయలు మన జనాభా అవసరాలను తీర్చగలిగేలా ఆయా పట్టణాలు, గ్రామాలవారీగా ప్రణాళిక రూపొందించేలా కార్యాచరణ చేస్తున్నట్టు తెలిపారు.

# జోరుగా వరి కోతలు

- యంత్రాలకు డిమాండ్.. గంటకు రూ.3,000 కిరాయి
- ఈ ఏడాది 3,406 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- 40 లక్షల టన్నుల్లో ఇప్పటికే 17 లక్షల టన్నుల సేకరణ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. బావులు, బోర్ల కింద వేసిన వరిపంట కోతలు ఇప్పటికే పూర్తయ్యాయి. ప్రాజెక్టుల కింద నాట్లు ఆలస్యం కావడంతో కోతలను రైతులు నవంబర్ చివరివారంలో ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు సమృద్ధిగా పడటం, ప్రాజెక్టుల్లోకి నిండుగా నీరు చేరడంతో అన్నిప్రాంతాల్లో విస్తారంగా వరిసాగు అంతటా ఒకేసారి కోతలు ప్రారంభమయ్యాయి. కూలీల కొరత ఏర్పడటంతో వరికోత యంత్రాలను ఆశ్రయించారు. సాధారణంగా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఏటా వరికోత యంత్రాలను రైతులే అద్దెకు తెస్తారు. ఈ ఏడాది ఆ రాష్ట్రాల్లోనూ అక్టోబర్, నవంబర్‌లో పంటలు కోతకు రావడంతో అక్కడి నుంచి యంత్రాలు రాష్ట్రానికి రాలేదు. దీంతో రాష్ట్రంలో వరి కోత యంత్రాలకు కొరత ఏర్పడింది. దీన్ని స్థానిక యజమానులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. గత ఏడాది పంటకోతకు గంటకు టైర్ల యంత్రానికి రూ.1,200 నుంచి 1,800, చైన్ యంత్రానికి (దిగుడు భూముల్లో కోసేవి) రూ.2200 నుంచి 2,500 వరకు కిరాయిగా తీసుకున్నారు. ప్రస్తుత డిమాండ్‌తో టైర్లయంత్రానికి రూ.2,200, చైన్‌యంత్రానికి రూ.3,000 నుంచి 3,800 వరకు కిరాయి వసూలు చేస్తున్నారు. ఫలితంగా ఎకరం చేను కోతకు సుమారు 2.30 నుంచి 3.30 గంటల వరకు సమయం పడుతుంది. ఎకరానికి రూ.10 వేల వరకు ఖర్చు అవుతుందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూలీలతో వరి కోతలు కోయిస్తే ఎకరానికి రూ.4 వేలు కూడా ఖర్చయ్యేది కాదని, గడ్డి కూడా పశువులకు ఉపయోగపడేదని రైతులు చెప్తున్నారు.

### పెరిగిన మద్దతు ధర

మద్దతు ధర కల్పనకు వ్యవసాయ మార్కెట్లలో, పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. రాష్ట్రంలో ఈ ఏడాది 3,406 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశారు. 17 శాతం తేమ ఉన్న ధాన్యానికి గిట్టుబాటు ధర లభిస్తున్నది. ఈ ఏడాది 34 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. గత ఏడాదితో పోలిస్తే 8 లక్షల ఎకరాల్లో వరి సాగు పెరిగింది. సాధారణ వరి రకానికి క్వింటాలుకు రూ.1,815, గ్రేడ్ ఏ రకానికి రూ.1,835 మద్దతు ధరను నిర్ణయించారు. ఇవి గత ఏడాదికంటే 3.71 శాతం ఎక్కువ. ఈ ఏడాది 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే రూ.17 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం సేకరించింది.

## రికవరీ కోసం సాగుభూమిని వేలం వేయొద్దు: హైకోర్టు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రుణ రికవరీ కింద సాగు భూములను వేలం వేయరాదని హైకోర్టు స్పష్టంచేసింది. సర్ఫేసీయాక్ట్‌లో దీనికి స్పష్టమైన నిబంధనలున్నా హైదరాబాద్ రుణ రికవరీ ట్రిబ్యునల్-1 ప్రిసైడింగ్ అధికారి పట్టించుకోకుండా బ్యాంకులు, రుణ వితరణ సంస్థలకు అనుకూలంగా ఆదేశాలు ఇస్తున్నారని జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావు, జస్టిస్ కే లక్ష్మణ్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ ఆక్షేపించింది. ఆ ప్రిసైడింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శికి ఆదేశాలిచ్చింది. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం పంథినికి చెందిన ఎస్ఎస్ఆర్ పౌల్ట్రీ ఫాం యజమాని కొక్కుల సుధాకర్ ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ వద్ద పౌల్ట్రీఫాం కోసం రుణం తీసుకున్నారు. బర్డ్‌ఫ్లూ కారణంగా నష్టాలు రావడంతో రుణం చెల్లించలేకపోయారు. దీంతో తాకట్టు భూమిని బ్యాంకు వేలంవేసింది. అయితే, అది వ్యవసాయభూమి కాదంటూ రుణరికవరీ ట్రిబ్యునల్-1 ఆదేశాలు జారీచేయడంపై పిటిషనర్ హైకోర్టులో సవాల్ చేశారు. ట్రిబ్యునల్ తీర్పును పక్కనపెడుతూ రుణమిచ్చిన బ్యాంకు పిటిషనర్‌కు రూ. 10వేల నష్టపరిహారం చెల్లించాలని, వేలం రద్దుచేయాలని హైకోర్టు ఆదేశాలు జారీచేసింది.

# వ్యవసాయం వైపు బాలికల మొగ్గు

- పోలీసు ఉద్యోగాలపై 27శాతం మంది బాలుర ఆసక్తి
- సైకోమెట్రిక్ పరీక్షల్లో మనోగతం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల భవిష్యత్‌పై నిర్వహించిన సైకోమెట్రిక్ పరీక్షల ఫలితాలు ఆసక్తికర విషయాలు బయటపెట్టాయి. ఈ ఫలితాలను మంగళవారం విద్యాశాఖ విడుదలచేసింది. వ్యవసాయం, దాని అనుబంధరంగాలపై 20 శాతం బాలికలు ఆసక్తి చూపారు. వైద్యరంగంపై 17 శాతం మంది విద్యార్థులు మొగ్గు చూపగా.. 27 శాతం మంది బాలురు పోలీసు ఉద్యోగాల వైపు వెళ్లేందుకు ఇష్టపడ్డారు. వ్యవసాయం, అనుబంధరంగాల వైపు వెళ్తామని 15 శాతం, ఇంజినీరింగ్, టెక్నాలజీరంగాన్ని ఎంపికచేసుకొంటామని 11 శాతం మంది చెప్పారు. రక్షణ రంగం వైపు 7 శాతం మంది బాలురే మొగ్గు చూపుతున్నారు. బాలికలు మాత్రం డిఫెన్స్ రంగాన్ని కోరుకోవడం లేదు. 'మై చాయిస్.. మై ఫ్యూచర్' పేరుతో 72 రకాల ప్రశ్నలతో దాదాపు 18 వేల మంది మోడల్ స్కూళ్లకు చెందిన టెన్త్ విద్యార్థులకు సైకోమెట్రిక్ పరీక్షలు నిర్వహించారు. ఐఐటీ మద్రాస్ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేక కార్యాచరణతో రెండు నెలలపాటు సర్వే నిర్వహించారు. భవిష్యత్ రిస్క్ తీసుకోకుండా ఉండాలని మెజార్టీ విద్యార్థులు భావించారు. తక్కువ రిస్క్ 61 శాతం, ఎక్కువ రిస్క్‌కు ఇష్టపడిన వారు రెండుశాతమే ఉన్నారు. పోలీసు, వ్యవసాయం, ఇంజినీరింగ్. టెక్నాలజీ, వైద్యారోగ్యం, స్పోర్ట్స్, డిఫెన్స్, ప్రభుత్వ ఉద్యోగాలు, పరిపాలన రంగాల్లో స్థిరపడేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపారు.






కరీంనగర్

నమస్తే తెలంగాణ

# జిందగీ

బుధవారం 4 డిసెంబర్ 2019 WWW.NTNEWS.COM /nt.zindagi



అప్పుడెప్పుడో గాంధీ గారి గురించి ఓ మాట విన్నాను. అతని ఊరు పోరు బందరు.. ఊరి పేరులోనే పోరుందని దడిచేరు కొందరు అని. నువ్వూ అలాగే కదా 'సమ' అన్న పదాన్ని పేరులో పెట్టుకున్నదానివి. సమవర్తిగా న్యాయాన్యాయాలు సరిచూసుకోవాల్సిందానివి. సంగమ స్థలిగా, కూడలిగా, విభిన్న వర్గాలను - వర్ణాలను కలిపి ఉంచే చైతన్య ప్రకాశం నువ్వు. మరి నువ్వే గతి తప్పితే ఎలాగమ్మా? పంచభూతాలు ఆక్రోశిస్తాయి. సృష్టి తన పంజా విసిరి ఈ ప్రపంచాన్ని అంతం చేసి సరికొత్త జీవజాలానికి మళ్లీ పురుడు పోస్తుంది. అందుకే నువ్వు తార్కికంగా, మానవీయంగా, శాస్త్రీయంగా ఆలోచించి కాస్త మా ఈ అసమాన తల్లి, అన్యాయాల్ని, అత్యాచారాల్ని అమానవీయతల్ని సరిదిద్ది మానవాళిని కాపాడవా...

# సమాజమా..! వింటున్నావా..?

ఏమిటీ.. అలా తెల్లమొఖం వేసుకొని నా వంక చూస్తున్నావు. నేనెవరో నీకింకా అర్థం కావట్లేదా? జస్టిస్ ఫర్ దిశని. అంత తేలిగ్గా మర్చిపోయే విషయమా నా జీవితం. ఐనా నీకు తెలియంది ఏముంది చెప్పు. పసిపిల్లల మీద అత్యాచారాలు, అతివలపట్ల అమానవీయత, ఉమెన్ ట్రాఫికింగ్ లేనిరోజు కనిపిస్తున్నదా! అసలు ఈ మాటలు రాస్తుంటేనే గుండె పగులుతున్నది తెలుసా.. ఎంత నికృష్టం కాకపోతే ఇలాంటి ఆలోచనలు మెదడులో మొలుస్తాయ్ చెప్పు!

**అమ్మంటే కష్టాలకు,కన్నీళ్ళకు వీలునామాకాదు**
**కల్మషంలేని ప్రేమకు చిరునామా...**
**కోడలంటే కూడికల తీసివేతల లెక్కకాదు**
**మన వాకిట్లో పెరిగే తులసి మొక్క...**
**భార్య అంటే దించేసుకునే బరువుకాదు**
**మన ఇంట్లో వెలిసిన కల్పతరువు...**
**కూతురంటే భద్రంగా చూడాల్సిన గాజుబొమ్మ కాదు**
**మన కడుపున పుట్టిన మన అమ్మ** అని నా పోయెట్ ఫ్రెండ్‌లా ఎందుకు ఆలోచించరు? కడుపులో నవమాసాలు మోసిన అమ్మ ఋణం కూతురు రూపంలో మనం తీర్చుకుంటామని చాలామంది నమ్ముతారు. ప్రతి స్త్రీ ఓ వ్యక్తికి భార్యగానో, మరో బిడ్డకు తల్లిగానో, మరొక వ్యక్తికి కూతురుగానో, ఇంకో వ్యక్తికి తోబుట్టువుగానో ఉండే ఉంటుందిగా.. మరి మీ కూతురిలా పవిత్రంగా – మీ భార్యంత గౌరవంగా – మీ అమ్మంత ప్రేమగా – మీ తోబుట్టువంత ఆదరంగా వాళ్ళతో ఉండవెందుకని ఈ మగాళ్ళని అడగవెందుకు సమాజమా? కూతురు ఒక్కక్షణం ఏడిస్తేనే తల్లడిల్లే ఓ తండ్రి హృదయం అతనికి నిజంగా ఉన్నట్లయితే మరో తండ్రి గుండె ఆగిపోయే పని ఎందుకు చేస్తాడు? ఏ అన్న అయినా తన చెల్లిని నిజాయితీగా గౌరవించి ఉంటే మరొకరి చెల్లి పట్ల అంత ఘోరంగా ఎందుకు ప్రవర్తిస్తాడు? ఒక తమ్ముడే కనుక నిండుగా నవ్వే అక్కని తేరిపార ఎప్పుడైనా చూసి ఉంటే ఆ నవ్వును ఎందుకు మరో తమ్ముడి అక్క నుండి దూరం చేయాలనుకుంటాడు.. అందరూ అందరి మగాళ్లకు రక్తసంబంధీకులేగా.. మరి పాము తన పిల్లల్ని తానే చంపుకొన్నంత హేయంగా ఈ అఘాయిత్యాలు, అత్యాచారాలు ఏమిటి? కామానికి లజ్జ, గౌరవం, ఉచితానురీతులు గుర్తుకురావా? అసలు ఏమిటి నేను చేసిన తప్పు? అందంగా పుట్టడమా.. ఆడపిల్లగా బతకడమా.. మనుషుల్ని నమ్మడమా? నా పని నేను చేసుకుంటూ నీకు సేవ చేస్తూనే ఉన్నానుగా.. నేను చూసే పశువులకన్నా క్రూరంగా మనుషులు ప్రవర్తిస్తుంటారని ఎరక్కపోవడం నా తప్పా.. నాకర్థంకావడం లేదు సమాజమా, తెలిస్తే నువ్వయినా సమాధానం చెప్పవూ.. యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా – అంటూ నిరంతరం చదువుకొనే మనం– సనాతనమైన ఆ సంప్రదాయాన్ని పక్కకుతోసి ఇంతగా కుళ్లిపోయిన ఈ విచ్చలవిడి అత్యాచారాల జోలికి ఎందుకువెళ్తున్నాం? వేదాలు వెలసిన పుణ్య భూమిలో పుట్టినవారు మహిళల్ని అమ్మి పోగేసుకున్న డబ్బుల్తో జీవనాన్ని సాగించేంతగా దిగజారిపోయి, దైన్యంలో పడిపోతున్నాడా అనిపిస్తున్నది. ఈ కలియుగంలోని కీచకులు, రావణులు, దుశ్శాసనులు ఎన్నో రూపాల్లో ఎక్కడెక్కడో చేస్తున్న ఈ నిరంతర క్రూర పర్వాలకు విముక్తి లేదా? నిర్భయంగా పసిపిల్లలు, ఆడవాళ్లు తిరగ్గలిగే రోజులు రావా? ఎన్నేండ్లుగానో ఎదురు చూస్తున్నాం తెల్సా.. ఉందిలే మంచికాలం ముందుముందునా అని. ఆ కాలం అసలు వస్తుందంటావా? పురిటిబిడ్డ మీద పాపిష్టి కళ్ళు పడ్డం ఏమిటీ!? నెలన్నర పాప మీద అత్యాచారమా..! 9 నెలల పాపని పొత్తిళ్ల నుండి ఎత్తుకెళ్లి కిరాతక క్రియలతో హింసించి, చంపి భుజాన వేసుకొని నడిచొచ్చే దుర్మార్గుల్ని చూశాక ఇక పిల్లలకి, మహిళలకి రక్షణ ఉందా ఈ నేల మీద అనిపిస్తున్నది. గొంతు చించుకొని అరిచి, గల్లాపట్టి నిలదీయాలనిపిస్తుంది. కానీ నాకు రూపం లేదుగా.. ఎలా నా ఉక్రోషాన్ని తీర్చుకోను. అత్యాచారం జరగని రోజు రావాలని – అత్యాచారాల వార్తలు లేని దినపత్రిక చూడాలని ప్రతి మహిళా ఆశపడుతుంది. అలాగే నేనూ అనుకున్నాను. కానీ నేనే పతాక శీర్షిక అవుతాననుకున్నానా? నాలాంటి ఆడపిల్లల కన్నీళ్లు జీవనదులై పొంగుతుంటే నిజమైన వరదొచ్చి ఈ పాడులోకం కొట్టుకుపోదా– ఎందుకింత నిర్లక్ష్యం, ఉపేక్ష, వెకిలితనాలు? మహిళలకోసం, పిల్లలకోసం ప్రత్యేక భద్రాగారాలు తెరవలేమా – ధర్మాగ్రహంతో ఈ కీచకుల్ని కారాగారాల పాలు చెయ్యలేమా?

మా తల్లుల కడుపుకోత ఎవరు తీర్చాలి– ఇన్ని శిక్షలు పడుతున్నా నేరాలు తగ్గాల్సింది పోయి పెరుగుతున్నాయెందుకు? ఇంట్లోనే విచ్చలవిడిగా చొరబడ్తున్న టీవీల్లోని అశ్లీల రేప్‌లు.. నీలి చిత్రాల మాయాజాలమా ఇది? విచ్చలవిడిగా దొరుకుతున్న డ్రగ్స్, పెచ్చుమీరిన పాశ్చాత్య ధోరణులదా ఈ తప్పంతా.. ఎక్కడికి పోతున్నావు సమాజమా?! నీడనుకుని.. కాపాడుతుందని నమ్మి చెంతనిలిస్తే పాము పడగై కాటేస్తున్న మానవత్వం, తోడనుకుని ఆదరిస్తే నల్ల తేలై కరిచిన బాంధవ్యం– ఎవర్ని నమ్మాలో, ఎవర్ని నమ్మకూడదో తెలియడం లేదు. అసలు స్త్రీని భోగవస్తువనో, కతి తీర్చుకునే కామకేళి అనో ఎందుకనుకుంటున్నారు ఈ మగవాళ్ళు? స్త్రీ అంటే మనకు మాత్రమే కాదు.. ఈ లోకానికే అమ్మ – అన్న స్పృహ ఎందుకురావడం లేదు.. నీ లోపల ఏమి జరుగుతున్నదో నీకేమైనా అర్థమౌతున్నదా సమాజమా.. ఈ క్యాన్సర్ నిన్నెంతగా బలహీన పరుస్తుందో ఇప్పటికైనా గ్రహించు. ఆకాశంలో సగం అంటున్నారు.. అవనిలో సగం అంటున్నారు ఆనందాల్లో సగం ఇవ్వకపోగా అవమానాలు మాత్రం హెచ్చుగానే చేస్తున్నారు. ఆత్మగౌరవాన్ని అందించకపోగా అడుగడుగునా విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఇదేనా మేమంతా ఉన్న నీ రూపం?

మాకేది సౌకర్యంగా, సదుపాయంగా ఉందో ఆ బట్టలేసుకొంటే రెచ్చగొట్టేలా వస్త్రధారణ ఉందని.. అందుకే పురుషులు టెంప్ట్ అయిపోయి అత్యాచారాలు చేస్తున్నారని– పుచ్చిపోయిన మెదళ్లు కొన్ని తమ జాతిని సపోర్ట్ చేస్తున్నాయ్. ఒంటినిండా బట్టలేసుకున్న నేనేమి రెచ్చగొట్టాను అని నువ్వు అడగవేమి? ఒకటి–రెండు నెలల పాప ఏ బట్టలేసుకొని రెచ్చగొట్టిందని మరోమారు అడుగు సమాజమా? పసిమొగ్గల్లో పరువాన్ని చూసే పాపాత్ముల్ని ఏమనాలి.. తాగి రాక్షసుల్లా నన్ను హింసించడమే కాక పెట్రోల్ పోసి తగలేస్తారా..? వీళ్ళా మన పౌరులు.. మనతో బతికే సహవాసులు.. సంఘజీవులు? అవునా? మనుష్యజాతిని కబళించే ఈ దుష్టగ్రహాలకి, మానవత్వాన్ని ప్రశ్నార్థకం చేస్తున్న ఈ నరరూప రాక్షసులకి ఏ చట్టం కావాలి? ఎన్ని శిక్షలు వేయాలి?! నా అక్క నిర్భయ ఉదంతం జరిగినప్పుడు దేశమంతా తమ ఆడబిడ్డకే దురన్యాయం జరిగినట్టు తల్లడిల్లిపోయారు. నేను ఉద్యమస్ఫూర్తితో ముందుకు కదిలాను ఆ అలజడి ఒక చట్ట రూపకల్పనకి దారి తీసి వేలమంది బాధితుల కంటి నీరు తుడవడానికి, మృగాళ్లని కారాగారాల పాలు చేయడానికి దోహదం చేసింది. నిజమే కదా– మాంసానికి అలవాటు పడ్డ పులులు సభ్య సమాజంలో ఉండే అర్హతను కోల్పోతాయి. వీళ్లూ అంతే అనుకున్నాను.. కానీ ఇంకా వాళ్లకి మరణశిక్ష అమలు పరిచారా.. లేదే.. ఎందుకు?. నిస్సహాయ పసిపిల్లలతోనూ, కౌమార ఆడపిల్లలతోనూ అసభ్యంగా ప్రవర్తిస్తూ అదును చూసి పంజా విసిరి కబళించే క్రూరమృగాలు.. వీళ్ళ తరపున వాదించడానికి ఏ న్యాయం ఉంది? వీరికి బాసటగా నిలబడటానికి.. వీళ్ళకి అండగా ఉండడానికి సంస్కరణలు కుటుంబాలనుండే మొదలవ్వాలి. కుటుంబమే ఓ చిన్న సమాజం అక్కడే తప్పుల్ని సరిదిద్దుకో గలిగితే శాంతి ప్రపంచమంతా నిండుతుంది. ఉదాహరణకి షుగర్ బాధితుడికి వేలు పుచ్చిపోయి కాలుకి పాకితే కాలు తీసేస్తున్నామా లేదా? అయ్యో నా కాలా అని ఏడుస్తున్నామా. ఇదీ అంతే. మనింట్లో మన పిల్లోడు దారి తప్పితే చెడిపోయిన వాడిని మంచి మాటలతో దారికైనా తేవాలి లేదా పోలీస్‌స్టేషన్లలో అయినా అప్పచెప్పాలి. మన మమకారం మరోకుటుంబానికి శాపంగా మారకూడదు.. మరి దీని మూలంగా కేసులు తగ్గాలి కదా – ఎందుకు పెరుగుతున్నాయి. అంటే మనం సరైన దారిలో వెళ్ళడం లేదనేగా అర్థం.. ఆడదాని బలహీనత పిల్లలు వాళ్ళ భవిష్యత్, మగవాడి ధైర్యం అర్థబలం, అంగ బలం, మగవాడినన్న అహం నాకు పిల్లలకి ఏంకాదన్న విశ్వాసం కల్గిస్తే చాలు.. ఏంచేసినా చెల్లిపోతుందిలే అనే మగ అహంకారాన్ని దెబ్బ కొడితే చాలు – ఒక్కసారి అయిన మంచి దారిలో నువ్వు నడిచినట్లే.

వెంటాడే చూపు వేటాడే తలపు.. కామస్పర్థ, చెరపట్టిన చేవ మెలితిప్పే నొప్పి.. పైకి చెప్పలేని వేదన, లోకం పట్ల ఏవగింపు కలిగేలా మేం బతకాలా? అంగాంగాల్ని నలిపేసే ఆరాచకత్వం పెరుగుతుంటే వెయ్యాల్సింది సిగ్గుబిల్లలా, ఇనప కచ్చడాల అంగవస్త్రాలా? ఇంత నిర్లజ్జగా తెగిస్తే చట్టాలు, కోర్టులు, శిక్షలు అవసరమా అంటున్నారు. కానీ, మోరల్ పోలీసింగ్– కమ్యూనిటీ పోలిసింగ్ కావాలన్నదే కదా మన కోరిక కూడా. ఇంద్రుడి వందకళ్ళని తెచ్చుకుని ప్రతి అమ్మ కాపలా ఉండాలా మా మానసంరక్షణార్థం – కృష్ణుడు ద్రౌపదికి చీర అందించినట్టు ఎవరో వస్తారని ఎదురు చూస్తూ బతకాలా ఇంకా? మనల్ని మనం నియంత్రించుకోలేమా? మగాడి ఆలోచనల్ని సరైన దారిలో పెట్టలేమా? పెంపకం నుంచే పరివర్తన తేలేమా? నిజమే సమాజమా! మనుషులు మృగాళ్లుగా మారుతున్నారంటే నువ్వూ, నేను, మనమంతా కారణమే. ఒక పిల్లాడిని మంచి పౌరుడిగా తీర్చిదిద్దడానికి ఊరుకి ఊరే కావాల్సి వస్తుందంటారు. కానీ ఒక పిల్లవాడు దుర్మార్గుడిగా, కిరాతకుడిగా తయారుకావడానికి మాత్రం విచ్ఛిన్నమైన, విశృంఖలమైన కుటుంబ నేపథ్యం, అశ్లీల దృశ్యాల వీక్షణలు కీలకమైన కారణాలు. నిజం.. మత్తుమందులు, అశ్లీల చిత్రాలు మనిషి విచక్షణని దెబ్బతీస్తాయి. ఏం చేస్తున్నామో తెలియని ఉద్రేకాన్ని నింపేస్తాయి. తమాయించుకునే గుణాన్ని, నియంత్రించుకోగల సామర్థ్యాన్ని కాలరాస్తాయి.

చట్టాలు ఆడవాళ్ళకు ఎన్నో రక్షక వలయాల్ని ఏర్పాటు చేశాయి. అడుగడుగునా అండగా నిలిచాయి. కానీ ఎంతమందికి చట్టం పట్ల అవగాహన ఉంది? అసలు తమ రక్షణ కోసం ఉన్న చట్టాలు ఏమిటో అన్న చైతన్యం కూడా లేకపోవడం బాధాకరం. నువ్వు కాస్త ఆ చైతన్య యాత్రలు– అవగాహనా శిబిరాలు పెట్టవా సమాజమా? అయినా నా పిచ్చి గానీ, నా ప్రియ సమాజమా! చట్టాలు, శిక్షలు ఎన్ని ఉన్నా మనుషుల్లో – ముఖ్యంగా మగాళ్లలో మార్పు రానంత వరకూ, మాలో ఆ చైతన్యం, బాధ్యతాయుత వైఖరులు రూపొందేవరకూ ఇవన్నీ కాగితపు రాతలుగానే మిగులుతాయి. ముందు మా మైండ్ సెట్స్ మార్చు. యుగాలు, తరాలు గడిచినా, రాజ్యాలు, సామ్రాజ్యాలు మారినా, చట్టాల తీవ్రత పెరిగినా నేరాలు ఎప్పటికప్పుడు కొత్త ముసుగులతో కొత్త అవతారాలు ఎత్తుతూనే వచ్చాయి. ఇది నీకు తెలిసినంతగా మరెవరికీ తెలీదు కదా.. అందుకే, ఆడబిడ్డ అస్తిత్వానికి గౌరవం రావాలన్నా, ఆమె ఆత్మగౌరవంతో మనుగడ సాగించాలన్నా మార్పు రావాల్సింది మొదట నీలోనే.. మనుషులు, మగాళ్ళందరి సామూహిక మనస్తత్వాన్ని పెంచి, పోషించి, పాలించి, శాసించిన నీ నుండే ఆ దృక్కోణం మారాలి. నా ప్రియాతి ప్రియమైన సమాజమా! 'దేవుని తర్వాత అంత శక్తిమంతమైనది సమాజం' అని ఒక వేదాంతి చెప్పింది నీకున్న ప్రభావతత్వాన్ని పునరుద్ఘాటించేదే కదా! అలాగే, వ్యక్తితో సమాజం మారుతుందా? సమాజంతో వ్యక్తి మారతాడా? వ్యక్తి కన్నా సమాజమే – నువ్వే బలమైన దానివని ప్రపంచానికి చాటే సమయం ఇప్పుడు ఆసన్నమైంది. నిన్ను మించిన పాఠశాల గానీ, ప్రయోగశాల గానీ లేదని ఎందరో ఎప్పటి నుంచో చెప్తూ వచ్చారు. ఆ మాటలను రుజువు చేసే క్షణం ఇదే. ఇక, లే.. నీ పాజిటివ్ ముఖాన్ని చూపించు. నీ సంప్రదాయాల జూలు విదుల్చు. నీ జీవన విలువల రెక్కలు కదుల్చు.. నీ మానవతా నియమాల చూపులను ప్రసరించు.. నీ విశ్వ సౌభ్రాతృత్వ హస్తాలను అందించు.. నీ ఆదర్శ ఆశయాల నడకలను ఈ మనుషులకు నేర్పించు.. వారందరినీ బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దు.. ఒక నిర్భయ.. మరో అబల.. ఇంకో అసిఫా.. మరో స్వప్నికా.. ప్రత్యూషా.. మానస.. పేరులో ఏముంది .. అందరం బాధితులమే .. మా అందరి చావు నీకు కనువిప్పు కావాలి.. ఇకనైనా కళ్ళు తెరువు. మానవ జాతి బతకాలంటే ముందు ఆడది బతకాలన్న స్పృహ తెచ్చుకో. మగవాడు ఏమి చేసినా ఒప్పే అన్న సంకుచిత భావనలోంచి బయట పడి మానవతను కాపాడు.. నిన్ను నువ్వు కాపాడుకో. సమాజమా, నా అవశ్యక నేస్తమా.. నా విన్నపాన్ని ఆలకించు.. నవ మానవ లోకాన్ని సృష్టించు.

...✍ శ్రీలక్ష్మి ఐనంపూడి

> **పాలక పక్షానిదే తప్పని ప్రతిపక్షాలు..**
> **పోలీసులదే తప్పని ప్రజా పక్షాలు..**
> **పెంపకాలే తప్పని పెద్దవాళ్లు..**
> **మమ్మల్ని ప్రేమించడం లేదని పిన్నవాళ్లు..**
> **ఇలా తిలా పాపం తలా పిడికెడు పంచుకుంటున్నారే కానీ, ఇది సామూహికంగా నీ సమిష్టి తప్పని ఒప్పుకోవడానికి నామోషీ ఎందుకు సమాజమా?**
> **ఎప్పుడు అత్యాచారం జరిగినా ఎవరో ఒకరిని బలి చెయ్యడం తప్ప.. నిన్ను నీవు సరిచేసుకునే ఆత్మ పరిశీలనను ఎప్పుడూ చేసుకోవా..?!**

> అసలు ఏమిటి నేను చేసిన తప్పు? అందంగా పుట్టడమా.. ఆడపిల్లగా బతకడమా.. మనుషుల్ని నమ్మడమా? నా పని నేను చేసుకుంటూ నీకు సేవ చేస్తూనే ఉన్నానుగా.. నేను చూసే పశువుల కన్నా క్రూరంగా మనుషులు ప్రవర్తిస్తుంటారని ఎరక్కపోవడం నా తప్పా.. నాకర్థంకావడం లేదు సమాజమా, తెలిస్తే నువ్వయినా సమాధానం చెప్పవూ..

> అంగాంగాల్ని నలిపేసే ఆరాచకత్వం పెరుగుతుంటే వెయ్యాల్సింది సిగ్గుబిల్లలా, ఇనప కచ్చడాల అంగవస్త్రాలా? ఇంత నిర్లజ్జగా తెగిస్తే చట్టాలు, కోర్టులు, శిక్షలు అవసరమా అంటున్నారు. కానీ, మోరల్ పోలీసింగ్- కమ్యూనిటీ పోలిసింగ్ కావాలన్నదే కదా మన కోరిక కూడా.



## ఈ చట్టాలు తెలుసా?

1. సెక్షన్ 100 ప్రకారం ఆత్మరక్షణ కోసం దాడి చేసినప్పుడు ఎదుటి వ్యక్తి చనిపోయినా తప్పులేదని, శిక్ష పడదని చెబుతున్నది.
2. 116 (బి) సెక్షన్ ప్రకారం బాధితురాలికి హాస్పిటల్లో చికిత్స చేయకపోతే అది పనిషబుల్.
3. అత్యాచార బాధిత మహిళ అనుమతి లేకుండా మీడియా ఆమె పేరు, ఫొటోలు ప్రచురిస్తే, చూపిస్తే 228 సెక్షన్ ప్రకారం ఆయా సంస్థలు బాధ్యత వహించాలి.
4. 354 సెక్షన్ ప్రకారం స్త్రీని వక్రదృష్టితో చూసినా, తాకినా, అవమాన పరిచినా, ఫొటో–వీడియోలు తీసినా ఆ బాధితులు ఫిర్యాదు చేయొచ్చు. బట్టలు తొలగించే చర్య చేస్తే 354 (డి) సెక్షన్ ప్రకారం 3 నుంచి 7 యేండ్ల ఖైదు పడుతుంది.
5. 18 యేండ్ల లోపు అమ్మాయితో సెక్స్‌లో పాల్గొంటే, అది ఆమె అంగీకారంతోనే అయినా కూడా 376 సెక్షన్ ప్రకారం నేరం. అందుకు ఏడేండ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తారు.
6. 509 సెక్షన్ ప్రకారం సైగలు చేసినా, అది అవమానం చేసినట్లు భావించి శిక్షిస్తారు.
7. ఫొటో మార్ఫింగ్ చేస్తే 499 సెక్షన్ ప్రకారం శిక్షార్హమే.
8. 18 ఏళ్ల బాలికను అమ్మినా, కొనుగోలు చేసినా పదేండ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారు.
9. 376 (డి) సెక్షన్ ప్రకారం సామూహిక అత్యాచారాల విషయంలో.. ఒకరి మీద ఎక్కువ మంది సామూహికంగా అత్యాచారం చేస్తే జీవిత ఖైదు విధించవచ్చు.
10. 366 (ఏ) ప్రకారం మైనర్ బాలికను వ్యభిచార కూపంలోకి దించినా, లైంగికంగా ప్రలోభ పెట్టినా పదేండ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. నాన్ బెయిలబుల్‌గా కేసు నమోదు చేస్తారు.
11. బలవంతంగా ఎత్తుకెళ్లినా, పెళ్లి చేసుకున్నా పదేండ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తారు.

# శునకాలను కాపాడే కాలర్లు!





**చీకట్లో ప్రయాణం చేస్తున్న వాహనాలు, ఐదు సెకన్లముందు రోడ్డుమీద పడుకొని ఉన్న శునకాల్ని గుర్తించగలిగితే చాలు. ప్రమాదాన్ని ఆపవచ్చు. అందుకు ఓ పరిష్కారం కనుగొన్నాడు. దీనికి రతన్ టాటా సహాయం కోరాడు. ఆ పరిష్కారానికి రతన్ టాటా ఏం సహాయం చేశాడు?**

పూణెకు చెందిన షాంతను నాయుడు ఆటోమోటివ్ డిజైన్ ఇంజినీర్. ప్రమాదవశాత్తు ఒకరోజు చీకటిలో పడుకొని ఉన్న శునకం మీదకు కారు దూసుకువెళ్లింది. కళ్లముందు జరిగిన అలాంటి దుర్ఘటనలకు స్వస్తి పలకాలనుకున్నాడు. అతను ఆటోమోటివ్ డిజైన్ ఇంజినీర్ కాబట్టి కార్లపై ఉపయోగించే రిఫ్లెక్టివ్ టేపుల మీద అవగాహన ఉన్నది. దీన్ని డాగ్ కాలర్ నమూనా ప్రతిబింబం టేపుతో రూపొందించడానికి సహాయడపడుతుంది. అందుకు తన ఫ్రెండ్స్ మద్దతు పలికారు. వీరివద్ద సరిపడా డబ్బు లేదు. ఈ రోజుల్లో ప్రతిఒక్కరి ఇంట్లోని అల్మరాల్లో ధరించని డెనిమ్ దుస్తులు ఉంటాయి. వాటిని సేకరించి ప్రోటోటైప్‌లను నిర్మించారు. 2014 చివరి నాటికి డెనిమ్ విరాళం ప్రచారాన్ని ప్రారంభించారు. విరాళం ఇవ్వడానికి చాలామంది ముందుకు వచ్చారు. ఆ డబ్బుతో 500 కాలర్లు తయారు చేశారు. నగరంలో మోటార్‌సైకిల్ రైడింగ్‌గ్రూపుల సహాయంతో అవగాహనా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కుక్కలకు కాలర్ చేయడం గురించి చెప్పారు. దీంతో శునకాలు చాలా ప్రమాదాల నుంచి బయటపడ్డాయని ప్రజలు చెప్పారు. 2015 నాటికి అతని స్నేహితులతో 'మోటోపాస్' అనే జంతువుల సంక్షేమ ఎన్జీఓను కుక్కలకు అంకితం చేశారు. నెలలు గడుస్తున్న కొద్ది ఈ కాలర్‌లకు డిమాండ్ పెరుగుతున్నది. తయారు చేసేందుకు నిధులు లేవు. ఏం తోచని పరిస్థితుల్లో జంతువులను ఎంతగానో ప్రేమించే ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటాకు లేఖ రాయమని నాయుడు తండ్రి సలహా ఇచ్చాడు. హృదయపూర్వకంగా లేఖ రాశాడు. రెండు నెలల తర్వాత నాయుడుని కలవాలంటూ టాటా సమాధానం ఇచ్చాడు. 2015 ఏడాది చివరిలో ఆయన్ని కలిసి సాయం అందుకున్నాడు. ఇప్పుడు ఆ ఎన్జీఓ 11 నగరాలు భారత దేశం, నేపాల్, మలేషియా మూడు దేశాలకు విస్తరించింది. వలంటీర్లు ప్రతిరోజూ కుక్కలను కాలరింగ్ చేస్తారు. డెనిమ్‌ను ఉపయోగించకుండా సూపర్‌లైట్ ఇండస్ట్రియల్ ఫ్లోరోసెంట్ ఆరెంజ్‌ను ఉపయోగించాలని నిర్ణయించుకున్నారు. దీనికి వాటర్‌ప్రూఫ్ ఉంటుంది. నెలకు 1000–1500 డాగ్‌కాలర్లను తయారు చేస్తున్నారు. ఖర్చు ధరకే వీటిని విక్రయిస్తున్నారు. ఇప్పుడిది వేలాది కుక్కల ప్రాణాలను రక్షించే ఉద్యమంగా మారిపోయింది.

# ముక్కులోంచి రక్తం కారుతున్నదా?



**కొందరికి తరచూ ముక్కుల్లోంచి రక్తం కారుతుంటుంది. ముఖ్యంగా చిన్నపిల్లలకు ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. ముక్కులోంచి రక్తం కారుతుంటే పెద్దగా టెన్షన్ పడాల్సిన పనేం లేదు. ఈ చిన్న చిట్కాలు పాటిస్తే చాలు.**

- మెడను మంచం అంచుకు చేర్చి తలను వెనక్కు వాల్చాలి. అప్పుడు రక్తం బయటకు పొంగి రాకుండా ఆగుతుంది. ఏ ముక్కు రంధ్రంలోంచి రక్తం కారుతుందో ఆ వైపున కంటికి కిందుగా మూక్కుదూలం మూలమీద గట్టిగా నొక్కి పట్టాలి. వెంటనే రక్తం కారడం ఆగుతుంది.
- దానిమ్మ పూలను దంచి, రసం తీసి ముక్కులో చుక్కలు వేయాలి. గరికగడ్డి వేళ్లను శుభ్రం చేసి, మెత్తగా దంచి ఆ రసాన్ని చుక్కలుగా వేసినా రక్తం ఆగుతుంది. ఎర్ర ఉల్లిపాయలు దంచి ఆ రసాన్ని ముక్కులో వేస్తే రక్తం ఆగుతుంది.
- పెద్ద సైజులో ఉండే ఉసిరి కాయలు తెచ్చి వాటిని మెత్తగా దంచి ఆ గుజ్జును తలకు పట్టిస్తే ఒంటికి చలువ ఏర్పడుతుంది. రక్తం కారడం ఆగిపోతుంది.
- అడ్డసరం పువ్వుల్ని మెత్తగా దంచి, నేతిలో వేయించి, పంచదార పాకం పట్టుకొని తేనె కలుపుకొని ఒకట్రెండు చెంచాల మోతాదులో రెండు పూటలా రోజూ తీసుకుంటే ముక్కులోంచి రక్తం కారడం ఆగుతుంది.
- ముందు తలను పైకి లేపాలి. మెత్తటి బట్టలో ఐస్ ముక్కలను చుట్టి ముక్కుపైన ఉంచాలి. ఇలా 4–5 నిమిషాల పాటు పెడుతూ తీస్తూ ఉంటే రక్తం కారడం ఆగుతుంది. ఈ విధానాన్ని రోజులో రెండు మూడు సార్లు ప్రయత్నిస్తే మంచిది. ఐస్ ముక్కల వల్ల కలిగే చల్లదనం రక్తం గడ్డకట్టే సమయాన్ని తగ్గిస్తుంది. ఫలితంగా రక్తం కారడం త్వరగా ఆగిపోతుంది.

## వంటింటి చిట్కాలు



- కోడిగుడ్లు ఉడికేటప్పుడు పగులుతుంటే, ముందురోజు రాత్రి ఫ్రిజ్‌లో ఉంచాలి. ఉదయాన్నే తీసి ఉడికిస్తే పగులకుండా ఉంటుంది. పైన పెంకు కూడా సులువుగా ఊడివస్తుంది.
- అలాగే కోడిగుడ్డు ఉడకబెట్టేటప్పుడు నీటిలో కొంచెం ఉప్పు వేయండి. దీనివల్ల కోడిగుడ్డు చప్పగా లేకుండా ఉప్పగా అనిపిస్తుంది.
- ఇంట్లో చేపలకూర చేసినప్పుడు వంటగది మొత్తం వాసనతో నిండిపోతుంది. దీన్ని తరిమికొట్టేందుకు సాంబ్రాణి పొగ వేయండి.
- సాంబ్రాణితో ఇల్లంతా సువాసన సంతరించుకుంటుంది. దీనికి బదులుగా కర్పూరం కూడా వాడొచ్చు.
- గుడ్డు పెంకులను పడేయకుండా వాటిలో మట్టి నింపి నారుపోస్తే చిన్నమొక్కలు మొలకెత్తుతాయి.
- మొలకలు మొలిచిన తర్వాత పెంకుల్ని పీకి బాల్కనీలో నాటుకోవాలి.

నమస్తే తెలంగాణ
# యువ
[ కరీంనగర్ ]
బుధవారం 4 డిసెంబర్ 2019

**ఏం డైలాగ్ గురూ..**

చిన్నప్పుడు నీకు నడకరాక పడిపోతుంటే పట్టుకున్నాను.. 30 ఏళ్లకు తాగొచ్చి నడవలేక పడిపోతుంటే పట్టుకున్నాను. తండ్రిని కదా నువ్వు పడిపోతున్నప్పుడల్లా పట్టుకుంటూనే ఉంటాను.

**సినిమా: మజిలీ**



**నవ్వుకొందాం**

**మల్లీశ్వరి:** ఏవండీ దాహమేస్తుందండీ.

**భర్త:** ఆగవే.. ఇంకో 14 స్టేషన్లు దాటితే మనం దిగేస్తాం. మహా అంటే మూడు గంటలు!

**మల్లీశ్వరి:** (ముఖం ఎర్రగా చేస్తూ) వాటర్ బాటిల్ కొంటారా లేదా?

**భర్త:** సరేలేవే.. వచ్చే స్టేషన్‌లో వాటర్ బాటిల్‌తో పాటు.. వేడి వేడి సమోసాలు, జిలేబీ కూడా తీసుకొస్తా..

**మల్లీశ్వరి:** అబ్బా.. సూపర్.. మీరు చెప్తుంటే నోట్లో నీళ్లూరుతున్నాయండీ..

**భర్త:** కదా.. ఆ నీళ్లే తాగేసెయ్.. దాహం తీరిపోద్ది..

**మంచిమాట**



నా మనసుకు ఎవరు దగ్గరి వారంటే రాజ్యం లేని రాజు.. అడుక్కోవడం రాని పేదవాడు.

– Khalil gebran

**వాట్సప్ మెసేజ్**

ఒకరు నా గురించి చీప్‌గా చెబితే నేను చీప్ అయిపోను. నన్ను పొగిడితే నేను పొంగిపోను. ఎందుకంటే నా గురించి నాకు తెలుసు. నేను ఇది అని ఒకరి ముందు నిరూపించుకోవాల్సిన అవసరం లేదు.

**టెక్నాలెడ్జీ**

## స్యామ్‌సంగ్ నుంచి 'ఏ' సిరీస్

**మొబైల్ బ్రాండ్ స్యామ్‌సంగ్ రానున్న రోజుల్లో 'ఏ' సిరీస్‌తో ఫోన్లను విడుదల చేయనున్నట్టు తెలుస్తున్నది. ఇటీవల వీటికి సంబంధించిన వీడియో ప్రోమోను ఆ కంపెనీ విడుదల చేసింది. డిసెంబర్ 12న 'గెలాక్సీ ఏ51' ఫోన్‌ను విడుదల చేయనున్నదని టెక్ టాక్. దీనికి సంబంధించిన ఫీచర్లను నిపుణులు ఇలా అంచనా వేస్తున్నారు.**

**స్యామ్‌సంగ్ A51 ఫీచర్లు**

**స్క్రీన్:** 6.00 అంగుళాలు
**ప్రాసెసర్:** ఎక్సినాస్ 9611
**ఓఎస్:** ఆండ్రాయిడ్ 10
**ఫ్రంట్ కెమెరా:** 32 ఎంపీలు
**రియర్ కెమెరా :** 48+13+5+5 ఎంపీ కెమెరాలు
**ర్యామ్:** 4జీబీ
**బ్యాటరీ:** 4000 ఎంఏహెచ్




## కొత్త ఫీచర్లు

**ఫేస్‌బుక్, వాట్సాప్‌లో కొత్త ఫీచర్లు వచ్చాయి. యూజర్ల అభిరుచికి తగ్గట్టు ఎప్పటికప్పుడూ ఫీచర్లు మారుస్తున్న సంగతి తెలిసిందే. దీంట్లో భాగంగానే తాజాగా రెండిటిలో కొత్త ఫీచర్లు వచ్చాయి.**




**వాట్సాప్ :** వాట్సాప్‌లో గ్రూప్స్ సాధారణం. స్నేహితులు, సహోద్యోగులు, కుటుంబీకులు ఇలా ఎవరి సర్కిల్‌తో వారు గ్రూపులు ఏర్పాటు చేసుకొంటారు. వాట్సాప్‌లో తాజా ఫీచర్ ఈ గ్రూపులకు సంబంధించినది. ఈ ఫీచర్ ద్వారా గ్రూప్‌లో పెట్టిన మెసేజ్ ఫలాన సమయానికి అది కనబడకుండా చేయవచ్చు. ఉదాహరణకు మీరు పెట్టిన మెసేజ్ గంట తర్వాత గ్రూప్‌లో ఉండొద్దు అంటే దానికి తగ్గట్టు టైంను సెట్ చేసుకొనే అవకాశం ఉంది. 'డిసప్పియర్ మెసేజెస్' పేరుతో ఈ ఫీచర్ వాట్సాప్ బీటా వెర్షన్‌లో అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం ఆండ్రాయిడ్‌లో ఇది ఉంది. త్వరలోనే ఐఓఎస్ యూజర్లకు కూడా అందుబాటులోకి రానుంది.



**ఫేస్‌బుక్ :** ఫేస్‌బుక్‌లో చాలా ఫొటోలు, వీడియోలు యూజర్లకు నచ్చుతాయి. అలా నచ్చిన ఫొటోలను డౌన్‌లోడ్ చేసుకోవడం, వీడియోలను షేర్ చేసుకోవడం సాధారణం. అట్లాగే ఫేస్‌బుక్ మీడియాను బయటకు కూడా షేర్ చేసుకొనే అవకాశం ఉంది. ఇప్పుడు తాజా ఫీచర్ ద్వారా ఫేస్‌బుక్ ఫొటోలను, వీడియోలను నేరుగా గూగుల్ ఫొటోస్‌లో సేవ్ చేసుకోవచ్చు. 'డేటా ట్రాన్స్‌ఫర్ ప్రాజెక్ట్ ' పేరుతో ఫేస్‌బుక్ ఈ టూల్‌ను అందించనున్నది. ఐర్‌ల్యాండ్‌లో ఈ ఫీచర్ అందుబాటులోకి వచ్చింది. కొద్ది రోజుల్లోనే ప్రపంచవ్యాప్త యూజర్లకు అందుబాటులోకి రానుంది.

## యాహూ.. కొత్తగా..




ఒకప్పుడు సెర్చ్ ఇంజిన్‌గా, ఈమెయిల్‌గా క్రేజ్ సంపాదించిన 'యాహూ' ఇప్పుడు కొత్త రూపుదిద్దుకుంటున్నది. సమీప పోటీదారులకు మించిన ఫీచర్లతో అభివృద్ధి చెందుతున్నది. గతంలో విశిష్ట ఆదరణ పొందినట్టుగా ఇప్పుడు యూజర్లను ఆకట్టుకొనే ప్రయత్నాల్లో ఉంది. ఇందులో భాగంగా సరికొత్త ఫీచర్స్‌తో పాటు మొబైల్ యాప్‌ను రీబ్రాండింగ్ చేస్తున్నది. పోటీ సంస్థలు గూగుల్‌కి చెందిన జీమెయిల్, మైక్రోసాఫ్ట్ అవుట్‌లుక్ వంటివి తమ యాప్స్‌ను ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్లు, సర్వీసులతో రీ–బ్రాండ్ చేసుకుంటూనే ఉన్న నేపథ్యంలో యాహూ తాజా ప్రయత్నాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కంటికి ఇంపైన రంగులతో ఈ యాప్స్‌ను తాజాకరించింది. ఈమెయిల్‌లో 1టీబీ ఉచిత స్టోరేజీ సౌకర్యాన్ని కల్పిస్తున్నది. తాజా యాహూ మెయిల్ యాప్‌ను 7 మిలియన్ల యూజర్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. 4.5 స్టార్ రేటింగ్‌ను పొందింది. ప్రస్తుతానికి యాహూ మెయిల్‌కు 276 మిలియన్ల నెలవారి వినియోగదారులు ఉన్నారు. 75 మిలియన్ల మంది యాప్‌ను వాడుతున్నారు.

# తెలుగు సినిమా | అభిమానుల కోసం..











**ఇష్టమైన భోజనం ఆర్డర్ చేయగానే ఇంటికి వస్తుందంటే అది ఒకరికి వచ్చిన 'ఐడియా'.. రంగు రంగుల పూలు సీసాల్లో పెరుగుతున్నాయంటే దాని వెనుక ఓ 'ఐడియా'.. రోడ్లమీద గుంతలు చూపించడానికి 'ఆస్ట్రోనాట్' వచ్చాడంటే అది 'ఐడియా'.. లైసర్ లైట్లలో పేర్లు పరుగెడుతున్నాయంటే అదో ఐడియా డస్ట్‌బిన్‌లో ఉండాల్సిన చెత్త అందంగా తయారై 'షోకేస్ సెల్ఫ్'లో ఉందంటే ఒక 'ఐడియా'.. అందమైన బ్యాగ్ మీద పిచ్చుకలు వస్తున్నాయంటే ఒకరి ఐడియా.. ప్రపంచాన్ని నడిపించేది అన్నిటికన్నా ముందు 'ఐడియా' .. ఆ ఐడియాకు క్రియేటివిటీ జోడైతే.. మీరే ట్రెండ్ సెట్ చేసినవాళ్ల వుతారు. ఇప్పుడు చెప్పకోబోయే 'మ్యాడ్‌మంకీ' ఫ్యాషన్ బ్రాండ్ స్టార్టప్ అచ్చం అలాంటిదే..**



తెలుగు ఫస్ట్ ఫ్యాషన్ బ్రాండ్

**మీ** సర్కిల్‌లో ఎవరైనా తమిళ్, మలయాళం ఫ్రెండ్స్ ఉన్నారా? అయితే ఒక్కసారి వాళ్ల ఫేస్‌బుక్ టైంలైన్ చూడండి. లేదా తమిళ్, కన్నడ, మలయాళంకు సంబంధించిన ఏదైనా ప్రొడక్ట్‌నో, వెబ్‌సైట్‌లో, ఫేస్‌బుక్ పేజీనో చూడండి. అవి దాదాపు ప్రాంతీయ భాషలోనే కనిపిస్తాయి. ఇద్దరు తమిళ్ లేదా మలయాళం ఫ్రెండ్స్ మెసేజులు చేసుకున్నా, కామెంట్స్ రాసుకున్నా వారి ప్రాంతీయ భాషల్లోనే చేస్తారు. కానీ తెలుగు వాళ్ల విషయానికి వస్తే.. అదీ యాస విషయానికి వస్తే.. కొంచెం భిన్నంగా కనిపిస్తుంది. ఎక్కడో వెలితి ఉన్నట్టు అనిపిస్తుంది. కనీసం తెలుగులో ఫేస్‌బుక్ పోస్ట్ కూడా వేయాలనుకోం. 'తెంగ్లిష్' వాడి కలగాపులగం చేసేస్తాం.. ఇలాంటి వాటిని చాలా దగ్గర నుంచి చేశాడు 'అవినాష్' అనే హైదరాబాద్ యువకుడు.




గ్రాఫిక్ డిజైనర్‌గా డిగ్రీ చేసిన అవినాష్.. హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్లాడు. కొన్ని రోజులు అక్కడ డిజైనింగ్‌లో పని చేశాడు. అక్కడ లాంగ్వేజ్ కల్చర్‌ను ఎక్కువ పరిశీలించాడు. అక్కడి యూత్ ఎక్కువగా వారి భాషను ఆదరిస్తారు. కానీ తెలుగు రాష్ట్రాల్లో, తెలుగు భాష మీద ఉండే క్రేజ్‌లో ఎక్కడో అతనికి చిన్న లోటు కనిపించింది. దీంతో తెలుగు భాషను యూత్‌లోకి తీసుకెళ్లాలి అనుకున్నాడు. అంతర్జాతీయ స్థాయిలో తెలుగుదనం కనిపించాలనుకున్నాడు. ఆలోచించాడు. చెన్నైలో ఉన్నప్పుడు తమిళ భాషతో ముడిపడి ఉన్న ఆయా రంగాలను తెలుసుకున్నాడు. ఇండస్ట్రీ నుంచి ఫ్యాషన్ దాకా వివరాలు కనుకొన్నాడు. అప్పుడే వచ్చింది అవినాష్‌కు 'ఐడియా'.. తెలుగు భాష + సినిమాను మిళితం చేసి కొత్త ఫ్యాషన్ బ్రాండ్‌ను పరిచయం చేయాలని.




* * *

ఫ్యాషన్‌లో కొత్త ట్రెండ్స్ పుట్టుకొస్తున్నాయి. మన యాసతో, మన భాషతో ఫ్యాషన్‌ను ఏర్పాటు చేయాలనుకున్నాడు. అవినాష్. సృజనా నైపుణ్యాలను ఉపయోగించి 'మ్యాడ్ మంకీ' ఫ్యాషన్ బ్రాండ్ స్టార్టప్‌ను ప్రారంభించాడు. 2017లో హైదరాబాద్ కేంద్రంగా ఇది ప్రారంభమైంది. తెలుగులో మొదటి ఫ్యాషన్ బ్రాండ్‌గా మ్యాడ్‌మంకీ ఏర్పడింది. టీషర్ట్స్, హుడీస్ పై తెలుగు కంటెంట్‌ను, వైరల్ డైలాగ్‌ను, హీరోల బొమ్మలను ముద్రిస్తూ ఇప్పుడు యూత్ నుంచి మంచి స్పందనను పొందుతున్నారు. మరికొందరి స్నేహితులతో కలిసి దీన్ని అభివృద్ధి చేశాడు అవినాష్. వర్ష, అఖిలేశ్, కేదర్‌ప్రసాద్, సాయికిరణ్, నరేశ్‌తో ఒక బృందంగా ఏర్పాటయ్యారు. వీరు ప్రత్యేకంగా మార్కెటింగ్, ఆపరేషన్స్, సోషల్‌మీడియాలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

### ట్రెండింగ్ ..

ఒక టీషర్ట్ కొంటే దాని మీద ఏ ఇంగ్లిష్ కొటేషనో, ఏ హిందీ డైలాగో ఉంటుంది. ఏం! మనకంటూ తెలుగులో డైలాగ్స్ లేవా? కొటేషన్లు దొరకవా? అంటే దొరుకుతున్నాయి. madmonkeystore.com లోకి వెళ్లి చూస్తే అన్నీ మన భాషలో కనిపించే ఫ్యాషన్ దుస్తులే. అవే ఇప్పుడు మన యూత్‌ను ఎక్కువగా ఆకట్టుకుంటున్నాయి. యూత్ వేసుకొనే టీషర్టుల మీద ఇవే ఇప్పుడు ఎక్కువగా కనిపిస్తున్నాయి. తెలుగులో ఫేమస్ డైలాగుల, పదాలతో ఈ టీషర్ట్‌లు అనేక మందిని ఆకట్టుకుంటున్నాయి.

### ఇలా ఉంటుంది..

'గ్యాప్ ఇవ్వలే వచ్చింది' ఇటీవల ఎక్కువ పాపులర్ అయిన అల్లు అర్జున్ డైలాగ్.. ఈ డైలాగ్‌తో టీషర్ట్ ఉంటే ఎంత బాగుంటుంది అని ఫ్యాన్స్ అనుకోవడం సాధారణం. అలాంటి వారు ఆలోచించకుండా www.madmonkeystore.com లోకి వెళ్లండి. అదొక్కటే కాదు.. 'ఖైదీ నంబర్ 150, లైట్ తీస్కో. అది నా పిల్ల బే, లైట్‌తీస్కో, పనిచూస్కో, మాస్.. ఊరమాస్, ఇంట్లో చెప్పే వచ్చా, నన్ను ఇన్వాల్వ్ చేయొద్దు రావుగారు' వంటి క్రేజీ డైలాగ్‌లతో టీషర్ట్స్ కనిపిస్తాయి. వీటిని ఆ వెబ్‌సైట్ ద్వారా కొనుక్కోవచ్చు. దీనికి యూత్ నుంచి మంచి స్పందన వస్తున్నది. మొదట్లో రోజుకు ఐదు నుంచి పది టీషర్ట్‌లే అమ్ముడుపోయినా తర్వాత పెరిగింది. తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ దేశాల్లో ఉన్న వారికి కూడా 'ఇంటర్నేషన్ షిప్పింగ్' చేస్తున్నారు వీళ్లు. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన టీషర్ట్ 3–5 రోజుల్లో మీకు చేరుతుంది. సుమారు రూ. 350 నుంచి రూ. 500 లోపు ధరలున్నాయి. చేతికి అందిన టీషర్ట్ నచ్చకపోతే రిటర్న్ తీసుకుని డబ్బులు వెనక్కి ఇచ్చే సదుపాయాన్ని కూడా పొందుపరిచారు. కానీ ఇప్పటి వరకూ డెలివరీ అయిన టీషర్టులు ఒక్కటి కూడా రిటర్న్ రాలేదని వారు తెలిపారు. కష్టమర్ల నుంచి మంచి ఫీడ్‌బ్యాక్ వస్తుందని అన్నారు.

అవినాష్‌ది హైదరాబాద్. డిజైనింగ్, మల్టీమీడియా చదుకున్నాడు. మొదటి నుంచి ఫైన్ ఆర్ట్స్ మీద అభిరుచి. డిగ్రీ తర్వాత చైన్నైలో డిజైనింగ్‌లో పని చేశాడు.. అక్కడ లాంగ్వేజ్ కల్చర్ చూసిన ఆయన స్థానికంగా డిజైనింగ్‌లోనే స్టార్టప్ ప్రారంభించాడు. వివిధ రకాల డిజైన్లతో పాటు ప్రాంతీయ భాష, యాసలను ప్రపంచానికి తెలియజేయాలనుకున్నాడు. ఈ విషయం మీద యూత్‌లో క్రేజ్ పెంచేలా చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇలా డివైన్ మంకీ ఏర్పాటు చేశాడు. 'దీని గురించి మొదట ఆలోచన వచ్చినప్పుడు ఫలితాలిస్తుందో లేదో తెలియదు. తక్కువ పెట్టుబడితో ప్రారంభించాను. ఆయా నగరాల్లో క్లాత్‌ను పరిశీలించి తయారీకి అక్కడ ఒప్పందం కుదుర్చుకున్నాం. మల్టీమీడియా ఫ్రెండ్స్‌తో కలిసి ఎక్కువ డిజైన్లు చేశాం. ఊహించని రెస్పాన్స్ వచ్చింది.. ఇంక ఆగిపోవాలనుకోలేదు. ఇప్పుడు టీషర్ట్‌లు, హుడీస్, విమెన్ టీషర్ట్‌లు అన్నీ అదిస్తున్నాం' అని చెప్తున్నాడు అవినాష్.



... వినోద్ మామిడాల

## వినూత్న ప్రచారం



**అర గడ్డం, అర మీసంతో రోడ్లపై తిరుగుతున్నాడో యువకుడు. అటుగా వెళ్తున్న కొందరు యువకులు గమనించారు. అతడి చుట్టూ చేరి హేళన చేశారు. అతడేం మాట్లాడలేదు. మాట్లాడకపోతే ఉన్న అరమీసం, గడ్డం తీసేస్తామని బెదిరించారు. అతడు ఒక్కసారిగా నోరు తెరిచాడు. గొంతు పగిలేట్లుగా నినదించాడు. ఏంటా నినాదం? అరగడ్డం, అరమీసంతో ఎందుకు తిరుగుతున్నాడా యువకుడు?**

**ఓ** యువకుడు అరగడ్డం, అర మీసంతో రోడ్లపై తిరుగుతున్నాడు. అతడిని చూసి కొందరు ఎగతాళి చేస్తున్నారు. మరికొందరు నవ్వుకుంటున్నారు. కొందరు ప్రశంసించి అతడితో ఫొటోలు దిగి సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్నారు. ఇంతకీ రోడ్లపై తిరుగుతున్న అతడు వార్తల్లోకి ఎక్కే పని ఏం చేశాడంటే.. అమేజాన్ అడవులు భూమికి 25 శాతం ఆక్సిజన్‌ను అందిస్తున్నాయి. అవి ఇటీవల అగ్నికి ఆహుతైన విషయం మనందరికీ తెలిసిందే. అయితే ఆ మంటలను అదుపు చేయలేక బ్రెజిల్ ప్రభుత్వం చేతులు ఎత్తేసింది. దీంతో ప్రపంచంలోని పర్యావరణవేత్తలు, పర్యావరణ ప్రేమికులు తమ నిరసనలు వినిపిస్తూనే ఉన్నారు. ఆస్ట్రేలియాకు చెందిన స్టాంటన్ కూక్ అనే యువకుడు గతేడాది నుంచి జుట్టు, మీసాలను, గెడ్డాన్ని సగానికి తీసి ఆస్ట్రేలియా వీధుల్లో తిరుగుతున్నాడు. అడవులను రక్షించాలంటూ నినదిస్తున్నాడు. అవగాహన కల్పిస్తున్నాడు. అడవుల పరిరక్షణకు విరాళాలు సేకరిస్తున్నాడు. వాటిని అమేజాన్ అడవుల పరిరక్షణ కోసం పోరాడుతున్న 'సేవింగ్ ఇండిగేనోస్ ల్యాండ్' అనే రెయిన్ ఫారెస్ట్ ట్రస్టుకు అందిస్తున్నాడు. అతన్ని చూడగానే చాలామంది కొత్త స్టైలేమో అనుకుంటారు. కొందరు ఎగతాళి చేస్తారు. కానీ అసలు విషయం తెలిసిన తర్వాత మాత్రం మెచ్చుకోకుండా ఉండరు.

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

**చెన్నై ప్రధాన కేంద్రంగా ఉన్న సదరన్ రైల్వేలో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

## ఎన్‌టీఆర్‌వోలో టెక్నీషియన్లు

**నేషనల్ టెక్నికల్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఎన్‌టీఆర్‌వో)లో టెక్నీషియన్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టు:** టెక్నీషియన్ – ఏ
- ఇవి గ్రూప్ సీ నాన్ గెజిటెడ్ క్యాడర్ పోస్టులు.
- **మొత్తం ఖాళీలు:** 71. వీటిలో జనరల్–31, ఎస్సీ–9, ఎస్టీ–5, ఓబీసీ–19, ఈడబ్ల్యూఎస్–7 ఖాళీలు ఉన్నాయి.
- **పేస్కేల్:** రూ.19,900–63,200 (లెవల్ –2)
- **అర్హతలు:** పదోతరగతి లేదా తత్సమానకోర్సుతోపాటు ఐటీఐలో కంప్యూటర్ ఆపరేటర్&ప్రోగ్రామింగ్/కంప్యూటర్ హార్డ్‌వేర్ లేదా డీటీపీ లేదా తత్సమాన విభాగాల్లో ఉత్తీర్ణత. కంప్యూటర్ నాలెడ్జ్ ఉండాలి.
- **వయస్సు:** 18– 27 ఏండ్ల మధ్య ఉండాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** డిసెంబర్ 23
- **వెబ్‌సైట్:** https://ntro.gov.in

## సదరన్ రైల్వేలో అప్రెంటిస్‌లు

- అప్రెంటిస్
- **మొత్తం ఖాళీలు:** 3585
- **యూనిట్ల వారీగా ఖాళీలు:** క్యారేజ్ వర్క్స్, పెరంబూర్–1208, సెంట్రల్ వర్క్‌షాప్, గోల్డెన్ రాక్–723, సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ వర్క్‌షాప్, పొడనూర్–1654.
- **ట్రేడులు:** ఫిట్టర్, వెల్డర్, మెషినిస్ట్, ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఎమ్ఎల్‌టీ టెక్నీషియన్, పెయింటర్, కార్పెంటర్ తదితరాలు.



- **అర్హతలు:** పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ/ ఎమ్ఎల్‌టీ ఉత్తీర్ణత, ఎన్‌సీవీటీ సర్టిఫికెట్.
- **వయస్సు:** 15– 22 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** మెరిట్‌లిస్ట్, వైద్యపరీక్షల ఆధారంగా.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** డిసెంబర్ 31
- **వెబ్‌సైట్:** https://sr.indianrailways.gov.in

## ఐఎల్‌ఎస్‌లో పీహెచ్‌డీ

**భువనేశ్వర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్స్ పీహెచ్‌డీ కోర్సులో ప్రవేశాల కోసం ప్రకటన విడుదల చేసింది.**

Institute of Life Sciences

- **కోర్సు:** పీహెచ్‌డీ
- **విభాగాలు:** ప్లాంట్ బయోటెక్నాలజీ, హ్యూమన్ జెనెటిక్స్, కేన్సర్ బయాలజీ, ఇన్ఫెక్టియస్ డిసీస్ బయాలజీ తదితరాలు ఉన్నాయి.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో ఎమ్మెస్సీ/ ఎంటెక్ /ఎంఫార్మసీ ఉత్తీర్ణత.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** డిసెంబర్ 31
- **వెబ్‌సైట్:** http://www.ils.res.in

## ఐఐఐటీడీఎంలో

**కర్నూల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ& డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ వివిధ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**

- **మొత్తం ఖాళీలు:** 19
- **పోస్టులు:** అసిస్టెంట్ రిజిస్ట్రార్, టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ ఇంజినీర్, జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా/బ్యాచిలర్ డిగ్రీ/ ఇంజినీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం. పోస్టును బట్టి వేర్వేరుగా ఉన్నాయి. వివరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** డిసెంబర్ 24
- **వెబ్‌సైట్:** http://iiitk.ac.in



ఆదిలాబాద్ రూరల్ మండలం దార్లొద్ది వద్ద పొగమంచు

## మంచుదుప్పట్లో ఆదిలాబాద్

**ఆదిలాబాద్/నమస్తే తెలంగాణ ప్రతినిధి :** ఆదిలాబాద్ జిల్లాను మంగళవారం ఉదయం పొగమంచు కమ్మేసింది. అటవీప్రాంత గ్రామాలు పొగమంచుతో కశ్మీర్ వాతావరణాన్ని తలపించాయి. జాతీయ రహదారిని పొగమంచు కమ్మివేయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉదయం 8.30 గంటల వరకు సూర్యుడు కనిపించకపోవడంతో లైట్లు వేసుకుని వాహనాలు నడిపారు. మరికొందరు పార్కింగ్ లైట్లు వేసుకుని, రహదారి పక్కన వాహనాలను నిలిపివేశారు. ఇంతటి పొగమంచును తాము గతంలో ఎప్పుడూ చూడలేదని జిల్లావాసులు అంటున్నారు.

# తల్లి కావటమే అనర్హతా!

- 'మిస్ వరల్డ్' నిబంధనలపై ఉక్రెయిన్ మాజీ సుందరి పోరాటం



**ఉక్రెయిన్:** తల్లి అన్న కారణంగా.. తనకు మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనకుండా చేయటంపై ఉక్రెయిన్ మాజీ సుందరి వెరోనికా డిడుసెంకో న్యాయపోరాటాన్ని ప్రారంభించారు. మహిళల హక్కులను కాపాడేందుకు ఏకంగా మిస్ వరల్డ్ పోటీల నియమాలను మార్చాల్సిందేనంటూ ఉద్యమానికి సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రాంలో సోమవారం వెల్లడిస్తూ 'రైట్ టు బీ ఏ మదర్' (తల్లిగా ఉండే హక్కు కోసం) అనే పేరును ట్యాగ్ చేశారు. 2018లో మిస్ ఉక్రెయిన్ కిరీటాన్ని వెరోనికా సొంతం చేసుకొన్నారు. అయితే ఆమెకు ఐదేండ్ల వయసున్న కుమారుడున్న విషయాన్ని తెలుసుకొన్న నిర్వాహకులు.. ఆమె నుంచి కిరీటాన్ని వెనక్కి తీసుకోవడమే గాక మిస్ వరల్డ్ పోటీల్లో ఉక్రెయిన్ తరఫున పాల్గొనకుండా ఆమెపై నిషేధం విధించారు. ఈ నేపథ్యంలో ఆమె దీనిపై పోరాటాన్ని ప్రారంభించారు. పెండ్లి చేసుకొన్నవారు కూడా మిస్ వరల్డ్ పోటీల్లో పోటీపడేలా నియమాలను సవరించాలని, మిస్ వరల్డ్ పోటీలో పోటీపడేందుకు తనను కోరుతున్నారు. మిస్ ఉక్రెయిన్ కిరీటాన్ని తిరిగి తనకు ఇవ్వాల్సిన అవసరం లేదని, మిస్ వరల్డ్ పోటీల నియమాలను మార్చి న్యాయం చేయాలని ఇన్‌స్టాగ్రాంలో పోస్ట్ చేశారు. ఈ నెల 14 న లండన్ వేదికగా మిస్ వరల్డ్ పోటీలు జరుగనున్నాయి. పెండ్లి అయిన వారిని, తల్లులను పోటీపడేందుకు అనుమతించకూడదని మిస్ వరల్డ్ పోటీల నిబంధనలు పేర్కొంటున్నాయి. ఉక్రెయిన్ నుంచి న్యాయ విద్యార్థిని మార్గరీటా పాషా మిస్ వరల్డ్ బరిలో నిలుస్తున్నారు.



# మా నేతల ప్రాణాలకు ప్రమాదం

- ప్రియాంక ఇంట్లోకి చొరబాటు నేపథ్యంలో మోదీ, అమిత్‌షాపై కాంగ్రెస్ ధ్వజం
- మా ఇంట్లోకి కారు దూసుకురావడం భారీ భద్రతాలోపమే: రాబర్ట్ వాద్రా



ప్రియాంక గాంధీ, రాబర్ట్ వాద్రా (ఫైల్)

**న్యూఢిల్లీ, డిసెంబర్ 3:** ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఇంటిలోకి భద్రతా వలయాన్ని దాటుకొని ఏడుగురు వ్యక్తులు కారులో దూసుకెళ్లిన ఘటనపై కాంగ్రెస్ మండిపడింది. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కలిసి తమ పార్టీ నేతల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టారని ఆరోపించింది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మంగళవారం ట్వీట్ చేస్తూ ప్రభుత్వం తన రాజకీయ లబ్ధి కోసం కొందరి ప్రాణాలను ప్రమాదంలో పెట్టకూడదని సూచించారు. సోనియాగాంధీ కుటుంబానికి ఎస్పీజీ (స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్) భద్రతను తొలిగించడాన్ని, ఇటీవల కొందరు వ్యక్తులు భద్రతా వలయాన్ని దాటుకొని ప్రియాంక ఇంట్లోకి వెళ్లడాన్ని పరిశీలిస్తుంటే ప్రభుత్వం తమ నాయకుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టినట్లు కనిపిస్తున్నదని తెలిపారు. లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత అధిర్ రంజన్ చౌదరి పార్లమెంట్ బయట మాట్లాడుతూ గాంధీ కుటుంబానికి ఎస్పీజీ భద్రతను తొలిగించడంపై పార్లమెంట్‌లో నిరసన చేపట్టాలనుకున్నామని, కానీ తమకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని చెప్పారు. ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతును పార్లమెంట్‌లోనూ నొక్కేస్తున్నదని ఆరోపించారు. మరోవైపు ప్రియాంక భర్త రాబర్ట్ వాద్రా స్పందిస్తూ కారులో కొందరు వ్యక్తులు తమ ఇంటిలోకి దూసుకురావడం భారీ భద్రతా లోపమేనని తెలిపారు. గాంధీ కుటుంబానికి ఎస్పీజీ భద్రతను తొలిగించడం రాజకీయ ప్రేరేపిత చర్యగానే కనిపిస్తున్నదని పేర్కొన్నారు. 'దేశంలో మహిళల భద్రత కంటే మా భద్రత ముఖ్యం కాదు. మేము ఈ కోణంలోనే ఆలోచిస్తున్నాము. ప్రభుత్వం కూడా మహిళల భద్రతపై దృష్టిసారించాలి. మాకు ప్రజల అండ ఉన్నది. వాళ్లే మాకు భద్రత కల్పిస్తారు' అని వాద్రా తెలిపారు. కాగా గాంధీ కుటుంబానికి గత కొన్ని ఏండ్ల నుంచి కల్పిస్తున్న ఎస్పీజీ భద్రతను ఇటీవల కేంద్ర ప్రభుత్వం తొలిగించిన విషయం తెలిసిందే. ఎస్పీజీ స్థానంలో సీఆర్పీఎఫ్ బృందంతో కూడిన భద్రతను సమకూర్చింది.

## హజ్ దరఖాస్తులకు రేపు తుదిగడువు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హజ్‌యాత్రకు వెళ్లేవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనేందుకు గురువారంవరకు గడువు విధించినట్టు రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ మసియుల్లాఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# ఉద్యోగాలకు ఉమ్మడి పరీక్ష

- కేంద్ర ప్రభుత్వ గ్రూప్-బీ, గ్రూప్-సీ పోస్టులకు ఒకే టెస్ట్
- సీఈటీ నిర్వహణకు ప్రత్యేక సంస్థను ఏర్పాటుచేయాలని కేంద్రం ప్రతిపాదన
- ఎస్సెస్సీ, ఆర్ఆర్బీ, ఐబీపీఎస్ నియామకాలతో మొదలుపెట్టాలని యోచన
- ప్రభుత్వ సంస్థలతోపాటు, అభ్యర్థులకు తగ్గనున్న ఇబ్బందులు
- స్కోరును పెంచుకొనేందుకు ప్రతి అభ్యర్థికి రెండు అవకాశాలు
- మూడేండ్లపాటు చెల్లుబాటుకానున్న స్కోరు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 2:** గ్రూప్-బీ, గ్రూప్-సీ పోస్టులకు ఉద్యోగుల నియామకం విషయమై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొన్నది. ఇకపై ఈ నియామకాలన్నింటినీ ప్రత్యేక సంస్థతో ఒకే 'ఉమ్మడి అర్హత పరీక్ష' (సీఈటీ) ద్వారా జరిపించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం గ్రూప్-ఏ, గ్రూప్-బీ (గెజిటెడ్)లోని ఇతర సర్వీసులతోపాటు ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఓఎస్ అధికారుల ఎంపిక కోసం యూపీఎస్సీ (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) ఏటేటా సివిల్ సర్వీస్ పరీక్షలు నిర్వహిస్తున్నది. యూపీఎస్సీతోపాటు కేంద్ర ప్రభుత్వ విభాగాల పోస్టులకు, ప్రధానంగా గ్రూప్-బీ పోస్టులకు సంబంధించిన నియామకాలను ఎస్సెస్సీ (స్టాఫ్ సెలక్షన్ కమిషన్) కూడా జరుపుతున్నది. ఈ నేపథ్యంలో గ్రూప్-బీలోని కొన్ని గెజిటెడ్ పోస్టులు, నాన్-గెజిటెడ్ పోస్టులు, గ్రూప్-సీ పోస్టులకు అభ్యర్థుల ఎంపిక కోసం ఉమ్మడి అర్హత పరీక్ష నిర్వహించేందుకు ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్టు కేంద్ర సిబ్బంది వ్యవహారాలశాఖ వెల్లడించింది. దీనివల్ల ఈ పరీక్ష నిర్వహించే ప్రభుత్వ సంస్థలకు, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఖర్చు తగ్గడంతోపాటు, సామాజిక స్థితిగతులతో నిమిత్తంలేకుండా అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు లభిస్తాయని సిబ్బంది వ్యవహారాలశాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. ఈ ప్రతిపాదనపై కేంద్రంలోని అన్ని మంత్రిత్వశాఖలు, ప్రభుత్వ విభాగాలు, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల పాలనాయంత్రాంగాలు, ప్రభుత్వ/ప్రైవేటు భాగస్వాములతోపాటు ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరాలని ఆశిస్తున్న అభ్యర్థులు నెలరోజుల్లోగా అభిప్రాయాలు తెలియజేయాలని సిబ్బంది వ్యవహారాలశాఖ కోరింది.

### ప్రస్తుతం 6,83,823 పోస్టులు ఖాళీ

ప్రభుత్వం విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం గతేడాది మార్చి 1 నాటికి కేంద్ర ప్రభుత్వానికి చెందిన వివిధ విభాగాల్లో మొత్తం 6,83,823 (గ్రూప్-సీ క్యాటగిరీలో 5,74,289, గ్రూప్-బీలో 89,638, గ్రూప్-ఏలో 19,896) పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ప్రస్తుతం వివిధ ప్రభుత్వ ఉద్యోగాలకు ఒకేవిధమైన అర్హతా ప్రమాణాలను నిర్దేశించినప్పటికీ ఆ ఉద్యోగాలను ఆశించే అభ్యర్థులు వేర్వేరు నియామక సంస్థలు నిర్వహించే పలు రకాల పరీక్షలకు హాజరుకావాల్సి వస్తున్నది. వీటిలో టైర్-1, టైర్-2, టైర్-3, స్కిల్ టెస్టుల్లాంటి అనేక పరీక్షలుంటున్నాయి. సాధారణంగా టైర్-1లో కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ మల్టిపుల్ చాయిస్ ఆబ్జెక్టివ్ పరీక్ష ఉంటుంది. ఏటా దాదాపు 1.25 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల కోసం సుమారు 2.5 కోట్ల మంది అభ్యర్థులు ఇలాంటి పలు నియామక పరీక్షలకు హాజరవుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక సంస్థ ద్వారా కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించి గ్రూప్-బీలోని కొన్ని గెజిటెడ్, నాన్-గెజిటెడ్ పోస్టులతోపాటు గ్రూప్-సీ పోస్టులకు అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసేందుకు ఒకే ఉమ్మడి అర్హత పరీక్షను ప్రవేశపెట్టాలని ప్రతిపాదించినట్టు సిబ్బంది వ్యవహారాలశాఖ పేర్కొన్నది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే అభ్యర్థులు ఒకేవిధమైన అర్హతలతో కూడిన ప్రభుత్వ ఉద్యోగాలకు వివిధ సంస్థలు నిర్వహించే వేర్వేరు పరీక్షలకు హాజరుకావాల్సిన ఇబ్బంది ఉండదు. అంతేకాకుండా ఈ పరీక్షల కోసం పలు దరఖాస్తు ఫీజులు చెల్లించవలసిన బాధ తప్పడంతోపాటు పరీక్షలకు సంబంధించిన ప్రయాణ చార్జీలు, సమయం కూడా ఆదా అవుతాయి.

### నాన్-టెక్నికల్ పోస్టులతో సీఈటీ మొదలు

ప్రస్తుతం నాన్-టెక్నికల్ పోస్టులకు ఎస్సెస్సీ, ఆర్ఆర్బీలు (రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డులు), ఐబీపీఎస్ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్) ద్వారా జరుపుతున్న నియామకాల్లో గ్రాడ్యుయేట్, హయ్యర్ సెకండరీ (ఇంటర్/12వ తరగతి ఉత్తీర్ణులైన), మెట్రిక్యులేషన్ (10వ తరగతి ఉత్తీర్ణులైన) అభ్యర్థులతో మొదలుపెట్టి ఉమ్మడి అర్హత పరీక్షలను నిర్వహించాలని భావిస్తున్నట్టు సిబ్బంది వ్యవహారాలశాఖ పేర్కొన్నది. ఈ పరీక్షలో అభ్యర్థి సాధించిన స్కోరు అతనితోపాటు సదరు రిక్రూట్‌మెంట్ సంస్థకు అందుబాటులో ఉంటుందని, పరీక్ష ఫలితం ప్రకటించిన నాటి నుంచి మూడేండ్లపాటు ఈ స్కోరు చెల్లుబాటవుతుందని తెలిపింది. స్కోరును పెంచుకొనేందుకు ప్రతి అభ్యర్థికి రెండు అవకాశాలుంటాయని, ఈ రెండు అవకాశాల్లో అభ్యర్థి సాధించిన ఉత్తమ స్కోరును ప్రస్తుత స్కోరుగా పరిగణించడం జరుగుతుందని, నియామక సంస్థలు నిర్వహించే ప్రత్యేక పరీక్షల ద్వారా అభ్యర్థుల తుది ఎంపిక జరుగుతుందని తెలిపింది. ఖర్చును పంచుకొనే ప్రాతిపదికన సీఈటీ ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అధికారయంత్రాంగాలు కూడా ఉపయోగించుకోవచ్చని, ఇందుకోసం ఆయా ప్రభుత్వాలు సదరు సంస్థతో అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకోవాల్సి ఉంటుందని సిబ్బంది వ్యవహారాలశాఖ ఆ ప్రతిపాదనలో పేర్కొన్నది.

# వ్యవసాయం జీవన మార్గం కావాలి

- విద్యార్థులకు ప్రాథమికస్థాయి నుంచే సాగుపై అవగాహన పెంచాలి
- యువత వ్యవసాయాన్ని ఒక వృత్తిగా ఎంచుకొనే పరిస్థితి రావాలి
- వ్యవసాయ విద్యాదినోత్సవంలో అగ్రివర్సిటీ వీసీ డాక్టర్ వీ ప్రవీణ్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలో 60 శాతం ప్రజానీకానికి జీవనాధారమైన వ్యవసాయం గురించి విద్యార్థులకు ప్రాథమికస్థాయి నుంచే అవగాహన కల్పించాల్సిన అవసరమున్నదని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వీ ప్రవీణ్‌రావు అన్నారు. యువత వ్యవసాయాన్ని ఒకవృత్తిగా, జీవనమార్గంగా ఎంచుకొనే పరిస్థితులు రావాలని ఆకాంక్షించారు. దేశానికి మొదటి వ్యవసాయశాఖ మంత్రిగా, రాష్ట్రపతిగా సేవలందించిన భారతరత్న డాక్టర్ రాజేంద్రప్రసాద్ జయంతి సందర్భంగా మంగళవారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో వ్యవసాయ విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ విద్య, పరిశోధనరంగాల్లోసాధించిన ప్రగతిని వివరిస్తూ ఏర్పాటుచేసిన ప్రదర్శనను వీసీ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. వ్యవసాయ రంగం ప్రాముఖ్యత, ఉపాధి అవకాశాలు, యువత పెద్దఎత్తున రావాల్సిన అవసరాన్ని వీసీ వివరించారు.



వ్యవసాయ విద్య, పరిశోధన రంగాల్లో సాధించిన ప్రగతిపై మంగళవారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో ఏర్పాటుచేసిన ప్రదర్శనను తిలకిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ వీ ప్రవీణ్‌రావు

### రైతుల కోసం త్వరలో యాప్

వాతావరణ మార్పులు, పెరుగుతున్న జనాభా, మారుతున్న ఆహారపు అలవాట్లు, అందుబాటులోకి వస్తున్న ఆధునిక టెక్నాలజీలతో వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ వర్సిటీ అనేక చర్యలు చేపట్టిందని వీసీ ప్రవీణ్‌రావుచెప్పారు. ఐదేండ్లలో అనేక స్వల్పకాలిక వంగడాలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. రైతులకు అధునాతన టెక్నాలజీలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు యాప్‌ను కూడా రూపొందిస్తున్నట్టు పేర్కొన్నారు. నేలల సారాన్ని కాపాడటం కోసం పర్యావరణ పరిరక్షణను ప్రతిఒక్కరూ కృషిచేయాలని ప్రవీణ్ రావు పిలుపునిచ్చారు. దేశాభివృద్ధిలో వ్యవసాయరంగం ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ప్రొఫెసర్ కల్పనాశాస్త్రి వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ సుధీర్‌కుమార్, కళాశాల అసోసియేట్ డాక్టర్ సీమ, పీజేటీఎస్ఏయూ బోర్డు సభ్యుడు డాక్టర్ మనోహర్ రావు, పీజీ డీన్ డాక్టర్ మీనాకుమారి, డైరెక్టర్ ఆఫ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డాక్టర్ ఆనంద్ సింగ్, డైరెక్టర్ ఆఫ్ పాలిటిక్స్ డాక్టర్ లక్ష్మణ్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆకాశవాణిలో తాత్కాలిక ఉద్యోగాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో ప్రాంతీయ వార్తా విభాగం తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసేందుకు న్యూస్ ఎడిటర్లు, రిపోర్టర్లు (తెలుగు), న్యూస్‌రీడర్ల (తెలుగు, ఉర్దూ) కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఉప సంచాలకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పూర్తి వివరాల కోసం www.newsonair.com వెబ్‌సైట్‌లో వేకెన్సీ విభాగాన్ని పరిశీలించాలని కోరారు.

## ఏపీకి చెందిన తాసిల్దార్ ఇంట్లో ఏసీబీ సోదాలు

- 10 కోట్ల అక్రమాస్తుల గుర్తింపు

**అమరావతి:** ఆదాయానికి మించి ఆస్తులున్న కేసులో సస్పెండైన ఏపీలోని కర్నూలు జిల్లా, సంజామల తాసిల్దార్ గోవిందసింగ్ ఇంట్లో మంగళవారం ఏసీబీ అధికారులు సోదాలు జరిపారు. రూ.5 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన అతని ఇంట్లో గతంలోనే ఆకస్మిక తనిఖీలు చేసిన ఏసీబీ అధికారులు విలువైన స్థిర, చరాస్తులను గుర్తించగా, అతన్ని జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు అధికారులు మంగళవారం మరోమారు ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించగా 10 కోట్ల ఆస్తులు బయటపడినట్టు అధికారులు తెలిపారు. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్న అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.



అసెంబ్లీ భవనంలోని కమిటీహాల్‌లో మంగళ వారం నిర్వహించిన శాసనసభ బీసీ సంక్షేమ కమిటీ సమావేశంలో పాల్గొన్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కమిటీ చైర్మన్ వై అంజయ్య, సభ్యులు కాలె వెంకటేశ్, బాజిరెడ్డి గోవర్ధన్, ముఠా గోపాల్, ఎగ్గె మల్లేశం తదితరులు

# బీసీ జనాభా ప్రకారం పథకాలు

- బడ్జెట్‌లో బీసీల అభివృద్ధికి రూ.3,367 కోట్లు కేటాయింపు
- అసెంబ్లీ బీసీ సంక్షేమ కమిటీ సమావేశంలో స్పీకర్ పోచారం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల (బీసీ) జనాభా 51 శాతం ఉన్నదని, ఆ ప్రకారం ప్రభుత్వ పథకాలను కేటాయించాల్సి ఉంటుందని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీ భవనంలోని కమిటీహాల్‌లో చైర్మన్ వై అంజయ్య అధ్యక్షతన జరిగిన శాసనసభ బీసీ సంక్షేమ కమిటీ సమావేశంలో స్పీకర్ పోచారం మాట్లాడుతూ.. పేదల కష్టాలు తెలిసిన సభ్యులతో ప్రభుత్వం కమిటీని ఏర్పాటుచేసిందన్నారు. గతంలో ప్రజాప్రతినిధులంటే కేవలం ఎన్నికల సమయంలో కనిపించేవారని, ఇప్పుడు ఆ పరిస్థితిలేదని, ప్రజల మధ్య గ్రామాల్లో తిరుగుతూ ప్రజాసమస్యలను తీర్చుతున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో బీసీల అభివృద్ధికి ప్రభుత్వం రూ. 3,367 కోట్లను కేటాయించిందని చెప్పారు. బీసీల స్వయం ఉపాధికి అధికమొత్తంలో సబ్సిడీ అందిస్తున్నదని, వందశాతం సబ్సిడీతో రూ.50,000 రుణం ఇచ్చిన చరిత్రలో ఏనాడూలేదని అన్నారు. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో ఏవిధంగా అమలవుతున్నాయో తెలుసుకోవాలంటే ఆయా నియోజవర్గాల్లో నిర్వహించే ప్రతిసమావేశంలో ప్రజాప్రతినిధులు పాల్గొనాలని సూచించారు. గ్రామస్థాయిలో లబ్ధిదారులకు పథకాలు అందుతున్న తీరును తెలుసుకొని నివేదికలను ప్రభుత్వానికి ఇవ్వాలని, తద్వారా లోటుపాట్లను సవరించి పథకాలను మరింత పారదర్శకంగా అమలుచేసేందుకు వీలవుతుందని చెప్పారు. నియోజకవర్గానికి రెండుచొప్పున బీసీ గురుకులాలు ఉన్నాయని, వాటిపనితీరును మెరుగుపరిచేందుకు అసెంబ్లీ కమిటీ స్వయంగా పరిశీలించి రిపోర్టును అందించాలని స్పీకర్ సూచించారు. సమావేశంలో శాసనసభ బీసీ సంక్షేమ కమిటీ సభ్యులు కాలె వెంకటేశ్, బాజిరెడ్డి గోవర్ధన్, ముఠా గోపాల్, ఎగ్గె మల్లేశం పాల్గొన్నారు.



ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్లో రైతుతో మాట్లాడుతున్న జేడీఎం ఎల్లయ్య

# ఖమ్మం మార్కెట్‌లో తనిఖీలు

**ఖమ్మం వ్యవసాయం:** ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ విజిలెన్స్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. మార్కెటింగ్‌శాఖ జేడీ ఎల్లయ్య ఆధ్వర్యంలో ఓ బృందం నగర వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించింది. తొలుత మార్కెట్ కమిటీ చైర్మన్ మద్దినేని వెంకటరమణ, వైస్‌చైర్మన్ పిన్ని కోటేశ్వరరావు, జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి సంతోష్‌కుమార్‌తో జేడీ సమావేశమయ్యారు. అనంతరం పత్తి యార్డులో ఉన్న ఆన్‌లైన్ బిడ్డింగ్ కేంద్రాన్ని సందర్శించి.. క్రయవిక్రయాలపై ఆరా తీశారు. బిడ్డింగ్ స్లిప్, గేట్ ఎంట్రీల ప్రక్రియ, ఔట్ గోయింగ్ విధానంపై క్షుణ్ణంగా పరిశీలించారు.

# నైపుణ్యాలు బోధించే సమయమిది

- ప్రధానోపాధ్యాయులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం
- ప్రారంభించిన విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి




నాంపల్లిలో మంగళ వారం ప్రధానోపాధ్యాయులకు కెరీర్ గైడెన్స్‌పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో నివేదికను విడుదలచేస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి, మోడల్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విద్యార్థులకు నైపుణ్యాలు బోధించే సమయం ఆసన్నమైందని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. జీవితంలో ఎదురయ్యే ఒడిదొడుకులు, సమస్యలకు కుంగిపోకుండా ధైర్యంగా ఎదుర్కొనేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. మంగళవారం నాంపల్లి ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో ప్రధానోపాధ్యాయులకు కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. సామాజిక విలువలతో కూడిన చదువే సమాజాభివృద్ధికి బీజం వేస్తుందని చెప్పారు. వ్యక్తిత్వ వికాసం, విలువలు, నైతికత, నిస్వార్థ జీవనప్రమాణాలు నేర్పడం ద్వారా సామాజిక అభ్యున్నతికి కొత్త బాటలు వేసినవారవుతారని అన్నారు. మన రాష్ట్రంలో చదువుకున్న విద్యార్థి ప్రపంచంలో ఎక్కడైనా, ఎవ్వరితోనైనా పోటీపడేలా తీర్చిదిద్దాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని, ప్రభుత్వ పాఠశాలల్లోని ఒక్కో విద్యార్థిపై ఏటా రూ.52 వేలు, ఒక్కో గురుకుల విద్యార్థిపై ఏటా రూ.1.20 లక్షల ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. మోడల్ స్కూల్ విద్యార్థులు జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో ప్రతిభను చాటుకొనేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉన్నదని గుర్తుచేశారు. ఏదో ఒక కోర్సు, ఏదో ఒక వృత్తి అనే అలసత్వ ధోరణితో కాకుండా పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేసుకొనేలా విద్యార్థులకు తీర్చిదిద్దితే వారికి మంచి భవిష్యత్ ఇచ్చినవారవుతారని చెప్పారు. మోడల్ స్కూళ్లలో అనుసరిస్తున్న 'మై ఛాయిస్.. మై ఫ్యూచర్' కార్యక్రమాన్ని ఇతర పాఠశాలల్లో కూడా ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్ధన్‌రెడ్డి, మోడల్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలు ఆందోళన చెందొద్దు

- సమస్యలన్నీ పరిష్కరిస్తాం
- అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ నేతలకు మంత్రి సత్యవతి భరోసా



మంత్రి సత్యవతి రాథోడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నల్ల భారతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో అంగన్‌వాడీకేంద్రాల ద్వారా బలవర్ధకమైన ఆహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్నామని, గ్రామస్థాయిలో కీలకంగా ఉండే కేంద్రాల నిర్వాహకులు ఎలాంటి ఆందోళన చెందవద్దని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ హామీ ఇచ్చారు. అంగన్‌వాడీకేంద్రాలను కుదిస్తున్నారనే వదంతుల నేపథ్యంలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (టీఆర్‌వీకేఎస్ అనుబంధం) అధ్యక్షురాలు నల్ల భారతి ఆధ్వర్యంలో మంగళవారం మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. 40 ఏండ్లుగా ఐసీడీఎస్‌ను ఒక పథకంగా నిర్వహిస్తున్నామని, అంగన్‌వాడీ కేంద్రాల్లో 60 ఏండ్లకుపైబడిన టీచర్లు, ఆయాలు మారుతున్న విధానాలకు అనుగుణంగా పనిచేయలేక ఉద్యోగాన్ని వదులుకోలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. 60 ఏండ్లు పైబడిన టీచర్‌కు రూ.5 లక్షలు, ఆయాకు రూ.2.5 లక్షలు ఇచ్చి రిటైర్మెంట్ కల్పించాలని కోరారు. అర్హులైన అంగన్‌వాడీ టీచర్లను గ్రేడ్-2 సూపర్‌వైజర్లుగా, ఆయాలను అంగన్‌వాడీ టీచర్లుగా పదోన్నతులు ఇవ్వాలని భారతి కోరారు. మంత్రిని కలిసినవారిలో గొర్రె రాధ, మంగమ్మ, రాణి తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
బుధవారం 4 డిసెంబర్ 2019


నాని

# 'టక్ జగదీష్'గా నాని

**నా**ని కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందించబోతున్న చిత్రానికి 'టక్..జగదీష్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. రీతూవర్మ కథానాయిక. షైన్‌స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, హరీష్‌పెద్ది నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ లుక్‌ను మంగళవారం విడుదల చేశారు. ఇందులో పంటపొలాలు, విండ్‌మిల్స్ బ్యాక్‌గ్రౌండ్‌లో నాని పల్లెటూరి యువకుడిగా కనిపిస్తున్నారు. 2020ప్రథమార్థంలో ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణ మొదలుకానుంది. 'నిన్నుకోరి' తర్వాత దర్శకుడు శివ నిర్వాణ, నాని కలయికలో రాబోతున్న ఈ సినిమా ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. ఇందులో ఐశ్వర్యారాజేష్ మరో నాయికగా నటిస్తున్నది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ప్రసాద్ మూరెళ్ల, ఎడిటర్: ప్రవీణ్‌పూడి, ఆర్ట్: సాహి సురేష్, సంగీతం: తమన్, రచన-దర్శకత్వం: శివ నిర్వాణ.

# సుకుమార్ కథతో నిఖిల్


సుకుమార్


నిఖిల్


బన్నీ వాసు


సూర్యప్రతాప్

నిఖిల్ కథానాయకుడిగా సూర్యప్రతాప్ ('కుమారి 21ఎఫ్' ఫేమ్) దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనుంది. ఈ సినిమాకు ప్రముఖ దర్శకుడు సుకుమార్, బన్నీ వాసు నిర్మాతలుగా వ్యవహరిస్తారు. జీఏ2పిక్చర్స్, సుకుమార్‌రైటింగ్స్ పతాకాలపై అల్లు అరవింద్ సమర్పణలో తెరకెక్కనుంది. త్వరలో షూటింగ్ ప్రారంభంకానుంది. 'ఈ సినిమా కోసం అద్భుతమైన కథ సిద్ధమైంది. సబ్జెక్ట్ విని నిఖిల్ ఎగ్జైట్ అయ్యాడు. అతని కెరీర్‌లో మైలురాయిలా నిలిచే చిత్రమవుతుంది. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా అందరిని అలరించే చిత్రమిది. కథానుగుణంగా ఉన్నత నిర్మాణ విలువలతో తెరకెక్కిస్తాం. ఈ సినిమాకు సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడిస్తాం' అని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే సుకుమార్ అందిస్తున్నారు.


నాగచైతన్య

# వేసవిలో 'లవ్‌స్టోరీ'?

**నా**గచైతన్య, సాయిపల్లవి జంటగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. ఏమిగోస్ క్రియేషన్స్ సమర్పణలో శ్రీవెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి పతాకంపై నారాయణ్‌దాస్ కె నారంగ్, పి.రామ్మోహన్‌రావు నిర్మిస్తున్నారు. తాజా సమాచారం మేరకు ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్ 2వ తేదీన విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ చిత్రానికి 'లవ్‌స్టోరీ' అనే టైటిల్‌ను ఖరారు చేయబోతున్నారని సమాచారం. 'ఇటీవల నాగచైతన్య జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని విడుదల చేసిన వీడియోకు అద్భుతమైన స్పందన లభించింది. ఈ సినిమాలో నాగచైతన్య తెలంగాణలోని ఓ టౌన్ నుంచి హైదరాబాద్‌కు వచ్చి తన కలల్ని సాఫల్యం చేసుకునే యువకుడిగా కనిపిస్తాడు. ఆయన పాత్ర చిత్రణ కొత్త పంథాలో ఉంటుంది. చైతూ-సాయిపల్లవి మధ్య వచ్చే సన్నివేశాలు ప్రధానాకర్షణగా నిలుస్తాయి. శేఖర్ కమ్ముల శైలి సున్నితమైన భావోద్వేగాలు, వినోదం కలబోసిన ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇది' అని చిత్ర బృందం తెలిపింది. రాజీవ్ కనకాల, ఈశ్వరీరావు, దేవయాని తదితరులు ముఖ్యపాత్రల్ని పోషిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: విజయ్ సి కుమార్, సంగీతం: పవన్, ఆర్ట్: రాజీవ్ నాయర్, రచన-దర్శకత్వం: శేఖర్ కమ్ముల.

**'సంగీత దర్శకుల మధ్య పోటీ అనేది ప్రేక్షకుల దృష్టి నుంచే కనిపిస్తుంటుంది. వ్యక్తిగతంగా మేమంతా సఖ్యతగానే ఉంటాం. మా మధ్య ఎలాంటి పోటీ ఉండదు' అని అన్నారు తమన్. ప్రస్తుతంతెలుగు చిత్రసీమలో అగ్ర సంగీతదర్శకుల్లో ఒకరిగా చెలామణీ అవుతున్నారాయన. ఆయన సంగీతాన్ని అందిస్తున్న తాజా చిత్రం 'వెంకీమామ'. వెంకటేష్, నాగచైతన్య హీరోలుగా నటిస్తున్నారు. ఈ నెల 13న విడుదలకానుంది. ఈ సందర్భంగా మంగళ వారం హైదరాబాద్‌లో తమన్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి....**

# ప్రతి విమర్శకు సమాధానం ఇస్తాను!

**'వెం**కీమామ' భావోద్వేగప్రధానంగా సాగుతుంది. ఎడిటింగ్ రూమ్‌లో సినిమా చూడగానే కన్నీళ్లువచ్చాయి. కుటుంబంలో ఎదురైన ఓ సమస్యను మామాఅల్లుళ్లు ఎలా పరిష్కరించారన్నది ఆకట్టుకుంటుంది. వెంకటేష్, నాగచైతన్య పోటీపడి నటించారు. కథ, కథనాలపై అవగాహన పెంచుకోవడానికి దర్శకుడు బాబీని పూర్తిగా ఫాలో అయ్యాను. ఓ అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఈ చిత్రానికి పనిచేసినట్లు అనిపించింది. వెంకటేష్, నాగచైతన్య తొలిసారి కలిసి నటిస్తుండటంతో ఈ సినిమా ద్వారా వారికో పెద్ద విజయాన్ని అందించాలనే బాధ్యతతో పనిచేశాను. ఈ సినిమాలోని 'ఎన్నాళ్లకో..' అనే రెట్రో సాంగ్‌కు ఎలక్ట్రానిక్ వాయిద్యాలు లేకుండా లైవ్ మ్యూజిక్ ద్వారా స్వరాలను సమకూర్చాం. ఈ పాటతో పాటు టైటిల్ సాంగ్‌కు మంచి స్పందన లభిస్తున్నది.

**ఏడాదిన్నర విరామం..**

భిన్నమైన కథాంశాలతో కూడిన సినిమాలకు సంగీతాన్ని అందించే అవకాశం లభిస్తుండటం ఆనందంగా ఉంది. 'సరైనోడు' నుంచి 'మహానుభావుడు' వరకు కెరీర్‌లో వచ్చిన ఏడాదిన్నర విరామం సంగీత దర్శకుడిగా స్వీయవిశ్లేషణ చేసుకునే అవకాశం దొరికింది. ప్రశంసలతో పాటు విమర్శల్ని సమానంగానే స్వీకరిస్తుంటాను. మన పనిని తిట్టేవాళ్లు ఉన్నప్పుడే తప్పుల్ని సరిదిద్దుకునే అవకాశం దొరుకుతుంది. విమర్శించిన వారిని నా స్వరాలతో సంతృప్తిపరచడానికే ప్రయత్నిస్తాను. నాపై వచ్చిన ప్రతి విమర్శకు సమాధానం ఇస్తుంటాను. ప్రతి సినిమా కథను రెండుమూడుసార్లు వింటాను. అప్పుడే గేయ రచయితలతో ఎలాంటి పాటలు రాయించాలి, నా స్వరాలతో ప్రేక్షకుల్ని ఎలా కనెక్ట్ చేయగలననే దానిపై అవగాహన ఉంటుంది.

**నిత్యవిద్యార్థిగా..**

అలనాటి సంగీతదర్శకులు, రచయితలు, గాయకుల్ని బాధపెట్టకూడదనే ఆలోచనతో రీమిక్స్ సాంగ్స్‌కు దూరంగా ఉంటున్నాను. ట్రెండ్, నంబర్‌గేమ్స్‌ను నేను ఫాలో అవ్వను. నిత్యవిద్యార్థిగా ఉండటమే ఇష్టం. ప్రతిరోజు కొత్త విషయాల్ని నేర్చుకుంటా. ప్రస్తుతం అల వైకుంఠపురములో, డిస్కోరాజా, ప్రతి రోజూ పండగే సినిమాలకు సంగీతాన్ని అందిస్తున్నాను.


తమన్

# నాటి రోజుల్ని గుర్తుకుతెస్తుంది


అల్లు అరవింద్, మమ్ముట్టి

**'చ**రిత్ర మరచిన యోధుల్ని సినీ పరిశ్రమ వెలుగులోకి తీసుకొస్తున్నది. 'సైరా'తో పాటు 'మామాంగం' ఆ కోవకు చెందిన సినిమానే. ఈ చారిత్రక చిత్రాన్ని మా సంస్థ ద్వారా తెలుగులో విడుదలచేయడం ఆనందంగా ఉంది' అని అన్నారు అల్లు అరవింద్. మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'మామాంగం'. పద్మకుమార్ దర్శకుడు. వేణు కున్నపిల్లి నిర్మాత. ఈ నెల 12న విడుదలకానుంది. తెలుగు ట్రైలర్‌ను మంగళవారం హైదరాబాద్‌లో నిర్మాత అల్లు అరవింద్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 'పదేళ్ల క్రితం పవన్‌కల్యాణ్‌తో తీయబోయే సినిమాలో విలన్ పాత్రను చేయగలరా అని మమ్ముట్టిని అడిగాను. ఇదే ప్రశ్నను చిరంజీవిని అడగగలరా అంటూ ఆయన తిరిగి నన్ను ప్రశ్నించారు. మమ్ముట్టి వ్యక్తిత్వానికి అది నిదర్శనం' అని పేర్కొన్నారు. మమ్ముట్టి మాట్లాడుతూ 'మాటలకందని ప్రయాణమిది. 16-18వ శతాబ్దం నాటి కథతో ఈ సినిమాను తెరకెక్కించాం. ప్రతి పన్నెండేళ్లకు ఒకసారి జరిగే మామాంగం అనే ఉత్సవం నేపథ్యంలో ఉత్కంఠభరితంగా ఉంటుంది. ఈ సినిమాలోని పోరాట ఘట్టాలు, సెట్స్‌లో ఎక్కడ కృతిమత్వం కనిపించదు. పీరియాడిక్ వాతావారణాన్ని సహజంగా పునఃసృష్టించాం. ఆనాటి రోజుల్లో ప్రతి ఒక్కరిని విహరించేలా చేస్తుంది. అన్ని భాషల వారికి కనెక్ట్ అవుతుంది' అని అన్నారు.


రాజ్ కందుకూరి, తరుణ్‌భాస్కర్, సురేష్‌బాబు, శివ, వర్ష, శేషసింధురావు

# ప్రణయంలో పదనిసలు

**శి**వ కందుకూరి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'చూసీ చూడంగానే'. శేష సింధురావు దర్శకురాలు. ధర్మపథ క్రియేషన్స్ పతాకంపై రాజ్ కందుకూరి నిర్మిస్తున్నారు. ఈ నెలాఖరులో విడుదల కానుంది. ఈ చిత్ర ట్రైలర్‌ను దర్శకుడు తరుణ్‌భాస్కర్, నిర్మాత డి.సురేష్‌బాబు విడుదల చేశారు. 'ఇంజినీరింగ్ చదివి వెడ్డింగ్ ఫొటోగ్రాఫర్‌గా స్థిరపడిన ఓ యువకుడి కథ ఇది. ప్రేమ ప్రయాణంలోని మధురభావనలకు, సంఘర్షణకు అద్దం పట్టే చిత్రమిది. ప్రతి సన్నివేశం హృదయాన్ని హత్తుకుంటుంది' అని చిత్ర బృందం తెలిపింది. సురేష్ ప్రొడక్షన్స్ సంస్థ అసోసియేషన్‌లో ఈ సినిమా విడుదలకానుంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: వేదరామన్, సంగీతం: గోపీసుందర్, సంభాషణలు: పద్మావతి విశ్వేశ్వర్. దర్శకత్వం: శేషసింధు రావు.


ప్రియమణి

# శశికళ పాత్రలో..

**ది**వంగత సినీనటి, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత జీవితం 'తలైవి' పేరుతో వెండితెరపై ఆవిష్కృతం కాబోతున్నది. జయలలిత పాత్రలో కంగనారనౌత్ నటిస్తున్నది. ఏ.ఎల్. విజయ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో శశికళ పాత్రను ప్రియమణి పోషించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. జయలలిత జీవితంలో శశికళ పాత్ర కీలకంగా ఉంటుంది. జయలలిత ప్రాణస్నేహితురాలిగా మరణం వరకు వెన్నంటి నిలిచారామె. ముఖ్యమైన ఈ పాత్ర కోసం పలువురు తారల పేర్లను పరిశీలించిన చిత్రబృందం ప్రియమణిని ఎంచుకున్నట్లు తెలిసింది. ఈ పాత్రకు తగినట్లుగా మేకోవర్ అయ్యే ప్రయత్నాల్లో ప్రస్తుతం ప్రియమణి ఉన్నట్లు సమాచారం. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విష్ణు ఇందూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.


తాప్సీ

# కవర్‌డ్రైవ్‌కు సిద్ధం

**ప్ర**యోగాత్మక కథాంశాలకు పెద్దపీట వేస్తూ బాలీవుడ్‌లో దూసుకుపోతున్నది పంజాబీ ముద్దుగుమ్మ తాప్సీ. ఇటీవల విడుదలైన 'సాండ్ కీ ఆంఖ్' చిత్రంలో షూటర్‌గా చక్కటి అభినయంతో మెప్పించింది. తాజాగా ఆమె మరో ఛాలెంజింగ్ పాత్రకు సిద్ధమవుతున్నది. భారత మహిళా క్రికెట్ అగ్రశేణి క్రీడాకారిణి మిథాలీరాజ్ జీవితం ఆధారంగా 'శభాష్ మిత్తు' పేరుతో ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో మిథాలీ పాత్రలో తాప్సీ నటిస్తున్నది. మంగళవారం మిథాలీరాజ్ పుట్టినరోజును పురస్కరించుకొని తాప్సీ ఆమెతో తీసుకున్న ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేసింది. 'ఎన్నో విషయాల్లో నువ్వు మాకు స్ఫూర్తి. వెండితెరపై నీ పాత్రను పోషించడం అదృష్టంగా భావిస్తున్నా. జన్మదినం సందర్భంగా నీకు ఎలాంటి బహూమతి ఇవ్వాలో తెలియదు కానీ...ఈ సినిమా ద్వారా నీవు గర్వపడేలా చేస్తానని మాటిస్తున్నాను' అని తాప్సీ భావోద్వేగంగా వ్యాఖ్యానించింది. ఈ సినిమా కోసం తాప్సీ బ్యాటింగ్‌కు సంబంధించిన ప్రాథమికాంశాలపై శిక్షణ తీసుకోనుంది. ముఖ్యంగా కవర్‌డ్రైవ్‌ను పర్‌ఫెక్ట్‌గా నేర్చుకోవడంపై దృష్టిపెడుతున్నానని తాప్సీ పేర్కొంది. రాహుల్ ఢోలాకియా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వయాకామ్ 18స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్నది.

# స్నేహితుడి పోరాటం


శైలజ

**ప**వన్,శైలజ జంటగా నటిస్తున్న చిత్రం 'మేరా దోస్త్'. జి.మురళి దర్శకుడు. పి.వీరారెడ్డి నిర్మిస్తున్నారు. ఈ నెల 6న విడుదలకానుంది. ఇటీవల హైదరాబాద్‌లో చిత్రబృందం పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'స్నేహం గొప్పతనాన్ని చాటిచెప్పే చిత్రమిది. ప్రేమజంటను ఏకం చేయడానికి ఓ స్నేహితుడు సాగించిన పోరాటమే ఈ చిత్ర ఇతివృత్తం. కుటుంబ అనుబంధాలు, ప్రేమకథకు వినోదాన్ని మేళవించి రూపొందించాం. మంచి సినిమా చూసిన అనుభూతిని ప్రతి ఒక్కరికి పంచుతుంది' అని తెలిపారు. దాదాపు 150 థియేటర్లలో సినిమాను విడుదలచేస్తున్నామని, కథ, కథనాలు, చిన్నా నేపథ్య సంగీతం ఈ చిత్రానికి ప్రధానాకర్షణగా నిలుస్తాయని నిర్మాత అన్నారు. ఈ సినిమాలో నటనకు ఆస్కారం ఉన్న ఓ మంచి పాత్రను పోషించానని హీరోయిన్ శైలజ చెప్పింది.




epaper.ntnews.com